# నినాదం

నిఖార్సైన జర్నలిజం

సోమవారం 19 జనవరి 2026 | సంపుటి: 22 | సంచిక: 117 | వెల: రూ.7 | పేజీలు: 12+12

Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam


## హైదరాబాద్-విజయవాడ హైవేపై వాహనాల రద్దీ



సంక్రాంతి సెలవులు ముగించుకుని పల్లెల నుంచి జనం హైదరాబాద్ బాటపట్టారు. దీంతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ కొనసాగుతోంది. చిట్యాల, పెద్దకాపర్తి, చౌటుప్పల్ ప్రధాన కూడల్లో వాహనాలు బారులు తీరాయి. కొర్లపహాడ్, పంతంగి టోల్ ప్లాజాల వద్ద వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. వాహనాల రద్దీని పోలీసులు క్రమబద్ధీకరిస్తున్నారు.

**-హైదరాబాద్, (నినాదం):**

# పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**ఎన్టీఆర్, వైయస్సార్ స్ఫూర్తితో పేదలకు సంక్షేమ ఫలాలు: సీఎం**

- ఎదులాపురం మునిసిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- మద్దులపల్లిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2

ఆదివారం ఖమ్మం జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, జిల్లా ఇంచార్జి మంత్రివర్యులు వాకాటి శ్రీహరి, నీటిపారుదల శాఖ మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ హౌసింగ్ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావులతో కలిసి పర్యటించి ఎదులా పురం మునిసిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు ఆనంతరం మద్దులపల్లిలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజా ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు.



## విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం: సీఎం

- 108 కోట్ల 60 లక్షలతో నిర్మించే జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల
- 162 కోట్ల 54 లక్షలతో మున్నేరు నుండి పాలేరు లింక్ కెనాల్ నిర్మాణం..
- 45 కోట్ల 50 లక్షలతో కూసుమంచి 100 పడకల ఆసుపత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపనలు
- 25 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, 19.9 కోట్లతో నిర్మించిన వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లకు ప్రారంభోత్సవాలు

3



## అక్రమ వలసదారులకు కాంగ్రెస్ ప్రోత్సాహం

**ఓట్ల కోసం అసోం భూమి చొరబాటుదారులకు అప్పగింత**

**కాంగ్రెస్ పై ప్రధాని మోదీ తీవ్ర విమర్శలు**

**సంక్షేమ ప్రాజెక్టులు బీజేపీ అభివృద్ధి మంత్రాన్ని బలోపేతం చేస్తున్నాయ్**

**బీజేపీ ప్రజల విశ్వాసం ఇటీవల బిహార్ ఎన్నికలలో రికార్డు ఓట్లు, సీట్లు సాధించింది.. అసోం ర్యాలీలో మోదీ**

2

కాంగ్రెస్ పాలనలో అసోం భూములు చొరబాటుదారుల చేతుల్లోకి వెళ్లాయని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపణలు చేశారు. ఓట్ల రాజకీయాల కోసమే అప్పట్లో అక్రమ వలసదారులను ప్రోత్సహించారని విమర్శించారు. అసోంలోని కలియాబోర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ దశాబ్దాల పాలనలో అసోంలో చొరబాట్లు పెరిగాయని, అడవులు, వన్యప్రాణుల మార్గాలు, సంప్రదాయ సంస్థలపై అక్రమ ఆక్రమణలు జరిగాయని చెప్పారు. బీజేపీ ప్రభుత్వం అసోం సంస్కృతి, గుర్తింపును కాపాడేందుకు చర్యలు తీసుకుంటోందని ప్రధాని పేర్కొన్నారు. అక్రమంగా భూములు ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

**- గువాహటి, నినాదం**

## బ్రిటీషర్ల కంటే బీజేపీతోనే ఎక్కువ ప్రమాదం



**సీఎం రేవంత్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు**

**కమ్యూనిస్టు పార్టీ శతజయంతి ఉత్సవాలకు ముఖ్య అతిథిగా సీఎం హాజరు**

**ఖమ్మం, జనవరి 18 (నినాదం)**

కమ్యూనిస్టు మిత్రులను స్ఫూర్తిగా తీసుకొని గత అసెంబ్లీ ఎన్నికల్లో పోరాడి.. పాశవికంగా వ్యవహరించిన ప్రభుత్వాలను పడగొట్టామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. దేశాన్ని పట్టి పీడిస్తున్న ...మిగతా 2లో

**తెలంగాణలో తెలుగుదేశం పార్టీ ఉండొద్దని ఆ పార్టీ నాయకత్వాన్ని దెబ్బ తీసిన బీఆర్ఎస్ పార్టీని, ఆ పార్టీ నాయకుడు కేసీఆర్‌ను వంద మీటర్ల గొయ్యి తీసి పాతిపెట్టాలి, బీఆర్ఎస్ నాయకులు గద్దెలు దిగాలి... ఊళ్లల్లో ఆ పార్టీ దిమ్మెలు కూలాలని, అప్పుడే నందమూరి తారక రామారావుకు, వైఎస్ రాజశేఖర్ రెడ్డికి నిజమైన నివాళులర్పించినవారమవుతాం**

**-సీఎం రేవంత్ రెడ్డి**

## పాముకు కోరల్లో విషం.. విపక్షానికి ఒంటి నిండా విషమే!

**మున్సిపల్ ఎన్నికల్లోనూ డిపాజిట్లు గల్లంతు కావాలి: మంత్రి పొంగులేటి**

**69 శాతం పంచాయతీల స్ఫూర్తితో పట్టణాల్లోనూ పాగా వేద్దాం**

**పేదవాడి పక్షపాతిగా ప్రజా ప్రభుత్వం.. విపక్షాల కారుకూతలు నమ్మొద్దు**

**ఖమ్మం, జనవరి 18 (నినాదం)**



"పాముకు కేవలం కోరల్లోనే విషం ఉంటుంది.. కానీ పదేళ్లపాటు రాష్ట్రాన్ని దోచుకుని, అప్పుల పాలు చేసిన ఆ నాయకులకు ఒంటి నిండా విషమే ఉంది. వారు చేసిన పాపాలు బయటపడతాయనే భయంతో ప్రజా ప్రభుత్వంపై నిత్యం విషం కక్కుతున్నారు" అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆదివారం మద్దులపల్లిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. రాబోయే మున్సిపల్ ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపిన ఆయన, విపక్షాల తీరును ఎండగట్టారు.

**ప్రజా తీర్పుతో చెంప చెళ్లుమంది!**

అసెంబ్లీ, పార్లమెంటు, కంటోన్మెంట్ ...మిగతా 2లో

## మేడారానికి పోటెత్తిన భక్తులు



*మహాజాతరకు ముందే మేడారానికి భక్తులు పోటెత్తారు. వరుస సెలవులు కావడంతో భారీగా రద్దీ నెలకొంది. దీంతో వనదేవతలు సమ్మక్క, సారలమ్మ గద్దెల ప్రాంగణం కిటకిటలాడుతోంది. భక్తులు మొక్కులు చెల్లించుకుంటున్నారు. మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన నేడు మేడారంలో మంత్రివర్గ సమావేశం జరగనున్న నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.* **-మేడారం, (నినాదం)**

## ఎవరినీ బాధపెట్టాలనేది నా ఉద్దేశం కాదు

'భారత్ నాకు స్ఫూర్తి-ఇండియానే నా గురువు' కాంట్రవర్సీ కామెంట్స్‌పై ఏఆర్ రెహమాన్ వివరణ



2

## దిమ్మెలు టచ్ చేస్తే... దిమ్మతిరిగేలా బదులిస్తాం

**హరీష్ రావు ఆగ్రహం**



***ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖమ్మంలో చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభా పక్ష డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టారు.***

***- హైదరాబాద్, (నినాదం)***

2



## కాంగ్రెస్‌లో చేరి తప్పు చేశా

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు**

**హైదరాబాద్, జనవరి 18 (నినాదం):** మున్సిపల్ ఎన్నికల వేళ పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదివారం ముఖ్య అనుచరులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు.

2

## ధీరత్వమే దైవత్వంగా మారిన చారిత్రక సత్యం

**కాకతీయుల కత్తిని ఎదిరించిన వీరవనితలు సమ్మక్కసారలమ్మలు**



- దక్షిణాది కుంభమేళ తరహాలో మేడారం మహా జాతర
- మేడారం ఆలయ అభివృద్ధి నా అదృష్టంగా భావిస్తున్నా
- మంత్రివర్గ సమావేశం చరిత్రలో నిలుస్తుంది: సీఎం రేవంత్

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):**

వీరవనితల ధీరత్వమే దైవత్వంగా మారిన చారిత్రక సత్యమే మేడారం మహోత్సవమని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. మేడారం మహాజాతర ఏర్పాట్ల పరిశీలనలో బాగంగా ఆదివారం డెప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పర్యటించిన ఆయన మేడారంలో మంత్రివర్గ సమావేశం నిర్వహించి పలు కీలక అంశాలపై చర్చించారు. అనంతరం ఏర్పాటు ...మిగతా 2లో

## ఎవరినీ బాధపెట్టాలనేది నా ఉద్దేశం కాదు

**న్యూఢిల్లీ, జనవరి 18 (నినాదం):**

బాలీవుడ్‌పై ప్రముఖ సంగీత దర్శకుడు AR రెహమాన్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు తీవ్ర దూమారం రేపిన నేపథ్యంలో ఆయన స్పష్టతనిచ్చారు. కొన్ని సందర్భాల్లో ఒకరి ఉద్దేశాలను ఇతరులు తప్పుగా అర్థం చేసుకునే అవకాశం ఉందని తన మాటలతో ఎప్పుడూ ఎవరినీ బాధ పెట్టాలని కోరుకోలేదన్నారు. ఈమేరకు ఇన్‌స్టాగ్రామ్‌లో రెహమాన్ ఓ వీడియో పోస్ట్ చేశారు. తనకు భారతదేశం స్ఫూర్తి అని, ఇండియానే తన గురువు, ఇల్లు అని అన్నారు. భారతీయుడిగా ఉండటం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పిన రెహమాన్, సంగీతమనేది ఎల్లప్పుడూ దేశ సంస్కృతిని అనుసంధానించేందుకు, వేడుకగా చేసుకునేందుకు, గౌరవించేందుకు ఒక మార్గంగా ఉందని తెలిపారు.
వేవ్స్ సమిట్‌లో ప్రధాని మోదీ ఎదుట ప్రదర్శించిన ఝూలా సంగీతం నుంచి యువ నాగా సంగీతకారులతో కలిసి పనిచేయడం వరకు ప్రతి ప్రయాణం తన లక్ష్యాలను బలపర్చిందని చెప్పారు. దేశంలో మొట్టమొదటి మల్టీకల్చరల్ వర్చువల్ బ్యాండ్‌ను సృష్టించడం నుంచి హాన్స్ జిమ్మర్‌తో కలిసి రామాయణం సినిమాకు సంగీతం అందించిన ప్రతి ప్రయాణం సైతం తన లక్ష్యాలకు బలపరిచినట్టు పేర్కొన్నారు.
కొద్దిరోజుల క్రితం 'బీబీసీ ఏషియన్ నెట్‌వర్క్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో రెహమాన్ మాట్లాడుతూ బాలీవుడ్‌లో తనకు అవకాశాలు తగ్గడంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. హిందీ చిత్ర పరిశ్రమలో అధికార కేంద్రాలు మారాయని, సృజనాత్మకత లేని వ్యక్తుల చేతుల్లోకి నిర్ణయాధికారాలు వెళ్లాయని పేర్కొన్నారు. ఇదే క్రమంలో, తనకు అవకాశాలు రాకపోవడానికి మతపరమైన కోణంకూడా ఉండి ఉండవచ్చని, ఆ విషయం నేరుగా కాకపోయినా ఇతరుల ద్వారా తన చెవిన పడిందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో పెద్ద దుమారాన్నే రేపాయి. దీనిపై పలువురు ప్రముఖులు అభ్యంతరం వ్యక్తం చేశారు. రెహమాన్ వ్యాఖ్యలు ప్రమాదకరంగా ఉన్నాయని రచయిత్రి శోభా డే మండిపడ్డారు. రెహమాన్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడాన్ని తాను నమ్మలేకపోతున్నానని, మతం కారణంగానే ఆయనకు అవకాశాలు తగ్గుతున్నాయనే దాన్ని నమ్మనని ప్రముఖ స్క్రీన్ రైటర్ జావేద్ అక్తర్ పేర్కొన్నారు. ఒకవేళ అదే కారణమైతే కొందరు హీరోలు ఇప్పుడు స్టార్ హీరోలుగా ఉండేవారు కాదని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలోనే రెహమాన్ వివరణ ఇచ్చారు.

## బ్రిటీషర్ల కంటే బీజేపీతోనే ఎక్కువ ప్రమాదం

మొదటి పేజీ తరువాయి

పాశవిక శక్తులను ఓడించడానికి ప్రతిజ్ఞ చేయాల్సిన అవసరముందన్నారు. సీపీఐ శతాబ్ది ముగింపు ఉత్సవాలు ఖమ్మంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఖమ్మంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు రేవంత్‌రెడ్డితో పాటు పలువురు మంత్రులు, సీపీఐ అగ్రనేతలు హాజరయ్యారు. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన సీపీఐ శ్రేణులతో ఖమ్మం నగరం ఎరుపెక్కింది. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ‘‘కాంగ్రెస్, కమ్యూనిస్టు సోదరులు కొట్లాడితేనే దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. దున్నేవాడిదే భూమి అని కమ్యూనిస్టు పార్టీ నినాదం ఇస్తే.. దానికి చట్టరూపం కల్పించింది కాంగ్రెస్ సర్కారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కాంగ్రెస్ పార్టీ తీసుకొచ్చింది. రజాకార్లకు, నిజాంకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు పోరాడారు. ఆనాడు జరిగిన సాయుధ రైతాంగ పోరాటంలో 4 వేల మంది వీరులు అమరులయ్యారు. మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా ఎర్రజెండా తలెత్తి నిలబడుతుంది. కమ్యూనిస్టుల కంచుకోట ఖమ్మంలో ఈ సభ జరగడం హర్షణీయం. బ్రిటీషర్ల కంటే ఎక్కువ ప్రమాదం భాజపాతోనే. భాజపా అంటే బ్రిటీష్ జనతా పార్టీ. విభజించు, పాలించు, పేదవాళ్లను అణగదొక్కాలని బ్రిటీషర్ల నుంచి వచ్చిన ఆలోచనతోనే... ఇవాళ మనల్ని అణచివేయాలని చూస్తోంది. ఆనాడు కమ్యూనిస్టులు, కాంగ్రెస్ పార్టీ కలిసి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని తీసుకొస్తే.. ఇవాళ ఆ పథకాన్ని రద్దు చేశారు. నరేంద్ర మోదీ కార్పొరేట్ కంపెనీల చేతిలో కీలుబొమ్మగా మారి ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడిచి.. మల్టీ నేషనల్ కంపెనీలకు మన హక్కులను తాకట్టు పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఉపాధి హామీ పథకం రద్దుతో మళ్లీ వలసలు మొదలవుతాయి. రాజ్యాంగాన్ని సమూలంగా మార్చడానికి, పేదల హక్కులు కొల్లగొట్టడానికి భాజపా 400 సీట్లు అడిగింది. కానీ, రాహుల్ గాంధీ, కమ్యూనిస్టులు ప్రజల దగ్గరకు వెళ్లి చెప్పడంతో.. 240 సీట్ల వద్దే ఆ పార్టీ ఆగింది. రాజ్యాంగాన్ని దెబ్బ తీసేందుకు మళ్లీ ఎస్ఐఆర్ తీసుకొచ్చారు. ఎస్ఐఆర్ ద్వారా పేదల ఓటు హక్కును కేంద్రం రద్దు చేస్తోంది’’ అని సీఎం ఆరోపించారు.

## దిమ్మెలు టచ్ చేస్తే... దిమ్మతిరిగేలా బదులిస్తాం

‘‘ముమ్మాటికీ రేవంత్ రెడ్డిది ద్రోహ చరిత్రే.. అడుగడుగునా వెన్నుపోట్లు.. అనుక్షణం అబద్ధాలు.. ఆయన రాజకీయ ప్రస్థానమే ద్రోహాల పుట్ట. ద్రోహ బుద్ధి అనేది రేవంత్ రెడ్డి డీఎన్ఏలోనే ఉంది. సమైక్యవాదుల కొమ్ముకాస్తూ, స్వరాష్ట్ర కాంక్షతో పోరాడిన ఉద్యమకారుల మీద తుపాకీ ఎక్కుపెట్టిన తెలంగాణ ద్రోహి రేవంత్ రెడ్డి. చంద్రబాబు తరపున ఎమ్మెల్యేలను కొనేందుకు నోట్ల బ్యాగులు మోస్తూ రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయిన 'ఓటుకు నోటు' దొంగ, ప్రజాస్వామ్య ద్రోహి రేవంత్. ఎన్టీఆర్ జన్మపర్యంతం ద్వేషించిన కాంగ్రెస్‌లో చేరి, నమ్మిన పార్టీకి, నాయకుడికి వెన్నుపోటు పొడిచిన టీడీపీ ద్రోహి రేవంత్. సీఎం పదవి అనుభవిస్తూనే, కేంద్రంలోని బీజేపీతో చీకటి స్నేహాలు చేస్తూ సోనియా గాంధీని, రాహుల్ గాంధీని వంచిస్తున్న కాంగ్రెస్ ద్రోహి రేవంత్. కంచె చేను మేసినట్టు తానే ముఖ్యమంత్రి అయి ఉండి, రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగేలా బనకచర్ల లాంటి ప్రాజెక్టులకు కోసం పొరుగు రాష్ట్ర ప్రయోజనాలకు పని చేస్తున్న తెలంగాణ రాష్ట్ర ద్రోహి రేవంత్. దేశవ్యాప్తంగా బీజేపీ సర్కార్‌ను కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తూ ఉంటే.. రేవంత్ మాత్రం బీజేపీ ప్రభుత్వాన్ని భుజాన మోస్తున్నారు. దీనికి తోడు టీడీపీపై బహిరంగంగా అభిమానం కురిపించడం. వీటి వెనుక మతలబు ప్రజలు గమనించాలి. ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్ జెండా దిమ్మెలను కూల్చాలని, ఒక ముఖ్యమంత్రి బహిరంగంగా పిలుపునివ్వడం అంటే.. అది రాష్ట్రంలో శాంతిభద్రతలను ప్రత్యక్షంగా దెబ్బతీయడమే. ఇది నేరాన్ని ప్రోత్సహించడమే అవుతుంది. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసు బాధ్యత ఎటు పోయింది?. సాక్షాత్తూ ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి, శాంతి భద్రతలను కాపాడే హోమ్ శాఖను నిర్వహిస్తున్న వ్యక్తి ఇంత బహిరంగంగా నేర చర్యలను, విద్వేషాలను రెచ్చగొడుతుంటే రాష్ట్ర డీజీపీ ఎందుకు మౌనంగా ఉన్నారు?. చట్టం అందరికీ ఒక్కటేనని నిరూపించే ధైర్యం పోలీస్ శాఖకు ఉందా?. రాజకీయంగా ఎదుర్కోలేక, భౌతిక దాడులకు, ఆస్తుల ధ్వంసానికి సీఎం పిలుపునివ్వడం రేవంత్ దిగజారుడుతనానికి నిదర్శనం. ఇలాంటి చర్యలతో తెలంగాణలో అరాచకాన్ని సృష్టించాలని చూస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారు. బీఆర్ఎస్ దిమ్మెలు కూలగొడితే రేవంత్ దిమ్మతిరిగేలా బదులిస్తాం, ప్రజాక్షేత్రంలో ప్రజల చేతనే గుణపాఠం నేర్పుతాము. తెలంగాణలో రాజ్యాంగం అమలవుతోందా లేక రేవంత్ రాజ్యాంగం నడుస్తోందా?’ అని హరీష్ రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**ఖమ్మం ప్రతినిధి, జనవరి 18 (నినాదం)**



పేదల సంక్షేమమే ప్రభుత్వలక్ష్యమని ఎన్టీఆర్, వైయస్సార్ స్ఫూర్తితో పేదలకు సంక్షేమ కార్యక్రమాలను రాష్ట్రంలో అమలు చేస్తున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... ఖమ్మం జిల్లా ప్రజలు తనకు ఎల్లప్పుడూ అండగా ఉన్నారని అన్నారు. సంక్షేమ పథకాల అమలులో ఎన్టీఆర్, వైఎస్సార్ పేర్లు శాశ్వతంగా నిలిచి పోతాయని తెలిపారు. గతంలో తెలుగు వారు అంటే మద్రాసీలు అనే పేరు ఉండేదని, తెలుగువారి ఆత్మ గౌరవానికి ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప నాయకులు ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఈ వేదిక నుంచి వారికి నివాళులు అర్పిస్తున్నామని అన్నారు. పేదలు కడుపు నిండా అన్నం తినాలని ఉద్దేశ్యంతో ఆ రోజులలో రెండు రూపాయ లకు కిలో బియ్యం పథకాన్ని ప్రవేశ పెట్టారని, మన రాష్ట్ర ప్రభుత్వం నేడు మూడు కోట్ల 17 లక్షల మంది లబ్ధిదారులకు నెలకు 6 కిలోల చొప్పున సన్న బియ్యం ఉచితంగా సరఫరా చేస్తూ పేదల ఆకలి తీరుస్తున్నామని అన్నారు. ప్రజా ప్రభుత్వంలో అర్హులైన నిరు పేద లందరికీ నూతన రేషన్ కార్డులు జారీ చేశామని, ఇంకా ఎవరైనా రేషన్ కార్డు లేని అర్హులు ఉంటే వెంటనే మంజూరు చేస్తామని అన్నారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే రైతులకు ఉచిత కరెంటుపై మొదటి సంతకం చేయడమే కాకుండా 1300 కోట్ల విద్యుత్ బకాయిలు రద్దుచేసి, వేలాది మంది రైతులపై ఉన్న కేసులను తొలగించిన మహానుభావుడు వైఎస్ఆర్ అని అన్నారు. ఆయన స్ఫూర్తితో నేడు 24 గంటల పాటు రైతులకు ఉచిత విద్యుత్ అందించడంతో పాటు పేదలకు నెలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ 52 లక్షల పేదల కుటుంబాలకు, 30 లక్షల పంపు సెట్ లకు 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు ఉండాలని గతంలో వైయస్సార్ 25 లక్షల ఇండ్లు నిర్మిస్తే, గత పాలకులు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరిట మోసం చేశారని సీఎం విమర్శించారు.

ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నాయకత్వంలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసి భద్రాచలంలో శ్రీరామ చంద్రమూర్తి సాక్షిగా ప్రవేశ పెట్టామని అన్నారు. ఉచిత సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని కూడా ఖమ్మం జిల్లాలో ప్రారంభించామని అన్నారు. ఏప్రిల్ నెల తర్వాత పట్టణ ప్రాంతాలలో ఉన్న పేదలకు రెండవ విడత ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసే బాధ్యత తీసుకుంటామని అన్నారు.

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ... ఇరిగేషన్, ఎడ్యుకేషన్, హెల్త్ రంగాలకు సంబంధించి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు అవసరమైన అన్ని పనులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో చేపట్టామని అన్నారు. ఇరిగేషన్ కు సంబంధించిన మున్నేరు పాలేరు లింకు, ఎడ్యుకేషన్ సంబంధించి జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల శంకుస్థాపన, నర్సింగ్ కళాశాల ప్రారంభోత్సవం, హెల్త్ కు సంబంధించి కూసుమంచిలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందని అన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి లభించే విధంగా అవసరమైన పరిశ్రమలను కూడా ఉమ్మడి ఖమ్మం జిల్లాకు తీసుకొని రావలసిన అవసరం ఉందని అన్నారు. జిల్లాకు పరిశ్రమల పార్కు ప్రత్యేకంగా మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని డిప్యూటీ సీఎం కోరారు.

నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం 50 నుంచి 60 టీఎంసీల మున్నేరు నది జలాలు వృధాగా బంగాళాఖాతంలో కలుస్తున్నాయని, ముల్కనూర్ గ్రామం వద్ద చెక్ డ్యాం నుంచి 9.6 కిలో మీటర్ల గ్రావీటి కాల్వ ద్వారా మున్నేరు పాలేరు లింక్ కేనాల్ పనులకు ప్రభుత్వం 162 కోట్లతో చేపట్టామని, ఈ ప్రాజెక్టు ద్వారా 2 మెగా వాట్ల హైడల్ విద్యుత్ ఉత్పత్తి, లక్షా 50 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందని అన్నారు. గత పాలకుల పాలనలో సీతారామ ఎత్తిపోతల పథకం డిస్ట్రిబ్యూటరీ కెనాల్ నిర్మాణానికి ఒక ఎకరం కూడా భూ సేకరణ చేయలేదని విమర్శించారు. గోదావరి నది జలాల ద్వారా ఖమ్మం జిల్లాలో ఆరు లక్షల 80 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు పనులు వేగవంతం చేశామని అన్నారు. 4వ పంప్ హౌస్ పనులు వేగవంతం అవుతున్నాయని అన్నారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత సీతారామ ఎత్తిపోతల పథకానికి 67 టిఎంసిల నీటి కేటాయింపు చేయడం జరిగిందని అన్నారు. మున్నేరు పాలేరు నది లింక్ కేనాల్ ద్వారా ప్రతి సంవత్సరం దాదాపు 120 కోట్ల విద్యుత్ ఆదా అవుతుందని అన్నారు. మున్నేరు పాలేరు లింక్ కాల్వ పనులు సంవత్సరంలోగా పూర్తి చేసి ప్రారంభిస్తామని అన్నారు.

జిల్లా ఇంచార్జి మంత్రివర్యులు వాకాటి శ్రీహరి మాట్లాడుతూ... అతి తక్కువఖర్చుతో లక్ష యాభై వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ కోసం మున్నేరు పాలేరు లింకు పనులను ప్రజా ప్రభుత్వం చేపట్టిందని అన్నారు. పేద ప్రజల కోసం ప్రజా ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు పంచాయతీ ఎన్నికలలో ఆమోదం తెలిపిన విధంగానే రాబోయే మున్సిపల్ ఎన్నికలలో కూడా ఆశీర్వదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వ్యవసాయ శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ.. గోదావరి జలాలను ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉన్న 10 అసెంబ్లీ నియోజకవర్గాలకు తరలించాలనేదే తన లక్ష్యమని చెప్పారు. సీతారామ ఎత్తిపోత్తల పథకం సవరించిన అంచనాలకు ప్రభుత్వం ఇటీవల ఆమోదం తెలిపిందని, కాల్వల నిర్మాణానికి భూ సేకరణ చేస్తున్నామని, భవిష్యత్తులో కృష్ణ జలాలు ఇబ్బందులు ఉన్నప్పటికీ నాగార్జున సాగర్ 3 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ కోసం గోదావరి జలాలను వినియోగిస్తామని అన్నారు. మంచినీటికి, సాగునీటికి ఇబ్బందులు పడుతూ కరువుతో తల్లాడిన పాలేరు నియోజకవర్గంలో భక్త రామదాసు ప్రాజెక్టు పూర్తి చేసి పసిడి పంటలు, పామాయిల్ హబ్ గా తీర్చిదిద్దామని అన్నారు. ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో రైతులు వాణిజ్య పంటలు పండించి ఆర్థికంగా బలోపేతం అయ్యే విధంగా చర్యలు చేపట్టామని అన్నారు. అన్ని గిరిజన తండాలకు రహదారులు వేసే అవకాశం, నాలుగు మండలాలకు జాతీయ రహదారులు తీసుకొచ్చే అవకాశం తనకు కలిగిందని తెలిపారు. రెవెన్యూ హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ బంగాళాఖాతంలో వృథాగా కలిసే మున్నేరు నది జలాలను 9.6 కిలో మీటర్ల మేర త్రవ్వి గ్రావిటీ కెనాల్ ద్వారా పాలేరు రిజర్వాయర్ లో కలిపేందుకు 162 కోట్లతో చేపట్టిన మున్నేరు పాలేరు లింక్ కెనాల్ పనులకు నేడు శంకుస్థాపన చేసుకోవడం సంతోషంగా ఉందని, దీని ద్వారా నాగార్జున సాగర్ క్రింద ఉన్న లక్షా 50 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందని అన్నారు. గ్రామ పంచాయతీ ఫలితాలు అద్భుతంగా వచ్చాయని, అదే విధంగా ఖమ్మం జిల్లాలోని మున్సిపాలిటీలు, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కు జరగబోయే ఎన్నికలలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీ లు రామసహాయం రఘురాం రెడ్డి, మల్లు రవి, ఎమ్మెల్యేలు రాందాస్ నాయక్, మట్టా రాగమయి, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, కార్పొరేషన్ చైర్మన్లు రాయల నాగేశ్వర రావు, మువ్వా విజయ్ బాబు, నాయుడు సత్యనారాయణ, ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ, ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ వలసదారులకు కాంగ్రెస్ ప్రోత్సాహం

మొదటి పేజీ తరువాయి

అసోం గుర్తింపును రక్షించడమే తమ లక్ష్యమని, భూముల్ని కాపాడుతూ అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తున్నామని అన్నారు. కాంగ్రెస్ నెగెటివ్ రాజకీయాలకు ప్రజలు ఇక మద్దతు ఇవ్వడం లేదని ప్రధాని స్పష్టం చేశారు. అభివృద్ధికి స్పష్టమైన అజెండా లేకపోవడంతో కాంగ్రెస్ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. దేశవ్యాప్తంగా బీజేపీ ప్రజల తొలి ఎంపికగా మారిందని, మంచి పాలన, అభివృద్ధి కోసం ప్రజలు బీజేపీపై నమ్మకం పెట్టుకుంటున్నారని చెప్పారు. ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలను ఉదహరిస్తూ, బీజేపీపై ప్రజల విశ్వాసం మరింత బలపడిందని మోదీ పేర్కొన్నారు. బిహార్‌లో 20 ఏళ్ల తర్వాత కూడా రికార్డు ఓట్లు, సీట్లు బీజేపీకే వచ్చాయని గుర్తుచేశారు. మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికల్లోనూ బీజేపీకి ప్రజలు రికార్డు మద్దతు ఇచ్చారని తెలిపారు. కాంగ్రెస్ జన్మస్థలమైన ముంబైలోనే ఆ పార్టీ నాలుగో, ఐదో స్థానాలకు పరిమితమైందని వ్యాఖ్యానించారు. కేరళలో తొలిసారిగా బీజేపీ మేయర్ ఎన్నికయ్యారని, రాజధాని తిరువనంతపురంలో బీజేపీ పాలనలో ఉందని చెప్పారు. దేశం అంతటా ప్రజలు అభివృద్ధి, పాలనతో పాటు వారసత్వానికి గౌరవం కోరుకుంటున్నారని అన్నారు.
ఆ తర్వాత అసోంలో అభివృద్ధి ప్రాజెక్టులపై కూడా ప్రధాని వివరించారు. రూ.6,957 కోట్లతో కాజీరంగా ఎలివేటెడ్ కారిడార్‌కు శంకుస్థాపన చేశామని తెలిపారు. ఈ కారిడార్ వల్ల వరదల సమయంలో వన్యప్రాణులకు సురక్షిత మార్గం అందుబాటులోకి వస్తుందని చెప్పారు. 2025లో కాజీరంగా జాతీయ ఉద్యానవనంలో ఒక్క రైనో కూడా వేటకు బలికాకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. పర్యావరణం, ఆర్థిక అభివృద్ధి రెండూ కలిసి సాగవచ్చని భారత్ ప్రపంచానికి చూపించిందని అన్నారు.
అసోం అభివృద్ధి వల్ల మొత్తం ఈశాన్య భారతానికి అవకాశాలు పెరుగుతున్నాయని, యాక్ట్ ఈస్ట్ పాలసీతో ఈ ప్రాంతం కొత్త ఎత్తులకు చేరుకుంటుందని ప్రధాని చెప్పారు. గువాహటిలో లోకప్రియ గోపీనాథ్ బోర్దోలోయ్ అంతర్జాతీయ విమానాశ్రయ విస్తరణ, నామ్రూప్‌లో అమోనియా-యూరియా కాంప్లెక్స్ వంటి ప్రాజెక్టులు బీజేపీ వికాస్ భీ, విరాసత్ భీ మంత్రాన్ని బలోపేతం చేస్తున్నాయని అన్నారు.
అసోం సంస్కృతిపై ప్రశంసలు కురిపించిన మోదీ, గువాహటిలో జరిగిన బాగురుంబ ద్వౌ నృత్య కార్యక్రమాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. 10 వేల మందికి పైగా కళాకారులు పాల్గొన్న ఈ కార్యక్రమం అద్భుతంగా సాగిందన్నారు. బోడో సమాజపు కళాకారుల కృషిని ప్రశంసిస్తూ, సోషల్ మీడియాలో ఈ నృత్యం ట్రెండ్ కావడం అసోం సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేస్తోందని తెలిపారు. సభలో ప్రధాని తన చిత్రాలు, స్కెచ్‌లు పట్టుకున్న అభిమానులను గమనించి, వాటిని సేకరించమని తన బృందాన్ని ఆదేశించారు. చిరునామాలు ఉంటే వారికి వ్యక్తిగతంగా లేఖలు పంపిస్తానని హామీ ఇచ్చారు.

## ధీరత్వమే దైవత్వంగా మారిన చారిత్రక సత్యం

మొదటి పేజీ తరువాయి



చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ఆనాడు కాకతీయుల కత్తికి ఎదురుతిరిగిన వీరవనితలు సమ్మక్క సారలమ్మలని ఆయన వివరించారు. ఆదివాసీ గిరిజనల కోసంపోరాటం చేసిన సమ్మక్క సారలమ్మలు వీరవనితలు నిలిచారని, అడవిబిడ్డలకు ఆరాధ్యదైవాలుగా నిలిచారని ఆయన కొనియాడారు. దట్టమైన అటవీ ప్రాంతంలో ఆదివాసీలు జరుపుకునే మహోత్తరమైన వేడుక మేడారం జాతర అని, ఇక్కడ గుడి లేని తల్లులను గుండె నిండా కొలుచుకోవడం ఆనవాయితీగా వస్తోందని, తెలంగాణాలో అతిపెద్ద గిరిజన జాతరగా పేరు వచ్చిందన్నారు. ప్రపంచ స్థాయిలో మేడారం మహాజాతర కీర్తించబడేలా తెలంగాణ ప్రజాప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోందని, దక్షణాధి కుంభమేళ తరహాలో నిర్వహిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పెద్ద ఎత్తున నిధులు వెచ్చించి వెయ్యేళ్ల చరిత్ర మరో వందేళ్లు చదిరిపోకుండా ప్రతి గుండెలో నిలిచిపోయేలా జాతరకు ఏర్పాట్లు జరుగుతున్నాయని అన్నారు. ఆనాడు 2023 ఫిబ్రవరి 06 ప్రజా కంఠక పాలనను గద్దె దించాలని ఇక్కడి నుంచే పాదయాత్ర ప్రారంభించానని, తల్లుల దీవెనలతో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. తమ పాలనలో మేడారం ఆలయ అభివృద్ధి చేసే అవకాశం రావడం అదృష్టంగా బావిస్తున్నట్లు చెప్పారు. చరిత్రలో ఎక్కడా లేని విధంగా వంద రోజుల్లో రాతి కట్టడాలతో తల్లుల ప్రాంగణాన్ని అభివృద్ధి చేయాలని ఆదేశించామని, ఆ దిశగానే పనులు పూర్తవుతున్నట్లు తెలిపారు. జాతర నాటికి మేడారం అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు.
జీవితంలో ఏం చేశామని వెనక్కితిరిగి చూసుకుంటే గిరిజనుల కోసం సమ్మక్క సారలమ్మ ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని గర్వంగా చెప్పుకుంటానని ఆయన అన్నారు. ఆనాడు తల్లులకు మొక్కిన మొక్కులను తీర్చుకున్నానని ఆయన తెలిపారు. లక్షలాది మంది భక్తులు తల్లుల దర్శనం కోసం వచ్చి జంపన్న వాగులో స్నానాలు ఆచరిస్తారని, ఈ క్రమంలో జంపన్న వాగులో నిరంతరం నీరు పారించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రామప్ప, లక్నవరం నుంచి జంపన్న వాగుకు నీరు తరలిస్తామని ఆయన తెలిపారు. సోమవారం ఉదయం సమ్మక్క- సారక్క ఆలయాన్ని ప్రారంభించుకుని భక్తులకు అంకితం చేస్తామని, ప్రపంచ చరిత్రలో నిలిచేలా మేడారం మహా జాతర ఘనంగా నిర్వహిస్తామని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు ఉత్తం కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ధనసరి సీతక్క, అడ్లూరి లక్ష్మణ్, విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్, మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, దొంతి మాధవ రెడ్డి, డాక్టర్ మురళి నాయక్, యశస్విని రెడ్డి, వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, స్టేట్ ఫైనాన్స్, ఆయిల్ ఫెడ్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, జంగా రాఘవరెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ప్రాజెక్ట్ డైరెక్టర్ చిత్రా మిశ్రా, తదితరులు పాల్గొన్నారు.

## పాముకు కోరల్లో విషం.. విపక్షానికి ఒంటి నిండా విషమే!

మొదటి పేజీ తరువాయి

బై ఎలక్షన్లలో ప్రజలు ఇప్పటికే కాంగ్రెస్‌కు పట్టం కట్టారని పొంగులేటి గుర్తు చేశారు. "సెమీ ఫైనల్స్ అని కారుకూతలు కూస్తున్న చిచ్చర పిడుగులకు, టిల్లూలకు మొన్నటి పంచాయతీ ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 69 శాతం గ్రామ పంచాయతీలను కాంగ్రెస్ గెలుచుకోవడం మా ప్రభుత్వానికి ప్రజలు ఇచ్చిన రెఫరెండం. ఇదే జోరు మున్సిపల్ ఎన్నికల్లోనూ కొనసాగాలి. ఉమ్మడి జిల్లాలోని ఏడు మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లో ప్రత్యర్థుల డిపాజిట్లు గల్లంతు చేసి, కాంగ్రెస్ జెండా ఎగురవేయాలి" అని శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

**వృథా జలాలకు అడ్డుకట్ట.. సాగుకు భరోసా**

జిల్లా ప్రగతిలో సాగునీటి ప్రాజెక్టులు చారిత్రక మైలురాయిగా నిలుస్తాయని మంత్రి పేర్కొన్నారు. రూ. 162.54 కోట్లతో నిర్మించే మున్నేరు-పాలేరు లింక్ కెనాల్ ద్వారా 1.50 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందని వివరించారు. రూ. 108.60 కోట్లతో జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల, రూ. 45.50 కోట్లతో కూసుమంచిలో 100 పడకల ఆసుపత్రి భవన నిర్మాణాలకు శ్రీకారం చుట్టడం జిల్లా యువతకు, పేదలకు వరమని కొనియాడారు.

**కార్యకర్తలే నా బలం..**

తమను గెలిపించడానికి అహోరాత్రులు శ్రమించిన కార్యకర్తలను ప్రజాప్రతినిధుల స్థానంలో కూర్చోబెట్టే బాధ్యత తమదేనని మంత్రి భరోసా ఇచ్చారు. "మీ కష్టాన్ని నేను మరువను. పేదవాడికి భద్రత, భరోసా కల్పించడమే ధ్యేయంగా రేవంత్ రెడ్డి నాయకత్వంలో మా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఎన్ని అడ్డంకులు వచ్చినా అభివృద్ధి ఆగదు" అని స్పష్టం చేశారు.

## కాంగ్రెస్‌లో చేరి తప్పు చేశా

అప్పటి పరిస్థితుల వల్ల కాంగ్రెస్‌లో చేరాల్సి వచ్చింది. చేరినా ఏం లాభం జరుగలేదు. కాంగ్రెస్‌లో చేరి తప్పు చేశాను. మూడుసార్లు బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచా. ఇందులోనే ఉండి ఉంటే బాగుండేది. ఇప్పటికైనా మించిపోయిందేమీ లేదు. రేపు జరుగబోయే మున్సిపల్ ఎన్నికల్లో పెద్ద ఎత్తున బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించండి అని మహిపాల్ రెడ్డి హాట్ కామెంట్స్ చేశారు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మరోవైపు ఇప్పటికే మహిపాల్ రెడ్డి బీఆర్ఎస్ ముఖ్యనేతలకు టచ్‌లో ఉన్నారని అంటున్నారు. ఈ క్రమంలోనే తన అనుచరులను ఒక్కొక్కరిని కారెక్కిస్తున్నారని టాక్. త్వరలోనే గూడెం మహిపాల్‌రెడ్డి కూడా గులాబీ కండువా కప్పుకోవడం ఖాయమనే గుసగుసలు వినిపిస్తున్నాయి. పార్టీ ఫిరాయింపుల కేసులో మహిపాల్ రెడ్డికి స్పీకర్ క్లీన్ చీట్ ఇచ్చారు. కానీ ఇంకా సుప్రీంకోర్టులో కేసు పెండింగ్‌లో ఉంది. దీంతో ఏమైనా ఇబ్బందులు వస్తాయా అన్నది తేలాక మహిపాల్ రెడ్డి తిరిగి గులాబీ పార్టీలోకి వెళ్తారన్న ప్రచారం జరుగుతోంది. దీనిపై కాంగ్రెస్ నేతలు ఏ విధంగా స్పందిస్తారో అని సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# ప్రజలు సురక్షితంగా ఉండాలని పోరాటం చేశాను

## సీఎం చంద్రబాబు నాయుడు

**అమరావతి, (నినాదం):** ఏపీ ప్రజలు సురక్షితంగా ఉండాలని తాను రాజీలేని పోరాటం చేసినట్లు సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. మంగళగిరిలోని టీడీపీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమానికి హాజరైన ఆయన నివాళులు అర్పించిన అనంతరం మాట్లాడారు. రాష్ట్రాన్ని ఇబ్బంది పెట్టాలని చూసినప్పుడు తాను అడ్డుగోడలా నిలిచానన్నారు. తనకు ప్రాణాపాయం ఉన్నా కూడా ఎన్నడూ ప్రజా సంక్షేమం విషయంలో వెనుకడుగు వేయలేదని తెలిపారు. రౌడీలు రోడ్డుపైకి వస్తే వారికి చోటు లేదని చెప్పింది టీడీపీ అని తెలియజేశారు. మతసామరస్యాన్ని కాపాడిన పార్టీ, మత విద్వేషాలను కంట్రోల్ చేసిన పార్టీ, కర్ఫ్యూ లేకుండా చేసిన పార్టీ టీడీపీ అని కుండబద్దలు కొట్టారు.

**శాంతిభద్రతలు ఉన్నప్పుడే పెట్టుబడులు**

రాష్ట్రంలో కొందరు పొలిటికల్ రౌడీలు తయారయ్యారని.. నేరస్తులే పార్టీలు నడుపుతున్నారని పేర్కొన్నారు. బాబాయిని చంపినంత ఈజీ కాదు రాష్ట్రంలో నేరాలు చేయడం అని పరోక్షంగా వైసీపీ నేతలకు సూచించారు.. రాష్ట్రంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వాన్ని నడిపించేది సీబీఎన్ అని ప్రతిపక్ష నేత గుర్తుంచుకోవాలన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను పరిరక్షించనప్పుడే పెట్టుబడులు వస్తాయన్నారు. అప్పుడు స్వర్ణాంధ్ర 2047 సాకారమవుతుందన్నారు. 18 నెలల్లో రాష్ట్రం ఏమవుతోంద అని ఆలోచించిన అందరికీ చేతలతో సమాధానం చెప్పామన్నారు. సంక్రాంతికి 30 లక్షల మంది వేరే ప్రాంతాల వారు సంక్రాంతి సంబరాలను జరుపుకునేందుకు ఏపీకి వచ్చారన్నారు. తెలుగు ప్రజల్లో కూటమి ప్రభుత్వం కల్పించిన



ఆత్మ విశ్వాసానికి అది నిదర్శనం అన్నారు.

**అధికారం కోసం ఆరాట పడలేదు**

పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు కార్యకర్తలతో పాటు తాను కూడా ఎంతో ఇబ్బంది పడ్డానన్నారు. కక్ష సాధింపులకు రాజకీయాలను తాను రాలేదని, తెలుగు జాతిని కాపాడడానికి రాజకీయాల్లో వచ్చామని తెలిపారు. టీడీపీ పని అయిపోయిందన్న వారి పని అయిపోయిందని ఎద్దేవా చేశారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా టీడీపీ ఎప్పటికీ చెక్కు చెదరదని ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ ఎప్పుడూ అధికారం కోసం ఆరాట పడలేదన్నారు. ప్రజల సెంటిమెంట్లు తాను అర్థం చేసుకోగలను అన్నారు. పార్టీ నాయకులను, క్యాడర్ ను కూడా అర్థం చేసుకొని సరైన మార్గంలో నడిపినప్పుడే నాయకుడవుతాను అని పేర్కొన్నారు. మనం దేని కోసం పనిచేస్తున్నామో ఆ లక్ష్య సాధనలో కాంప్రమైజ్ కావొద్దన్నారు.

**కార్యకర్తలు లేకుంటే నాయకులు లేరు**

అనునిత్యం టీడీపీ నాయకులు, కార్యకర్తల త్యాగాలను తాను గుర్తించుకున్నానని పేర్కొన్నారు. కార్యకర్తలు లేకపోతే నాయకులు లేరు. గెలవడానికి పలుమార్లు బయట నుంచి కూడా నాయకులను తెచ్చుకుంటాం. వచ్చిన నాయకులు కూడా గుర్తుంచుకోవాలి ఇది ఒకరోజు పార్టీ కాదని సూచించారు. దేశానికి దశ, దిశ నిర్దేశం చేసిన పార్టీ టీడీపీ అని గుర్తు చేశారు. శిక్షణ కార్యక్రమాలు పెట్టి మరీ సమర్థవంతమైన నాయకులను తయారు చేసుకున్నాం అన్నారు. టీడీపీ కార్యకర్తలు నమ్మిన సిద్ధాంతం కోసం ప్రాణాలైన వదిలే త్యాగశీలురని కొనియాడారు.

**వారి గౌరవం పెంచే బాధ్యత తీసుకున్నా**

రాష్ట్రంలో ఎన్నో పార్టీలున్నాయని కానీ.. కార్యకర్తల సంక్షేమానికి పనిచేసిన పార్టీ టీడీపీ అని స్పష్టం చేశారు. పార్టీ కార్యకర్తల పిల్లల కోసం ప్రత్యేక స్కూల్ పెట్టిన పార్టీ టీడీపీ అన్నారు. పార్టీ ఆఫీసు కార్యకర్తలకు కార్యాలయంలో గౌరవం దక్కాలని నిర్ణయించామన్నారు. రూ.5లక్షల ఇన్సూరెన్స్ కల్పిస్తున్నాం అన్నారు. కార్యకర్తల గౌరవాన్ని పెంచే బాధ్యత తాను తీసుకున్నా అన్నారు.

**ఉద్యోగులకు సంక్రాంతి కానుక**

గత ప్రభుత్వం ఉద్యోగులు బకాయిలు అడిగితే తప్పుడు కేసులు పెట్టారని సీఎం చంద్రబాబు అన్నారు. కానీ కూటమి ప్రభుత్వం నిజమైన సంక్రాంతి కానుకలను ఉద్యోగులకు ఇచ్చిందన్నారు. దేశంలో వచ్చిన పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకి వచ్చాయన్నారు. రాష్ట్రంలో ప్రతిఒక్కరికి ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తున్నాం అని తెలిపారు.

**దేశాభివృద్ధి కోసం**

దేశ అభివృద్ధి కోసం కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వానికి అండగా ఉన్నామన్నారు. రూ.700ల కోట్లతో సర్వే రాళ్లపై ఫోటో వేసుకున్న దుర్మార్గులు రాష్ట్రంలో ఉన్నారని వైసీపీ అధినేతపై పరోక్ష విమర్శలు చేశారు.

# ఎన్టీఆర్ ఘాట్ వద్ద బాబు మోహన్‌కు ఘోర అవమానం



**హైదరాబాద్, (నినాదం):** హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్ వద్ద ఆదివారం ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ పార్టీ స్థాపకులు నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా నివాళులర్పించేందుకు వచ్చిన అభిమానులను లోపలికి వెళ్లకుండా పోలీసులు, భద్రతా సిబ్బంది అడ్డుకోవడంతో వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే సమయంలో అక్కడే ఉన్న సీనియర్ నటుడు, మాజీ మంత్రి బాబు మోహన్ పరిస్థితిని చక్కదిద్దేందుకు, అభిమానులకు సర్ది చెప్పేందుకు ప్రయత్నించారు. అయితే, ఆవేశంతో ఉన్న కొందరు వ్యక్తులు బాబు మోహన్ (దీఘఎబ వీశీష్ట్రుఅ) పట్ల అత్యంత దారుణంగా ప్రవర్తించారు. ఎవరూ ఊహించని విధంగా ఆయనను వ్యక్తిగతంగా దూషిస్తూ, కించపరిచేలా మాట్లాడటంతో అక్కడున్నవారంతా విస్మయానికి గురయ్యారు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. టీడీపీ కార్యకర్తలు, అభిమానుల మధ్య సమన్వయం చేసేందుకు ప్రయత్నించిన ఒక సీనియర్ నేతను, ఒక దళిత నాయకుడిని ఇలా కులపరంగా, వ్యక్తిగతంగా కించపరచడంపై నెటిజన్లు తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతున్నారు. "ఒక సీనియర్ నటుడికి ఇచ్చే గౌరవం ఇదేనా?" అంటూ పలువురు సోషల్ మీడియా వేదికగా నిలదీస్తున్నారు. మహనీయుడైన ఎన్టీఆర్ ఆశయాలకు విరుద్ధంగా, ఇలాంటి వివక్షాపూరిత వ్యాఖ్యలు చేయడం రాజకీయ, సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# ఎన్టీఆర్ ఘాట్ పునరుద్ధరణపై నారా లోకేశ్ హర్షం



**అమరావతి, (నినాదం):** హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్‌ను తెలంగాణ ప్రభుత్వం అత్యంత సుందరంగా పునరుద్ధరించడంపై ఏపీ ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. గతంలో ఘాట్ నిర్వహణ సరిగ్గా లేకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేస్తూ, అవసరమైతే సొంత నిధులతో మరమ్మతులు చేపడతామని ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనిపై తెలంగాణ ప్రభుత్వం సానుకూలంగా స్పందించి హెచ్ఎండీఏ ద్వారా సుమారు రూ. 1.35 కోట్లతో మరమ్మత్తు పనులు చేపట్టింది. ప్రస్తుతం పునరుద్ధరణ పనులు పూర్తయి ఘాట్ కొత్త రూపు సంతరించుకోవడంతో లోకేష్ సోషల్ మీడియా వేదికగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, హెచ్ఎండీఏ అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎన్టీఆర్ కేవలం ఒక నాయకుడు మాత్రమే కాదని.. తెలుగు వారి ఆత్మగౌరవానికి నిలువెత్తు రూపమని లోకేశ్ కొనియాడారు. ఆయన గౌరవార్థం నిర్మించిన ఈ స్మృతివనం ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలకు ఒక స్ఫూర్తిదాయక ప్రదేశమని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా మహానాయకుడి వారసత్వాన్ని గౌరవిస్తూ, ఘాట్‌ను అద్భుతంగా తీర్చిదిద్దిన తీరును ఆయన ప్రశంసించారు. అయితే తెలుగు జాతి సంస్కృతికి, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే ఎన్టీఆర్ ఘాట్ నిర్వహణను బాధ్యతగా చేపట్టిన తెలంగాణ ప్రభుత్వంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

# ఆయనకు ఆయనే సాటి.. ఆయనే పోటీ


## దేవినేని ఉమా



**గొల్లపూడి, (నినాదం):** మాజీ ముఖ్యమంత్రి.. నట సార్వభౌమ ఎన్టీఆర్ ఆయనకు ఆయనే సాటి ఆయనకు ఆయనే పోటీ అని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకొని గొల్లపూడిలోని కార్యాలయంలో స్థానిక నేతలతో కలిసి ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు జాతి కీర్తిని దశదిశలా వ్యాపింపజేసి, తెలుగు వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు యుగపురుషుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. ఆయన నటన తెలుగు సినిమా చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయం అన్నారు. నటన నుండి రాజకీయాల్లోకి అడుగుపెట్టిన తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి వచ్చిన మహనీయుడని వివరించారు. ప్రజలు దేవుడిగా పూజిస్తుండడం ఎన్టీఆర్ కు మాత్రమే దక్కిన అరుదైన వరం అని పొగిడారు. రాయలసీమకు సాగు, తాగునీటి ప్రాజెక్టులు లాంటి అనితరసాధ్యమైన సంక్షేమ అభివృద్ధి పథకాలతో చరిత్ర గతిని మార్చిన మహా నాయకుడు ఎన్టీఆర్ అన్నారు. పేదవాడి ఆకలి తీర్చడానికి రెండు రూపాయలకే కిలో బియ్యం, నిరుపేదలకు పక్కా ఇళ్లు, ఆస్తిలో మహిళలకు సమాన వాటా వంటి విప్లవాత్మక నిర్ణయాలతో పాలనలో తనదైన ముద్ర వేశారని గుర్తు చేశారు. సంక్షేమ రాజ్య స్థాపన కోసం ఆయన చేసిన కృషి నేటికీ అనేక పథకాలకు దిక్సూచిగా నిలుస్తోందన్నారు. ఆ మహనీయుని స్మరించుకుంటూ, ఆయన ఆశయ సాధనలో సాగడమే మనం ఇచ్చే నిజమైన నివాళి అని అభిప్రాయపడ్డారు.

# విశాఖలో అంతర్జాతీయ నౌకాదళ విన్యాసాలు

## పోలీసు కమీషనర్ సమీక్ష



**విశాఖపట్నం, (నినాదం):** సాగర నగరం విశాఖపట్నం వేదికగా ఫిబ్రవరి 14 నుంచి 25 వరకు భారత తూర్పు నావికాదళం అత్యంత ప్రతిష్టాత్మకమైన మూడు మెగా ఈవెంట్లను నిర్వహించనుంది. 'ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ', 'మిలాన్-2026', 'ఐయాన్స్-కాన్ క్లేవ్ అఫ్ చీఫ్స్' కార్యక్రమాలు నగరం గర్వించదగ్గ రీతిలో జరగనున్నాయి. ఈ నేపథ్యంలో నగర పోలీసు కాన్ఫరెన్స్ హాల్ లో పోలీసు కమీషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ముందస్తు సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో నేవీ ఉన్నతాధికారులతో పాటు డిసిపి-01, ఏడిసిపిలు, ఏసిపిలు పాల్గొన్నారు. ఈ భారీ ఈవెంట్ల నిర్వహణకు అవసరమైన భద్రతా ప్రణాళికలపై సమగ్రంగా చర్చించారు. అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించే ఈ కార్యక్రమాల ద్వారా విశాఖ నగరం మరోసారి ప్రపంచ పటంలో ప్రత్యేక గుర్తింపు పొందనుందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పోలీసు బందోబస్తు, పటిష్టమైన భద్రతా చర్యలు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ప్రత్యేక దృష్టి సారించారు. ముఖ్యంగా కార్యక్రమాలు జరిగే ప్రాంతాలు, పార్కింగ్ జోన్లు, భద్రతా దృష్ట్యా 'నో-డ్రోన్ జోన్లలను ప్రకటించడంపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వివిధ దేశాల నుంచి విచ్చేసే ప్రతినిధులు, విశిష్ట అతిథుల రాకపోకలు, వారి సందర్శనల కోసం ప్రత్యేక రోడ్డు మార్గాలను కేటాయిస్తూ ప్రణాళికలు సిద్ధం చేశారు. ముఖ్య అతిథుల భద్రతలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా నేవీ, పోలీసు విభాగాల మధ్య సమన్వయం కోసం జాయింట్ కమాండ్ అండ్ కంట్రోల్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయాలని కమీషనర్ ఆదేశించారు.

# అప్పుడు రక్తాలు పారితే.. ఇప్పుడు నీళ్లు పారుతున్నాయి

## రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

**పల్నాడు, (నినాదం):** పల్నాడు ప్రాంతంలో వైసీపీ హయాంలో రక్తాలు పారితే టీడీపీ హయాంలో పంట భూములకు నీళ్లు పారుతున్నాయని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన ఘటనను రాజకీయ రంగు పులిమి వైసీపీ కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. చంద్రబాబు నాయకత్వంలోని తెలుగుదేశం పార్టీ కి జగన్ నేతృత్వంలోని వైసీపీ కి మధ్య ఉన్న తేడా ప్రజలకు బాగా తెలుసని తెలిపారు. అరాచకాలతో గందరగోళం చేసే పార్టీ వైసీపీ అని ఆరోపించారు. కానీ టీడీపీ అలా కాదన్నారు. గ్రామాల అభివృద్దే ధ్యేయంగా పని చేసే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోందని స్పష్టం చేశారు. కుట్రపూరిత రాజకీయాలకు పాల్పడుతున్నందుకే ఆ పార్టీని ప్రజలు 11సీట్లకు పరిమితం చేశారన్నారు. అయినా కూడా వైసీపీకి బుద్ధి రాలేదని విమర్శించారు. ఎక్కడ ఎవరు చనిపోయినా శవ రాజకీయాల కోసం పాకులాడుతూ ప్రజల్ని మభ్య పెట్టాలని వైసీపీ చూస్తోందన్నారు. పల్నాడులో ప్రశాంత వాతావరణం నెలకొల్పి అక్కడి ప్రజలు బాగుపడేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంటే దాన్ని చెడగొట్టే ప్రయత్నం చేస్తోందని ఆరోపణలు గుప్పించారు. అక్రమ సంపాదన మీద పుట్టిన వైసీపీకి, తెలుగువాడి అత్మగౌరవం కోసం పెట్టిన తెలుగుదేశం కి మధ్య తేడా ప్రజలకు బాగా తెలుసని స్పష్టం చేశారు. గతంలో ఎక్కడ ఫ్యాక్షన్ ఉన్నా కఠినంగా అణచివేసి ప్రజలు సుఖశాంతులతో ఉండాలనే లక్ష్యంతో



వ్యవహరించిన నాయకుడు చంద్రబాబు నాయుడు అని గుర్తు చేశారు. అధికారంలో ఉన్న 5ఏళ్ళు జగన్ పల్నాడు లో హింసను ప్రేరేపించాడన్నారు. పల్నాడు లో తెలుగుదేశం నేతల పరామర్శకు చంద్రబాబు వెళ్లకుండా ఆయన ఇంటి గేటుకు తాళ్లు కట్టారన్నారు. యరపతినేని నియోజకవర్గం పిన్నెలి గ్రామంలో300మంది ఊరు విడిచి వెళ్లిపోయేలా చేశారని పేర్కొన్నారు. ఒక్క గురజాల నియోజకవర్గంలోనే ఎస్సీ, బీసీలను 12మందిని చంపేశారని ఆరోపించారు. అక్రమ మైనింగ్ గుంటల్లో పిల్లలు చనిపోతే ఎవ్వరూ పట్టించుకోలేదన్నారు. హత్యా రాజకీయాలు ఎక్కడ జరిగినా ప్రభుత్వం సీరియస్ గా తీసుకుని తప్పు చేసిన ఎవర్నీ వదిలిపెట్టదని ఖరాఖండిగా చెప్పారు. వ్యక్తిగత హత్యల్ని రాజకీయ హత్యలుగా మార్చే కుట్రలు ఎవరు చేసినా ఉపేక్షించే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

# ఎమ్మెల్యే దగ్గుపాటి వ్యవహారంపై టీడీపీ అధిష్టానం ఫోకస్!

**అనంతపురం, (నినాదం):** అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ వ్యవహారశైలి ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో, ముఖ్యంగా తెలుగుదేశం పార్టీలో తీవ్ర చర్చనీయాంశమైంది. ఎమ్మెల్యే అనుచరులు నియోజకవర్గంలో సాగిస్తున్న అక్రమాలు, దౌర్జన్యాలపై స్థానిక నేతలు పార్టీ కేంద్ర కార్యాలయంలో ఫిర్యాదు చేయడంతో టీడీపీ అధిష్టానం ఈ వ్యవహారంపై ఆరా తీస్తోంది. తాజాగా అనంతపురంలో ఏర్పాటు చేసిన ఒక ఎగ్జిబిషన్ లో నిర్వాహకుడు ఫకృద్దీన్‌ను ఎమ్మెల్యే అనుచరుడు గంగారాం, గన్‌మెన్ షేక్ షావలి బెదిరించి, రూ.10 లక్షలు డిమాండ్ చేశారనే ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందడం, ఎమ్మెల్యే గన్‌మెన్‌ను జిల్లా ఎస్పీ సస్పెండ్ చేయడం పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించేలా ఉందని అధిష్టానం భావిస్తోంది. గతంలో కూడా దగ్గుబాటి ప్రసాద్ పలు వివాదాల్లో చిక్కుకున్నారు. ముఖ్యంగా



టాలీవుడ్ హీరో జూనియర్ ఎన్టీఆర్, ఆయన తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ఒక ఆడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ కావడం అప్పట్లో పెద్ద దుమారాన్నే లేపింది. 'వార్ 2' సినిమా విడుదలకు సంబంధించి ఎన్టీఆర్ అభిమానుల పట్ల ఎమ్మెల్యే కఠినంగా వ్యవహరించడం, ఆయన వ్యాఖ్యలపై ఆగ్రహించిన అభిమానులు ఎమ్మెల్యే కార్యాలయం వద్ద నిరసనలు తెలపడం వంటి పరిణామాలు పార్టీకి తలనొప్పిగా మారాయి. ఆ సమయంలోనే సీఎం చంద్రబాబు నాయుడు ఆయనను పిలిపించి మందలించినప్పటికీ, వరుసగా తలెత్తుతున్న కొత్త వివాదాలు పార్టీలో అసహనానికి దారితీస్తున్నాయి. అనంతపురం నియోజకవర్గంలోని సీనియర్ నేతలను కాదని అధిష్టానం ప్రసాద్‌కు అవకాశం ఇచ్చినప్పటికీ, ఆయన వర్గపోరును ప్రోత్సహిస్తున్నారని సొంత పార్టీ నేతలే ఆరోపిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి వర్గానికి, ప్రసాద్ వర్గానికి మధ్య నెలకొన్న విభేదాలు, అలాగే ఎమ్మెల్యే అనుచరుల భూదందాలు, బెదిరింపుల పర్వంపై నివేదికలు పార్టీ కార్యాలయానికి చేరుతున్నాయని భోగట్టా. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా ప్రవర్తిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించబోమని ఇప్పటికే అధిష్టానం సంకేతాలు ఇచ్చింది. ఈ నేపథ్యంలో అనంతపురంలోని తాజా పరిణామాలపై పార్టీ విచారణ కమిటీ వేసి సమగ్ర నివేదిక కోరినట్లు సమాచారం.

# ఎన్టీఆర్ తనదైన ముద్ర వేశారు

## • ఎమ్మెల్యే బాలకృష్ణ


**అమరావతి, (నినాదం):** మహానుభావులు కావాలంటే ఎంతో శ్రమ.. దీక్ష అవసరం అని.. అవి ఎన్టీఆర్ లో పుష్కలంగా ఉండేవని ఎన్టీఆర్ తనయుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ సినీ, రాజకీయ రంగాల్లో ఎన్టీఆర్ తనదైన ముద్ర వేశారన్నారు. సూర్యచంద్రులు ఉన్నంత వరకు ఆయన బ్రతికే ఉంటారన్నారు. సినిమాల్లో ఎవరూ చేయని విభిన్న పాత్రల్లో నటించారని.. ప్రతి పాత్రలోనూ పరకాయ ప్రవేశం చేశారని తెలిపారు. సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అనే మాటను విశ్వసించి టీడీపీని స్థాపించారన్నారు. తద్వారా కొందరికే పరిమితమైన రాజకీయాలను అన్ని వర్గాల వారికి చేరువ చేశారన్నారు. బడుగు, బలహీనవర్గాల వారికి చేయూతనిచ్చారని కొనియాడారు. ఆకలి తెలిసిన నాయకుడని కొనియాడారు. ప్రతి తెలుగువాడు గర్వించేలా తెలుగువారి కీర్తిని ప్రపంచానికి చాటారన్నారు. నాడు ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ తీసుకొచ్చిన పథకాలే నేడు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో



అమలవుతున్నాయని చెప్పారు. ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్లిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఆయన స్ఫూర్తిని టీడీపీ కొనసాగిస్తుందని ప్రకటించారు.

# సీఎం చంద్రబాబు కోసం బండ్ల గణేశ్ పాదయాత్ర

**అమరావతి, (నినాదం):** ప్రముఖ టాలీవుడ్ నిర్మాత, నటుడు బండ్ల గణేష్ మరోసారి సంచలన నిర్ణయంతో వార్తల్లో నిలిచారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై తనకున్న అచంచలమైన అభిమానాన్ని చాటుకుంటూ ఆయన 'సంకల్ప పాదయాత్ర'కు శ్రీకారం చుట్టారు. గతంలో చంద్రబాబు నాయుడు ఎదుర్కొన్న కష్టకాలంలో ఆయన క్షేమంగా బయటపడి మళ్ళీ ముఖ్యమంత్రి కావాలని బండ్ల గణేష్ తిరుమల వేంకటేశ్వర స్వామికి మొక్కుకున్నారు. ప్రస్తుతం చంద్రబాబు నాయుడు భారీ విజయం సాధించి సీఎంగా బాధ్యతలు చేపట్టడంతో, తన మొక్కును తీర్చుకునేందుకు బండ్ల గణేష్ ఈ పాదయాత్ర చేపట్టారు. సంకల్ప యాత్ర పేరిట సాగనున్న ఈ పాదయాత్ర జనవరి 19వ తేదీన రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లోని ఆయన స్వగృహం నుండి ప్రారంభం కానుందని బండ్ల గణేశ్ పేర్కొన్నారు. తన నివాసం నుండి కాలినడకన బయలుదేరి దాదాపు 500 కిలోమీటర్ల దూరం ప్రయాణించి తిరుమల శ్రీవారిని దర్శించుకోనున్నానని తెలిపారు. ఈ యాత్రను భక్తి శ్రద్ధలతో, ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. రాజకీయాలకు అతీతంగా కేవలం తన అభిమాన నాయకుడి కోసమే ఈ సాహసోపేతమైన



నిర్ణయం తీసుకున్నట్లు బండ్ల గణేష్ స్పష్టం చేశారు. అయితే ఈ పాదయాత్ర ఇప్పుడు సినీ, రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

# సాల్మన్ హత్యపై భగ్గుమన్న దళితులు

గుంటూరులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ, నవ్యాంధ్ర ఎమ్మార్పిఎస్, దళిత నాయకులు

రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పెద్ద ఎత్తున నిరసనలు

చంద్రబాబు పాలనలో దళితులపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలు నిత్యకృత్యంగా మారాయని నాయకుల ఆగ్రహం

సాల్మన్ హంతకులను కఠినంగా శిక్షించాలి..

బాధిత కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్

హంతకులను ఇంకా అరెస్టు చేయకపోవడంపై మండిపాటు



**అమరావతి, (నినాదం):** పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గం పిన్నెల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మందా సాల్మన్ హత్యపై రాష్ట్రవ్యాప్తంగా దళితులు భగ్గుమన్నారు. టీడీపీ మూకలు పథకం ప్రకారం మందా సాల్మన్‌ను హత్య చేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు శనివారం అన్ని జిల్లా కేంద్రాలు, ముఖ్య పట్టణాల్లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాల ఎదుట పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు, ధర్నాలు చేశారు. శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు జరిగిన ఈ నిరసనల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతోపాటు దళితులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. చంద్రబాబు రెడ్‌బుక్ పాలనలో రాష్ట్రంలోని దళితులపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలు నిత్యకృత్యంగా మారాయని నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. సాల్మన్ హంతకులను కఠినంగా శిక్షించాలని, ఆయన కుటుంబానికి ప్రభుత్వం రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, ఐదు ఎకరాల భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు ప్రభుత్వం రాష్ట్రంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని కాకుండా మంత్రి నారా లోకేశ్ రాసుకున్న రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ దళితులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులను దారుణంగా హత్య చేస్తున్నారని దుయ్యబట్టారు. వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉంటున్నారనే దళితులను లక్ష్యంగా చేసుకుని దారుణాలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. టీడీపీ మూకల రక్తదాహానికి మందా సాల్మన్ బలయ్యారని, ఇది ముమ్మాటికి చంద్రబాబు ప్రభుత్వం చేయించిన హత్యేనని స్పష్టం చేశారు. హంతకులను ఇంకా అరెస్టు చేయకపోవడంపై మండిపడ్డారు. తక్షణమే నిందితులను అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని, వారికి కొమ్ముకాసిన టీడీపీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, సీఐ, ఎస్ఐలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని నినదించారు. దళితులపై దాడులకు వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమిస్తామని ప్రకటించారు. వివిధ ప్రాంతాల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు దళిత నాయకులు వినతి పత్రాలు సమర్పించారు.

**పలు ప్రాంతాల్లో ర్యాలీలు.. నల్లరిబ్బన్లతో నిరసనలు**

సాల్మన్ హత్యకు నిరసనగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జిల్లా అమలాపురం మండలం బొంతువారిపేట నుంచి ఈదరపల్లి వంతెన వరకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు, దళితులు ర్యాలీ నిర్వహించారు. శ్రీ సత్యసాయి జిల్లా కొత్త చెరువులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శాంతియుతంగా నిరసన తెలియజేసేందుకు వెళ్లిన వైఎస్సార్‌సీపీ నాయకులు, దళితులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ కార్యక్రమానికి ముందస్తు అనుమతి లేదని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తే కేసులు పెడతామని బెదిరించారు. కడపలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సర్కిల్‌లో వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో నల్ల రిబ్బన్లు కట్టుకుని ధర్నా చేశారు. కర్నూలులోని కొండారెడ్డి బురుజు వద్ద నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. నల్ల రిబ్బన్లు ధరించి చంద్రబాబు డౌన్..డౌన్, జోహార్ అంబేడ్కర్... జైభీమ్.. పోలీసుల జులుం నశించాలి.. దళితులపై దాడులు అరికట్టాలి... రెడ్ బుక్ రాజ్యాంగం నశించాలి.. అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. బాపట్లలోనూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు, దళితులు ర్యాలీ నిర్వహించారు.

# లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు..

## • తప్పిన ప్రాణ నష్టం

**కృష్ణా జిల్లా (నినాదం):** కృష్ణా జిల్లాలో ఆదివారం ఉదయం పెను ప్రమాదం తప్పింది. పోలీసుల వివరాల ప్రకారం బాపులపాడు మండలం కానుమోలు సమీపంలో జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న లారీని ఆర్టీసీ బస్సు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద సమయంలో బస్సులో ప్రయాణికులు ఉండటంతో ఒక్కసారిగా భయాందోళనలు నెలకొన్నాయి. అయితే అదృష్టవశాత్తూ ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనలో బస్సు డ్రైవర్‌తో పాటు పలువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదానికి గురైన బస్సును రహదారిపై నుంచి తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు. ప్రమాదానికి ప్రధాన కారణం తెల్లవారుజామున కురిసిన దట్టమైన పొగమంచు అని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు.




పొగమంచు కారణంగా రహదారిపై ఎదురుగా వస్తున్న వాహనాలు సరిగ్గా కనిపించకపోవడంతోనే ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు అనుమానిస్తున్నారు. శీతాకాలం కావడంతో వాహనదారులు పొగమంచు సమయంలో అప్రమత్తంగా ఉండాలని, వేగ నియంత్రణ పాటించాలని అధికారులు ఈ సందర్భంగా సూచించారు.

వియత్నాం విజయానికి

# స్ఫూర్తినిచ్చిన రాణా ప్రతాప్ సింగ్

**ప్రపంచంలో అగ్రరాజ్యమైన అమెరికాతో 20 ఏళ్లు పోరాటం చేసి, ఎదురే లేదనుకుని విర్రవీగిన అమెరికా మెడలు వంచి విజయం సాధించిన దేశం వియత్నాం. అమెరికాపై సాధించిన విజయం తర్వాత వియత్నాం అధ్యక్షుడిని ఒక విలేకరి ఇలా ప్రశ్నించాడు. "మీరు అమెరికాను ఎలా ఓడించారో ఎవరికీ అంతుబట్టడం లేదు" అని. ఆ విలేకరి అడిగిన ప్రశ్నకు వియత్నాం అధ్యక్షుడు చెప్పిన సమాధానం... "శక్తివతంమైన అమెరికాను ఓడించడానికి నేను గొప్ప దేశభక్తిగల భారతీయ రాజు చరిత్రను చదివాను.... ఆయన జీవితం నుంచి ప్రేరణ పొంది యుద్ధనీతి, ప్రయోగాలతో విజయం సాధించాం" అని అన్నాడు . ఎవరా భారతీయ రాజు? అని విలేకరి అడిగితే వియత్నాం అధ్యక్షుడు లేచి నిలబడి ఆయనే రాజస్థాన్‌లోని "మేవాడ్ వీరుడు మహారాజు రాణా ప్రతాప్ సింగు అని గర్వంగా ప్రకటించాడు.**



మహారాణా ప్రతాప్ సింగ్ పేరు చెప్పేటప్పుడు అతడి కళ్లల్లో వీరత్వం తొణికిస లాడింది. "అలాంటి రాజు మా దేశంలో జన్మించి ఉంటే మేము ఈ ప్రపంచాన్నే జయించే వారమని" అన్నాడు. కాలక్రమంలో వియత్నాం అధ్యక్షుడు చనిపోయిన తర్వాత అతడి సమాధి మీద "ఇది మహారాణా ప్రతాప్ యొక్క శిష్యుడిదని" రాశారు. కొన్నేళ్లకు వియత్నాం విదేశాంగమంత్రి భారత పర్యటనకి రావడం జరిగింది. దేశంలోని గొప్పవారికి శ్రద్ధాంజలి ఘటించడానికి ఆయనకు మొదట గాంధీ సమాధి చూపించారు. ఆ తర్వాత ఎర్రకోట ఇలా చూపించే టప్పుడు... వియత్నాం మంత్రి మహారాణా ప్రతాప్ సమాధి ఎక్కడ? అని ప్రశ్నించాడు. ఆ మంత్రి ప్రశ్నకు ఆశ్చర్య పోయిన భారత అధికారి ఉదయపూర్‌లో ఉందని తెలిపాడు. ఆయన ఉదయ్‌పూర్ వెళ్లి సమాధిని దర్శించి, అక్కడ నుంచి "పిడికిడు మట్టిని" తీసుకొని తన బ్యాగ్‌లో వేసుకున్నాడు. దీన్ని గమనించిన భారత అధికారి మట్టిని బ్యాగ్‌లో ఎందుకు పెట్టు కున్నారని అడిగాడు.... ఇదే మట్టి దేశ భక్తులైన వీర పుత్రులకు జన్మనిచ్చింది... అందుకే దీన్ని తీసుకెళ్లి మాదేశం మట్టిలో కలుపుతాను. ఇలాంటి రాజు ప్రేరణతో అక్కడ కూడా దేశభక్తులు జన్మిస్తారని.... మహారాణా ఈ దేశమే కాదు ప్రపంచం గర్వించదగ్గ రాజని" అన్నాడు.

రాజపుత్ర వీరుడు మహారాణా ప్రతాప్ 1540 మే 9 (జ్యేష్ఠ శుక్ల తదియ) రాజస్థాన్‌లోని కుంబల్‌లో జన్మించాడు. 1568లో మేవాడ్ పాలకుడిగా బాధ్యతలు చేపట్టిన మహారాణా 1597 వరకు పరిపాలించాడు. గొప్ప చక్రవర్తిగా చరిత్రకారులు పేర్కొన్న అక్బర్ ఆ సమయంలో ఢిల్లీ సింహాసనాన్ని పాలిస్తున్నాడు. స్వాతంత్రం, ఆత్మ గౌరవం కోసం నిరంతరం మొఘలులతో పోరాటం చేస్తూ రాణా ప్రతాప్ ఏనాడు తల వంచలేదు. మహారాణా ప్రతాప్ ఒకసారి తలదించి, తన కాళ్లమీద పడితే సగం హిందూస్థాన్‌కు రాజును చేస్తానని అక్బర్ ప్రతిపాదిస్తే, దాన్ని తుచ్ఛమైందిగా తిరస్కరించాడు.

ఒకసారి భారత్ పర్యటన కోసం అబ్రహాం లింకన్ సిద్ధమవు తుండగా తన తల్లిని తిరిగి వచ్చే టప్పుడు ఏమి తీసుకు రావాలని అడిగాడు. దానికి ఆమె రాజస్థాన్‌లోని "మేవాడ్ నుంచి పిడికెడు మట్టి తీసుకురా", అక్కడి రాజు ఎంత విశ్వస పాత్రుడిగా ఉండే వాడంటే సగం దేశాన్ని ఇస్తామని ప్రలోభపెట్టినా తన మాతృ భూమినే కోరుకున్నాడు, కానీ స్వార్థం చూప లేదని చెప్పిందట. అయితే కొన్ని కారణాల రీత్యా అతని పర్యటన రద్దయ్యింది. ఈ విషయాలు "బుక్ ఆఫ్ ప్రెసిడెంట్ యుఎస్ఏఅబ్రశ్రీశ్రీ"లో పేర్కొన్నారు.

మహారాణా ప్రతాప్ 7 అడుగుల ఎత్తు ఉండేవాడు. 235 కిలోల బరువున్న మహారాణా యుద్ధ సామగ్రి ఉదయపూర్ ప్యాలెస్‌లో భద్రపరచ బడింది. భాలా (ఈటె) మాత్రమే 35 కిలోల బరువు ఉంటుంది. అల్ బరౌని అనే రచయిత మహారాణా ప్రతాప్ దగ్గర ఉన్న "రాంప్రసాదు అనే ఏనుగు గురించి తన పుస్తకంలో రాశాడు. మేవాడ్ మీద యుద్ధం చేసేటప్పుడు మహారాణా ప్రతాప్ తోపాటు అయన ఏనుగు రాంప్రసాద్‌ను కూడా బంధిగా పట్టుకుంటే సరిపోతుందని అక్బర్ తన సైన్యంతో అన్నాడు. రాంప్రసాద్ మొఘలకు చెందిన 13 ఏనుగులను హత మార్చింది. అలాగే దాన్ని బంధించడానికి 7 పెద్ద ఏనుగుల మీద 14 మంది నైపుణ్యం కలిగిన మావటిలు చక్రవ్యూహం పన్నారని అల్ బరౌని తన రచనలో పేర్కొన్నాడు. బంధించిన రాంప్రసాద్‌ను అక్బర్ ముందు నిలబెడితే దానికి "పీర్ ప్రసాదు అని నామకరణం చేశాడు. అయితే ఆ ఏనుగు 18 రోజుల వరకు మంచి నీళ్లు కూడా ముట్టు కోకుండా ప్రాణాలు కోల్పోయింది. తర్వాత ఈ దృశ్యాన్ని చూసిన అక్బర్ ఈ ఏనుగునే వంచలేక పోయాను... మహారాణాను ఎలా వంచగలుగుతా అని అన్నాడట. మహా రాణా ప్రతాప్ సింహ్ చనిపోయాక అక్బర్ కూడా కన్నీళ్లు పెట్టుకున్నట్లు చరిత్ర కారులు పేర్కొన్నారు.

రాణా గుర్రం అయిన "చేతకు మహారాణాను మోస్తూ, 26 అడుగుల కందకం మీద నుంచి దూకి అది దాటిన తరువాత చనిపోయింది. అంతకంటే ముందే దానికి ముందు కాలు విరిగి ఉన్నప్పటికి ఆ కందకాన్ని దుమికింది. అది ఎక్కడైతే చనిపోయిందో, అదే ప్రదేశంలో దాని గౌరవార్థం చేతక్ మందిరం కట్టారు. చేతక్ ఎంత బలమైనదంటే తన ఎదుట ఏనుగుమీద ఉన్న సైనికుణ్ణి అందు కోవటానికి అంత ఎత్తులో గాలిలో ఎగిరేది. అంతటి శక్తి కలిగినది కనుకే చేతక్ పేరును ద్విచక్ర వాహనానికి పెట్టడం గమనార్హం.

హల్దీ ఘాట్ యుద్ధం జరిగి 300 సంవత్సరాల తరువాత కూడా అక్కడి నేలలో కత్తులు లభించాయి. చివరి సారిగా 1985 లో ఒక ఆయుదం దొరికింది.

"ఒంటరిగా, మరే రాజపుత్ర రాజ్యాల మద్దతూ లేకుండా మొగలు సామ్రాజ్యాన్ని ధిక్కరించిన రాణా ప్రతాప్ శౌర్యం, రాజపుత్ర శౌర్య ప్రతాపాలను, వారి ఆత్మ గౌరవాన్నీ, వారి విలువలనూ వివరించే గొప్ప గాథ. రాణా ప్రతాప్ అవలంబించిన యుద్ధ తంత్రాన్ని ఆ తరువాత మాలిక్ అంబర్, ఛత్రపతి శివాజీలు కూడా అనుసరించారని", చారిత్రికుడు సతీష్ చంద్ర పేర్కొన్నాడు.

**– రామ కిష్టయ్య సంగనభట్లసీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

## ఏ మంత్రం వేశావో

నువ్వు ఏ మంత్రం వేశావో గాని
నా కంటి మీద కునుకు కరువైంది
నువ్వు ఏ మాటల మత్తును ఇచ్చావో గానీ
నా మనసు కడలిలో అలలు రేగుతూనే ఉన్నాయి
నువ్వు నా పెయ్యిని ఎక్కడ తాకావో గానీ
నా తనువంతా తామరమై వికసిస్తుంది

నీ నల్లని కురులు , నయాగార నడుము
నా కండ్లను బంధించి ఖైదీని చేశాయి
నీ చీర కుచ్చులు , రవికపై అచ్చులు
నా ఆలోచనలకు బేడీలు వేశాయి
నీవు నక్షత్రమై నాజుగ్గా నడుస్తుంటే
నేను గ్రహమై నీ వెంట తిరుగుతూనే ఉంటా

నువ్వు మేఘమై మమతను కురిపిస్తుంటే
నేను పుడమినై తడిచి పులకరిస్తూనే ఉంటా
నువ్వు. పుష్పమై పూస్తునే ఉండూ
నేను సీతాకోక నై వాలుతూనే ఉంటా.

**తాటిపాముల రమేశ్ (తార) 7981566031**

# ఆధునిక కాలపు ఆధ్యాత్మిక గురువు ఓషో

ఓషో (1931--1990), అసలు పేరు రాజనీష్ చంద్ర మోహన్ జైన్, 20వ శతాబ్దపు ప్రభావవంతమైన ఆధ్యాత్మిక గురువులలో ఒకరు. ఆయన తత్వశాస్త్రం, ఆధ్యాత్మికత, ప్రేమ, స్వేచ్ఛ వంటి అంశాలపై తన ప్రవచనాల ద్వారా ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మందిని ప్రభావితం చేశారు. సంప్రదాయ ఆధ్యాత్మికతను విస్మరించకుండానే, ఆధునిక జీవన విధానానికి అనుగుణంగా ఆధ్యాత్మికతను ఎలా అనుసరించాలో చూపించారు.

## నేడు ఓషో వర్ధంతి

ఓషో 1931 డిసెంబర్ 11న మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని కుచ్వాడా గ్రామంలో జన్మించారు. చిన్నతనం నుంచి విభిన్న ఆలోచనా శైలితో, ప్రశ్నించే వాడిగా ఉండేవారు. సంప్రదాయాలకు లోబడకుండా జీవించడం ఆయనకు చిన్నప్పటి నుంచే అలవాటైంది.

ఓషో విద్యలో మెరుగైన ప్రతిభ కనబరిచారు. జబల్పూర్ విశ్వవిద్యాలయంలో తత్వశాస్త్రంలో మాస్టర్స్ డిగ్రీ పొందారు. విద్యార్థి జీవితంలోనే జీవితం లోని అర్థాన్ని తెలుసు కోవడంలో ఆసక్తి కనబరిచారు.

ఓషో తత్వశాస్త్ర ప్రొఫెసర్‌గా పనిచేస్తూ సమాజంలోని సంక్షోభాలను పరిశీలించారు. బోధనల ద్వారా విద్యార్థులను ప్రేరేపిస్తూ, తత్వశాస్త్రంలో తన దృక్పథాన్ని వ్యక్తీకరించారు.

ఓషో జీవితంలోని ప్రధాన మలుపు ఆయన ఆధ్యాత్మికతను అన్వేషించడం. 1960లలో భారతదేశం అంతటా పర్యటిస్తూ తన ప్రసంగాలతో ప్రజల మనస్సులను ప్రభావితం చేశారు.

ఓషో తన బోధనల ద్వారా సంప్రదాయాలను ప్రశ్నిస్తూ, ఆధునిక ప్రపంచంలో వ్యక్తిగత



స్వేచ్ఛకు ప్రాముఖ్యత ఇచ్చారు. స్వేచ్ఛను మానవ జీవితంలోని అత్యంత కీలక అంశంగా పరిగణించారు. వ్యక్తి తన స్వంత మార్గాన్ని అన్వేషించి, సంకెళ్ళను తెంచుకోవాలని సూచించారు.

ఓషో రూపొందించిన "డైనమిక్ మెడిటేషను ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందింది. ఈ ధ్యాన పద్ధతులు శరీరాన్నీ, మనస్సునీ శుద్ధి చేసి, జీవనోత్సాహాన్ని పెంపొందించడంలో సహాయ పడతాయి.

ఓషో ప్రేమను స్వేచ్ఛ, బాధ్యతలతో కూడిన వ్యక్తీకరణగా అభివర్ణించారు. నిజమైన ప్రేమ బంధనాలను కలిగించదని చెప్పారు.

మతం అనే వ్యవస్థను విమర్శించినప్పటికీ, వ్యక్తిగత అనుభవం ద్వారా ఆధ్యాత్మికతను పొందాలని అన్నారు.

*ఓషో జీవితంలో అనేక వివాదాలు చోటుచేసుకున్నాయి. ఆయన మతాలపై, సంప్రదాయాలపై చేసిన విమర్శలు ఆయనకు అనేక శత్రువులను కల్పించాయి. 1981లో అమెరికాలోని ఒరెగాన్ రాష్ట్రంలో ఆయన స్థాపించిన "రజనీష్ పురం" ఆశ్రమం అనేక చట్టపరమైన సమస్యలకు కారణమైంది. ఆయన విమర్శలు, జీవిత విధానం కొంత మందిని ఆకర్షిస్తే, మరికొంత మందిని దూరం చేసింది.*



శాస్త్ర సాంకేతికతను ఉపయోగించుకుంటూ, ఆధునిక జీవనశైలిలో కూడా ఆధ్యాత్మికతకు స్థానం ఉందని అన్నారు.

ఓషో అనేక ఉపన్యాసాలు ఇచ్చి వాటిని పుస్తకాల రూపంలో ప్రచురించారు. ఆయన రచనలు ప్రపంచ వ్యాప్తంగా అనేక భాషల్లోకి అనువదించ బడ్డాయి. "ది బుక్ ఆఫ్ సీక్రెట్సు, "జోయ్: ది హ్యాపినెస్ దట్ కమ్స్ ఫ్రమ్ వితిను, "లవ్, ఫ్రీడమ్, అలోనెనెసు, "ధ్యానం: ఆర్ట్ ఆఫ్ ఎక్రాసి".

ఓషో 1990 జనవరి 19న పూణేలోని తన ఆశ్రమంలో మరణించారు. ఆయన మరణం తర్వాత కూడా ఆయన బోధనలు ప్రపంచ వ్యాప్తంగా ఆధ్యాత్మికతను ప్రేరేపిస్తున్నాయి. పూణేలోని ఓషో అంతర్జాతీయ ధ్యాన కేంద్రం ఆయన బోధనల మార్గదర్శకంగా ఉంది.

ఓషో తత్వశాస్త్రం, ఆధ్యాత్మికత ఆధునిక ప్రపంచంలోనూ సమానంగా సమర్థవంతంగా పనిచేస్తుంది. ఆయన ధ్యాన పద్ధతులు, స్వేచ్ఛాపరమైన ఆలోచనలు ప్రతీ తరానికి స్ఫూర్తిగా నిలుస్తాయి. ఆధునికతతో కూడిన ఆధ్యాత్మికతకు ఓషో సమగ్ర రూపం అని చెప్పవచ్చు.

**– రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# పరమ పవిత్రం... మాఘమాస అరుణోదయ స్నానం

**హైందవ సాంప్రదాయంను అనుసరించి ప్రతి మాసానికి ఒక విశిష్టత ఉంది. మాఘ ఫాల్గుణాలు శిశిర రుతువులో ఉంటాయి. సంవత్సరంలో పదవ మాసమూ, హేమంత రుతువులోని రెండో మాసమూ అయిన పుష్యం తెలుగు వారికి శూన్యమాసం. సంవత్సరంలోని నాలుగవ మాసమూ, గ్రీష్మ రుతువులోని రెండవ మాసమూ అయిన ఆషాఢం కూడా తెలుగు వారికి శూన్య మాసమే. శూన్య మాసాలు శుభ శోభనాలకు పనికిరానివి.**



ఒక సంవత్సరం చివరి పాదంలో వచ్చే పుష్య మాసానికి, మరు సంవత్సరం రెండవ పాదంలో వచ్చే ఆషాఢానికి మధ్య ఆయిదు మాసాల తేడా ఉంటుంది. మాఘం, ఫాల్గుణం, చైత్రం, వైశాఖం, జ్యేష్టం లకు "మాఘాది పంచకం" అని పేరు. ఇవి శుభకార్యాలకు అనుకూల కాలం. వాన, చలి అంతగా ఉండక, వస్త్ర గృహ సమస్య ఇబ్బంది కలిగించక, ధాన్యలక్ష్మి ఆరు బయట విరివిగా మసలే కాలమిది. శాక పాకాలు సమృద్ధిగా, అనుకూలంగా ఉండే మాస పంచకానికి తొలిమాసం మాఘం. 'మఘం' అంటే యజ్ఞం. యజ్ఞయాగాది క్రతువులకు మాఘ మాసాన్ని శ్రేష్ఠమైనదిగా భావించే వారు. మాఘమాసం మహిమ అఘము అనే పదానికి సంస్కృతంలో పాపము అని అర్థం. మాఘము అంటే పాపాలను నశింప చేసేది అనే అర్థం. ఈ మఘాధి పత్యాన క్రతువులు జరిగే మాసం గనుక మాఘ మాసమైంది. సంవత్సరంలో పదకొండవ మాసమైన మాఘంలో గృహ నిర్మాణాలు ఆరంభిస్తే సంపత్తి కలుగగలదని మత్స్య పురాణం స్పష్ట పరుస్తున్నది. మాఘ మాసపు ఆదివారాలు మహిమాన్వితాలు. ఈ రోజులలో సూర్యపూజ చేసిన వారికి ఆరోగ్య, భోగ భాగ్యాలు కలుగుతాయని పద్మ పురాణాధారం. కార్తీకంలో "దీపానికి" ఎంత ప్రాధాన్యత ఉందో, మాఘ మాసంలో "స్నానానికి" అంత ప్రాముఖ్య ఉంది. మకర లగ్నంలో సూర్య భగవానుడు ఉండే సమయాన స్నానం ఫలితం కోటి జన్మాల పుణ్య కార్యాలతో లభ్యం కానిదని చెపుతారు. మాఘస్నాన మహాత్మ్యాన్ని బ్రహ్మాండ పురాణం పేర్కొంటోంది. సూర్యుడు ఉదయించే సమయంలో స్నానం చేస్తే మహాపాతకాలు నశిస్తాయని నిర్ణయ సింధులో పేర్కొన బడింది. మాఘమాసంలో ఉషఃకాల స్నానం పుణ్యప్రదం. సూర్యుడు ఉన్న మకర రాశిని బట్టి ప్రత్యూష కాలంలో సూర్యకిరణాలు ఒక ప్రత్యేక కోణంలో భూమిని చేరుతాయి. ఆ సమయంలో సూర్య కిరణాల్లో ఉండే అతినీల లోహిత, పరారుణ కిరణాల సాంద్రతల్లో మార్పులొస్తాయి. సూర్యుడు మకర రాశిగతుడు అయినప్పటి నుండి ప్రాతఃకాల స్నానాలు తప్పక చేయాలి. మాఘ మాసంలో ఉషఃకాల సమయాన నదులలో, చెరువులలో, మడుగులలో, కొలను లలో, తుదకు బావులలో స్నానం చేస్తే ప్రయాగ స్నాన ఫలితం దక్కుతుంది. మాఘమాసంలో సూర్యుడు మకరరాశిలో ఉండే సమయంలో సూర్యోదయానికి ముందు వేడి నీటిలోనైనా ఇంట్లో స్నానం చేసిన స్నానంతో నైనా ఆరు సంవత్సరాల అఘమర్షణ స్నాన ఫలం లభిస్తుందని చెబుతుంటారు. బావి నీటి స్నానం పన్నెండేళ్ల పుణ్య ఫలాన్ని, తటాక స్నానం ద్విగుణం, నదీ స్నానం చాతుర్గుణం, మహానదీ స్నానం శత గుణం, గంగా స్నానం సహస్ర గుణం, త్రివేణీ సంగమ స్నానం నదీ శత గుణ ఫలాన్ని ఇస్తాయని పురాణాలు చెబుతున్నాయి. హిందూ సంప్రదాయం ప్రకారం మాఘ మాసములో నదీస్నానము చేసి, శ్రీమన్నారాయణుని పూజిం చి, శక్తికొలది దానం చేస్తే కోటి క్రతువులు చేసినంత ఫలితం కలుగుతుంది. మాఘమాసంలో నది నీరైననూ గంగానదితో సమానం. "గంగేచ యమునే గోదావరి సరస్వతీ – నర్మదా సింధు కావేరీ జలేస్మిన్ సన్నిధిం కురు". గంగ, గోదావరి, కావేరీ లాంటి పవిత్ర నదులను తలుచు కుని, పుణ్య స్నానం ఆచరించాలి. సూర్యుడికి అర్ఘ్యం ప్రదానం చేయాలి. అశక్తత చేత నిర్ణీత సమయ మందు స్నానం చేయ జాలని వారు పొద్దు పొడిచిన జాములోగా చేయాలి. చలికి వెరవ కయే మం,చు ఆవరించి ఉన్న నదీ జలాలలో, స్నానం శ్రేష్ఠమని పురా ణాలు ఘోషిస్తున్నాయి. స్నానానంతరం శివాలయాలకు వెళ్లి, నువ్వుల నూనెతో దీపాలు వెలిగిస్తే సకల దోష పరిహారం కాలదనే విశ్వాసం. మాఘమాన అరుణోదయ స్నానం,అరుణోదయ దీపారాధనం, తిల దానం, తిల భక్షణం ఉత్కృష్ట మైనవి.

**– రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

## మేడారం జాతర పోరాట పటిమకు ప్రతీక

ఏడు వందల యేండ్ల నాటి జానపదుల జాతర
మట్టి మనుషులకు పోరాటా పటిమను నేర్పిన నేల
ఆనాటి పాలకుల అరాచకాలకు ఎదురు నిలిచిన
వనరాణుల దిక్సూచి
సమ్మక్క సారక్క సారథ్యంలో కదిలిన పోరాట యోధుల
జ్వాలిక
అడవి బిడ్డలకు యుద్ధం నేర్పిన దార్శనికత
రాజును ధిక్కరించిన గొంతుల కలయిక
కాకతీయులకు కనువిప్పు కలిగేలా చేసిన న్యాయ
పోరాటపు చతురత
ప్రతాపరుద్రుడి సైన్యాన్ని పరుగెత్తించిన వీరత్వపు వేదిక
అంగరంగవైభవంగా మురిసిపోయే చిలుకలగుట్ట వేడుక
చీమలా పుట్టాలోలే చిన్న పెద్ద ఒక్కటై ఆనందంగా
జరుపుకునే పండుగ
గద్దెలే గర్భగుడువలే వెలుగుతున్న మహనీయమైన దీపికా
బెల్లాన్ని బంగారంగా భావించే భక్తుల ప్రేమ గల జాతర
ఆసియా ఖండంలోనే అతి పెద్ద గిరిజన మహా
కుంభమేళా
మాఘ శుద్ధ పౌర్ణమి వీరవనితలకు ఇష్టమైన
రోజు యింకా
గోల్కొండ నుండి పయనం అయ్యేను పగిడిద్దరాజు
కన్నెపల్లె నుండి డబ్బు,చప్పుల్లతో బయలుదేరేను సారలమ్మ
కొండాయి నుండి కోటి కాంతుల వెలుగుల్లో వచ్చేను
గోవిందా రాజు
కుంకుమ భరణి రూపంలో సమ్మక్క భక్తులకు
కొంగుబంగారం అయ్యేను.
సమ్మక్క సారక్క గద్దెను చేరిన సమయాన ఓడి బియ్యం
మొక్కులతో భక్తజనం పరవశించేను
ఎదురుకోళ్లతో మనసులో కోరికలు అమ్మలకు
అప్పజెప్పుకొనెను
సమ్మక్క సారలమ్మ యుద్ధనీతి నేటి మహిళాలోకానికి స్ఫూర్తి
సమ్మక్క సారలమ్మ సమయస్ఫూర్తి తరాలు మరువని
ఘనకీర్తి
వీరవనితలు మహాశక్తి దైవాలుగా కొలువబడుతున్న గొప్ప
విలక్షణ సంస్కృతికి నాంది.

మేడారం జాతర సందర్భంగా ప్రచురించగలరని మనవి



**వంశీకృష్ణ గౌడ్.బండి
రంగయ్యపల్లి, రేగొండ
జయశంకర్ భూపాలపల్లి జిల్లా
9550837962**

# సంస్కరణాభిలాషి దేవేంద్రనాథ్ ఠాగూర్

***దేవేంద్రనాథ్ ఠాగూర్ (మే 15 1817– జనవరి 19 1905) హిందూ తత్వవేత్త, బ్రహ్మ సమాజంలో మత సంస్కర్త. బ్రహ్మ సమాజ చరిత్రలో దేవేంద్రనాథ్ ఠాగూర్ పాత్ర ఎన్నదగినది. దేవేంద్రనాథ్ ఠాగూర్ ఈ దేశం సృష్టించిన గొప్పమత మేధావులలో ఒకరు. ఆయనను. పూర్వ నిజంగా ఋషుల వారసునిగా భావించేవారు.. ఆయన స్వభావం ముఖ్యంగా ఆధ్యాత్మికం. ఆయన హిందూ మత సంస్కరణానికి కృషి చేశారు. 1848లో బ్రహ్మో మతం స్థాపించిన వ్యక్తి.***

**విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ ఆయన కుమారుడే.**

దేవేంద్రనాథ్ ఠాగూర్ ధనిక కుటుంబంలో బెంగాల్‌లో శ్రీలైదాహలో జన్మించారు. ఆయన తండ్రి ప్రముఖ విద్వాంసులు, ఆధ్యాత్మిక వేత్త ద్వారకానాథ్ ఠాగూర్. దేవేంద్రనాథ్ వంశస్థులు తరతరాలుగా స్థితిమంతులే కాక ఉన్నత విద్యావంతులు, వారి రంగాల్లో నిపుణులూ కూడా అయి ఉన్నారు. దేవేంద్రనాథ్ ఠాగూర్ తండ్రి ద్వారకానాథ్, ఆయనలోని దాతృత్వ గుణం కారణంగా ప్రిన్స్ అనే పేరుతో పిలిచేవారు. ద్వారకానాథ్ ఠాగూర్ ఆనాటి వంగదేశంలో సంస్కర్తగా, మతకర్తగా ప్రఖ్యాతులైన రాజా రామ్మోహనరాయ్‌తో సన్నిహిత సంబంధాలు ఉండేవి. ఆయన సంస్కరణా భిలాషను, హిందూమత ఔన్నత్య చింతననూ ద్వారకానాథ్ అభినందిం చేవారు. రామమోహనరాయ్ ప్రారంభించిన బ్రహ్మ సమాజంపై సమాజం లోని నలువైపులా ఆరోపణలు, వ్యతిరేకత ప్రారంభమైన రోజుల్లో ద్వారకా నాథ్ బ్రహ్మసమాజానికి, రామ్మోహనరాయ్‌కి ప్రధాన సహాయకునిగా ఉండేవారు. ఠాగూరు కుటుంబపు జాగీరైన జాకో సంకోలోని ఒక భవనంలో బ్రహ్మసమాజపు మొదటి ప్రార్థనాలయాన్ని నిర్మించారు. దానికి బ్రాహ్మ సమాజం అని పేరుపెట్టారు రామ్మోహనరాయ్. ఆపైన జొరా సంకోలో ఠాగూరు వంశస్థులందరూ బ్రహ్మ సమాజీకులుగా మారారు. రామ్మోహనరాయ్ క్రైస్తవ మతప్రచారాన్ని తిప్పికొట్టేందుకు మిషనరీ పాఠశాలలకు ప్రతిగా ప్రారంభించిన విద్యాలయాల్లో కూడా ఠాగూర్ వంశస్థులే తొలి విద్యార్థులుగా చేరారు.

## జనవరి 19... దేవేంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతి

**దేవేంద్ర నాథ్ తండ్రి జమీందార్ అయిన ద్వారకానాథ్, అనేక ఆస్తులు...**

టీ, జనపనార వ్యాపారం, చక్కెర శుద్ధి, వార్తాపత్రికలు, షిప్పింగ్ వంటి వ్యాపారాలను కలిగి ఉండేవారు. 18 సంవత్సరాల వయస్సులో, దేవేం ద్రనాథ్ ప్రాపంచిక వ్యవహారాలతో తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తూనే, తన ఆలోచనలకు అనుగుణంగా వ్యవహారాలను కొనసాగిస్తున్న సమయాన ఏదో తెలియని నిర్లిప్త భావాన్ని పెంచుకున్నారు. కొంత కాలానికి వ్యాపార నిర్వహణ చాలా వరకు సిబ్బందికి అప్పగించారు. తన సమయాన్ని ఆధ్యాత్మిక సత్యంపై గడపాలని ఎంచుకున్నారు. అది జీవితకాల అన్వేషణగా మారింది. 1848లో బ్రహ్మోయిజం అనే మతాన్ని స్థాపించారు. దేవేం ద్రనాథ్ ఆది ధర్మ సిద్ధాంతాన్ని బ్రహ్మ ధర్మ బీజ్ (బ్రహ్మ ధర్మానికి బీజం)గా క్రోడీకరించారు. 1950 లో, అతను ప్రాథమిక సూత్రాలను పొందుపరుస్తూ బ్రహ్మ ధర్మ అనే పుస్తకాన్ని ప్రచురించారు. ఈ సూత్రాలు ఏకేశ్వరోపాసన, హేతుబద్ధతను నొక్కిచెబుతాయి. 19 జనవరి 1905న మరణించే వరకు దానికి నమ్మకంగా ఉన్నారు, దానిని మరియు సేవించారు.

రాజా రామ్ మోహన్ రాయ్ యొక్క బ్రహ్మ సభ (తరువాత బ్రహ్మ సమాజం) నుండి ప్రేరణ పొందిన, బ్రహ్మోయిజం అనేది 19వ శతాబ్దపు బెంగాల్ ప్రతిఘటనకు కీలకమైన సంస్కరణవాద మతం. ఇది ఉపనిషత్తుల పఠనాలపై ఎక్కువగా ఆధారపడింది. ఉపనిషత్తులను అనుసరించిన దేవేంద్ర నాథ్ మాస్టర్ గా తర్వాత మహర్షి అయ్యారు.



బ్రహ్మ సభకు ప్రారంభ సందర్శనలలో, అన్ని కులాలు, మతాల ప్రజలు వివక్ష లేకుండా ఎలా స్వాగతించ బడ్డారో ఆయన గమనించారు. తత్వ బోధిని అనే పత్రికను 1843లో స్థాపించి, నాటి సాంఘిక దురాచారాలు, మూఢ నమ్మకాలకు, మిషనరీల ద్వారా ధార్మిక పరివర్తనకు వ్యతిరేకంగా ప్రచురణల పరంపర కొనసాగించారు. ఆయన మొదట తత్వబోధిని సభ అనే ప్రత్యేక వేదాంత సమాజాన్ని నడిపారు, కాని తరువాత రెండింటినీ విలీనం చేసి బ్రహ్మో ఉద్యమాన్ని చేపట్టాలని నిర్ణయించుకున్నారు.

నేను బ్రహ్మసమాజాన్ని సంస్కరించే బాధ్యతను స్వీకరించాను మరియు దానితో తత్వబోధిని సభను విలీనం చేసాను, "అని ఆయన తన ఆత్మకథలో రాశారు. తత్వబోధిని సభ బ్రహ్మ సమాజ ప్రయోజనాలను మరింత పెంచేలా ఏర్పాటు చేయ బడింది.

ఆయన అమితంగా ఇష్టపడే అమ్మమ్మ మరణం దేవేంద్రునిలో మౌలిక మార్పుకు కారణమైంది. ఆమె మరణం యువకుడైన దేవేంద్రనాథ్‌ను శాశ్వతంగా మార్చేసింది.

"నేను ఇక ఇదివరకటి మనిషిలా లేను. నాలో సంపద పట్ల బలమైన విరక్తి ఏర్పడింది. నేను కూర్చున్న ముతక వెదురు చాప నాకు సరిపోయే ఆస నంగా అని అనిపించింది, తివాచీలు, ఖరీదైన వస్తువులు ద్వేషపూరితంగా అనిపించాయి, నా మనస్సులో ఇంతకు ముందు అనుభవించని ఆనందం మేల్కొంది, "అని ఆయన పేర్కొన్నారు.

వృద్ధాప్యంలో, దేవేంద్రనాథ్ మరింత ఒంటరిగా మారారు, తాము స్థాపించిన మతం వ్యవహారాల నుండి వైదొలిగి, మరింత శాంతియుత వాతావరణాన్ని కోరుకున్నారు. 1860వ దశకంలో, శాంతినికేతన్‌కు వెళ్లారు. అక్కడ గ్రంథాలను చదవడం మరియు బ్రహ్మోయిజం యొక్క పరిమితులను గురించి ఆలోచించడం కొనసాగించారు. ఆయన అమితంగా ప్రేమించే రూపం ఆయన దైవం బ్రహ్మ.

"నేను వెళ్లి ఒక అశ్వత్థ చెట్టు క్రింద కూర్చున్నాను, ఆత్మలో నివసించే పరమాత్మ గురించి ధ్యానం చేయడం ప్రారంభించాను, " అని తమ మొదటి బ్రహ్మ దర్శనంపై రాశారు.

"నా మనస్సు భావోద్వేగాలతో నిండిపోయింది, నా కళ్ళు కన్నీళ్లతో నిండిపోయాయి. ఒక్కసారిగా నా హృదయ కమలంలో బ్రహ్మదేవుని ప్రకాశించే దృశ్యం కనిపించింది. నా శరీరమంతా పులకించింది. నేను అన్ని స్థాయిలకు మించిన ఆనందాన్ని అనుభవించాను".

కుల వ్యవస్థను త్యజించడం, విగ్రహారాధనతో సహా సంస్కరణవాద విధానం, ఆ కాలంలోని అత్యంత ప్రభావవంతమైన మతాలలో ఒకటిగా బ్రహ్మోయిజాన్ని మార్చింది. దాని ఆలోచనలు ప్రజలను ఆలోచింప చేశాయి. దేవేంద్రనాథ్ ఆధ్వర్యంలో బ్రహ్మోయిజం ప్రభావం భారతదేశం అంతటా వ్యాపించి, అతను ప్రత్యేక ఆధ్యాత్మిక సాఫల్య వ్యక్తిగా ఖ్యాతిని పొందాడు మరియు మహర్షిగా పిలువబడ్డాడు. దేవేంద్రనాథ్‌ను సందర్శించిన 19వ శతాబ్దపు గొప్ప హిందూ ఋషి శ్రీరామకృష్ణ అతని ఆధ్యాత్మిక స్థాయిని ధృవీకరించారు. బెంగాల్ పునరుజ్జీవనం మరియు హిందూ మతం యొక్క సంస్కరణ మరియు పునరుజ్జీవనంలో దేవేంద్రనాథ్ పాత్రలు నిస్సందేహమైనవి.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్,... 9440595494**

## నోట్లో ఉండే బ్యాక్టీరియాతో

# లివర్ వ్యాధి ప్రమాదం

### సైంటిస్టుల అధ్యయనాల్లో వెల్లడి..



సాధారణంగా మనం నోటిలో ఉండే బ్యాక్టీరియా వలన నోటి సమస్యలు, దంత సమస్యలు తలెత్తుతాయని భావిస్తాం. కానీ నోటిలో ఉండే బ్యాక్టీరియా పొట్ట ఆరోగ్యాన్ని గణనీయంగా ప్రభావితం చేస్తుందని, దీర్ఘకాలిక కాలేయ వ్యాధి ప్రమాదాన్ని పెంచుతుందని అధ్యయనంలో తేలింది. ప్రతి సంవత్సరం దాదాపు రెండు మిలియన్లకు పైగా ప్రజలు అడ్వాన్స్‌డ్ క్రానిక్ లివర్ డిసీజ్ తో మరణిస్తున్నారు. 86 మంది రోగుల నుండి లాలాజలం, మలం నమూనాలలో బ్యాక్టీరియా సంఖ్యను విశ్లేషించారు. కాలేయ వ్యాధి తీవ్రతరం కావడంలో జీర్ణాశయంలో మైక్రోబయోమ్ రెండు గణనీయమైన మార్పులకు లోనవుతున్నాయని జర్మనీలోని మ్యూనిచ్ టెక్నికల్ యూనివర్సిటీ బృందం కనుగొన్నారు.

**పేగుల ఆరోగ్యానికి నష్టం..**

మన శరీరంలో ఒక శరీర భాగంలో బ్యాక్టీరియా ఒక్కో రకంగా ఉంటుంది. కానీ కాలేయ వ్యాధి ఉన్న రోగుల్లో వ్యాధి పెరిగే కొద్ది నోటి, పొట్టలో ఉండే బ్యాక్టీరియా మరింత సారూప్యంగా మారుతుంది. నోరు, పొట్టలో ఒకేలాంటి బ్యాక్టీరియా జాతులు కనుగొనబడ్డాయి. ఈ జాతులు సాధారణంగా నోటిలో కనిపిస్తాయి. ఆరోగ్యకరమైన ప్రేగుల్లో చాలా అరుదుగా ఉంటాయి. దీర్ఘకాలిక కాలేయ వ్యాధి ఉన్న రోగుల్లో ఈ నోటి బ్యాక్టీరియా సంపూర్ణ సమృద్ధిలో పెరుగుదలను పరిశోధకులు కనుగొన్నారు. నోటిలో ఉండే ఈ బ్యాక్టీరియా నోటి నుండి స్థానాంతరం చెంది ప్రేగులలో స్థిరపడుతుందని పరిశోధకులు చెబుతున్నారు. అంతేకాకుండా రోగి ప్రేగుల్లో నోటిలో ఉండే అనేక బ్యాక్టీరియా జాతులను కూడా వారు కనుగొన్నారు. అలాగే మలం నమూనాలో ఉండే ఈ బ్యాక్టీరియా పేగు ఆరోగ్యానికి కూడా నష్టాన్ని కలిగిస్తుందని వారు వెల్లడించారు.


**నోట్లోని బ్యాక్టీరియా జీర్ణాశయానికి..**

ఈ బ్యాక్టీరియా కొల్లాజెన్ డిగ్రేడేషన్ ఎంజైమ్ లను ఎన్‌కోడ్ చేసే జన్యువులను కలిగి ఉంటుందని జన్యు విశ్లేషణలో తేలింది. కొల్లాజెన్ విచ్ఛిన్నం పొట్ట ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. ఇది బ్యాక్టీరియా, బ్యాక్టీరియా ఉత్పత్తులు కాలేయం వంటి ఇతర అవయవాలను చేరుకోవడానికి వీలు కల్పిస్తుంది. ఇది వ్యాధిని మరింత తీవ్రతరం చేస్తుందని పరిశోధకులు చెబుతున్నారు. ఇలాంటి పరిశోధనలు చేయడం వల్ల దీర్ఘకాలిక కాలేయ వ్యాధితో బాధపడే వారికి కొత్త చికిత్స వ్యూహాలను కనుగొనవచ్చని, పొట్ట ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చని పరిశోధకులు తెలియజేస్తున్నారు. ఈ విధంగా నోటి బ్యాక్టీరియా జీర్ వ్యవస్థ ఆరోగ్యాన్నిగణనీయంగా ప్రభావితం చేస్తుందని, దీర్ఘకాలిక కాలేయ వ్యాధి ప్రమాదాన్ని పెంచుతుందని పరిశోధకులు వెల్లడిస్తున్నారు.

## తరచూ ఈ వైద్య పరీక్షలను తప్పకుండా

# చేయించుకోవాలి..!

**తీవ్ర ఆరోగ్య సంక్షోభం తలెత్తే వరకు అనారోగ్య సమస్యలు చాలా వరకు గుర్తించబడవు. 30 ఏళ్లు పైబడిన తరువాత దీర్ఘకాలిక అనారోగ్య సమస్యల బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కనుక సమస్యలను ముందుగానే గుర్తించడం చాలా అవసరం. ప్రతి సంవత్సరం ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటూ సమస్యలను ప్రారంభదశలోనే గుర్తించడం వల్ల చికిత్స తీసుకోవడం సులభతరం అవుతుంది. 30 ఏళ్లు దాటిన తరువాత గుండె జబ్బులు, మధుమేహం, అధిక రక్తపోటు, మూత్రపిండాల వ్యాధులు, కొన్ని రకాల క్యాన్సర్ లు వచ్చే అవకాశం ఉంది. వీటిని ముందుగానే గుర్తించడం, నివారించడం కోసం వార్షిక ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం తప్పనిసరి. 30 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయసు ఉన్న వారు చేయించుకోవాల్సిన ఆరోగ్యపరీక్షల వివరాల గురించి తెలుసుకుందాం.**



**రక్తపోటు...**

30 ఏళ్లు పైబడిన వారు చేయించుకోవాల్సిన ఆరోగ్య పరీక్షల్లో రక్తపోటు కూడా ఒకటి. ఇది ఎటువంటి లక్షణాలు లేకుండా వస్తుంది. 120/80 ఎమ్ఎమ్ హెచ్‌జి కంటే ఎక్కువ వచ్చే రీడింగ్ లు గుండెపోటు, స్ట్రోక్, మూత్రపిండాల పనితీరు దెబ్బతిన ◌ేలా చేస్తాయి. కనుక ముందునుండే రక్తపోటు పరీక్షలు చేయించుకోవాలి. ఉప్పు తీసుకోవడం తగ్గించాలి. వ్యాయామాలు చేస్తూ ఒత్తిడిని అదుపులో ఉంచుకునే ప్రయత్నం చేయాలి. దీంతో దీర్ఘకాలం పాటు గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. లిపిడ్ ప్రొఫైల్ పరీక్షలు, ట్రైగ్లిజరాయిడ్స్ వంటి పరీక్షలు చేయించుకోవాలి. ఎక్కువగా ఉండే చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు రక్తనాళాల్లో అడ్డంకులు ఏర్పడేలా చేస్తాయి. కనుక ముందు నుండే రక్తపరీక్షలు చేయించుకుంటూ చక్కటి ఆహారాన్నితీసుకునే ప్రయత్నం చేయాలి. ఓట్స్, మెంతులు వంటివి ఆహారంలో తీసుకోవడం వల్ల మంచి కొలెస్ట్రాల్ స్థాయిలు పెరుగుతాయి. దీని వల్ల గుండె జబ్బుల ప్రమాదాన్ని మనం ముందు నుండే తగ్గించుకోవచ్చు.

**డయాబెటిస్ పరీక్షలు..**

టైప్ 2 డయాబెటిస్ కోసం హెచ్‌బిఎ1సి పరీక్షలు చేయించుకోవడం మంచిది. హెచ్‌బిఎ1సి స్థాయిలు 5.7 శాతం కంటే ఎక్కువగా ఉంటే ఇది ఇన్సులిన్ నిరోధకతను సూచిస్తుంది. దీనిని ముందుగానే నిర్ధారించడం వల్ల ఆహారం, వ్యాయామాలతో దీనిని తిప్పికొట్టవచ్చు. కాకరకాయ, దాల్చిన చెక్క వంటి వాటిని తీసుకుంటూ యోగా, వ్యాయామం వంటివి చేయడం వల్ల, ఆహార నియంత్రణ పాటించడం వల్ల ఇన్సులిన్ నిరోధకతను మెరుగుపరుచుకోవచ్చు. డయాబెటిస్ ను ముందుగానే గుర్తించకపోవడం వల్ల న్యూరోపతి, రెటినోపతి, మూత్రపిండాల వైఫల్యం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. కనుక డయాబెటిస్ కు సంబంధించిన పరీక్షలు చేయించుకోవడం కూడా చాలా అవసరం.

**మహిళలు గర్భాశయ క్యాన్సర్ స్క్రీనింగ్..**

30 నుండి 65 సంవత్సరాల వయసు ఉన్న మహిళలు ప్రతి 3 సంవత్సరాలకు ఒకసారి పాప్ స్మియర్ చేయించుకోవాలి లేదా ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి హెచ్‌పివి పరీక్ష చేయించుకోవాలి. దీని ద్వారా గర్భాశయ క్యాన్సర్ ను ముందుగానే గుర్తించవచ్చు. క్రమం తప్పకుండా తనిఖీలు చేయడం వల్ల పునరుత్పత్తి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. చర్మంపై యువీ కిరణాలు ఎక్కువగా పడడం వల్ల మెలనోమా ప్రమాదం పెరుగుతుంది. చర్మంపై అసమాన, క్రమరహిత, వివిధ రంగుల్లో 6 మిమీ కంటే ఎక్కువ పరిమాణం చెందుతున్న గాయాలు చర్మ క్యాన్సర్ ను ముందుగానే గుర్తించడానికి సహాయపడతాయి. సన్ స్క్రీన్ ను ఉపయోగించడం, రక్షణ దుస్తులను ధరించడం, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం వల్ల చర్మ క్యాన్సర్ ను నిరోధించవచ్చు.

**కంటి పరీక్షలు..**

ప్రతి 1 లేదా 2 సంవత్సరాలకు ఒకసారి కంటి పరీక్షలు చేయించుకోవడం వల్ల గ్లాకోమా, కంటిశుక్లం, మాక్యులర్ క్షీణత వంటి సమస్యలను ముందుగానే గుర్తించవచ్చు. వయసుతో పాటు కంటిపై ఒత్తిడి పెరుగుతుంది. కంటి పరీక్షల ద్వారా డయాబెటిస్, రక్తపోటు ప్రారంభాన్ని కూడా గుర్తించవచ్చు. ప్రతి సంవత్సరం దంతాలను పరీక్షించుకోవడం కూడా చాలా అవసరం. నోటి క్యాన్సర్ స్క్రీనింగ్ చేయించుకోవడం వల్ల గుండెజబ్బులు, మధుమేహం వంటి వ్యాధులతో ముడిపడి ఉన్న ప్లేక్ నిర్మాణం , చిగుళ్ల వాపును పరిష్కరించుకోవచ్చు. పీరియాంటైటిస్ నుండి వచ్చే బాక్టీరియా రక్తప్రవాహంలోకి ప్రవేశించి అథెరోస్క్లెరోసిస్ ను తీవ్రతరం చేస్తుంది. ఎక్స్ రే కిరణాలు దాగి ఉన్న బ్యాక్టీరియాను, ఎముకల నష్టాన్ని వెల్లడిస్తాయి. కనుక దంత పరీక్షలు చేయించుకోవడం కూడా చాలా అవసరం. బ్యాక్టీరియాను తగ్గించడానికి రోజూ నువ్వుల నూనె లేదా కొబ్బరి నూనెతో పుల్లింగ్ చేస్తూ ఉండాలి.

**థైరాయిడ్ టెస్ట్..**

టిఎస్‌హెచ్, టి3, టి4 రక్తపరీక్షలు చేయించుకోవడం వల్ల థైరాయిడ్ గ్రంథి పనితీరును తెలుసుకోవచ్చు. థైరాయిడ్ గ్రంథి పనితీరు మందగించడం వల్ల అలసట, జుట్టు రాలడం, బరువు పెరగడం, ఆందోళన, గుండెదడ వంటి సమస్యలు ఎదురవుతాయి. కనుక థైరాయిడ్ కు సంబంధించిన పరీక్షలు చేయించుకోవడం కూడా చాలా అవసరం. ఈ విధంగా ప్రతి సంవత్సరం పైన చెప్పిన పరీక్షలు చేయించుకోవడం వల్ల అనారోగ్య సమస్యలను ముందుగానే గుర్తించవచ్చు. దీంతో ఆయా సమస్యలు మరింత తీవ్రతరం కాకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చు.

# న్యుమోనియా బారిన పడిన చిన్నారుల్లో కనిపించే లక్షణాలు



ప్రపంచ వ్యాప్తంగా, భారతదేశంలో ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయసు ఉన్న పిల్లలు న్యుమోనియా అనే ప్రాణాంతక ఇన్ఫెక్షన్ ను ఎదుర్కొంటున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ కారణంగా శ్వాస తీసుకోవడం కష్టతరంగా మారుతుంది. ఇది దాదాపు 30 మిలియన్ల మంది పిల్లలను ప్రభావితం చేస్తుందని గణంకాలు చెబుతున్నాయి. ఈ ఇన్ఫెక్షన్ కూడా అధిక మరణాల రేటును కలిగి ఉంది. ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయసు ఉన్న పిల్లలలో 14 శాతం మంది మరణాన్ని ఎదుర్కోవచ్చు. బ్యాక్టీరియా, వైరస్ లు ఈ న్యుమోనియాకు ప్రధాన కారణాలు. న్యుమోనియా కారణంగా ఊపిరితిత్తులు బలహీనపడడంతో పాటు మొత్తం రోగనిరోధక శక్తి బలహీనపడుతుంది. కనుక పిల్లలల్లో న్యుమోనియాను ముందుగానే గుర్తించడం అవసరం.

**కఫంతో కూడిన దగ్గు..**

న్యుమోనియా లక్షణాలను ముందుగానే గుర్తించి తగిన చికిత్స ఇవ్వడం వల్ల పిల్లలల్లో మరణాల రేటును కూడా తగ్గించవచ్చు. న్యుమోనియా బారిన పడినప్పుడు పిల్లలల్లో కొన్ని సంకేతాలు, లక్షణాలు కనిపిస్తాయి. వీటిని చాలా మంది గుర్తించరు. సాధారణ జలుబు, దగ్గుగా భావిస్తూ ఉంటారు. కనుక పిల్లల్లో న్యుమోనియా లక్షణాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. నిరంతరం పొడి దగ్గు రావడం లేదా కఫంతో కూడిన దగ్గు రావడం శరీరంలో న్యుమోనియా ఉందని చెప్పడానికి ఒక సంకేతం. ఈ దగ్గు ఊపిరితిత్తుల్లో వాపు , అవి శ్లేష్మం లేదా ద్రవంతో నిండడం వల్ల వస్తుంది. ఈ శ్లేష్మాన్ని లేదా ద్రవాన్ని బయటకు పంపడానికి పిల్లలకు దగ్గు వస్తుంది. సాధారణ దగ్గులా కాకుండా న్యుమోనియా వల్ల వచ్చే దగ్గు బొంగురుగా ఉంటుంది, తీవ్రమైన నొప్పిని కలిగిస్తుంది. న్యుమోనియా ముఖ్య లక్షణాల్లో వేగంగా శ్వాస తీసుకోవడం కూడా ఒకటి.

**శరీర ఉష్ణోగ్రతలో మార్పులు..**

ఊపిరితిత్తుల్లో ద్రవం పేరుకుపోవడం వల్ల ఆక్సిజన్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతాయి. పిల్లల ఛాతిని చూసి ఈ లక్షణాన్ని గమని ◌ంచాలి. వైద్యులు కూడా ఎక్కువగా పిల్లల ఛాతిని గమనించి న్యుమోనియాను గుర్తిస్తారు. న్యుమోనియా ఉన్న పిల్లలల్లో ఛాతి నొప్పి లేదా ఛాతిలో అసౌకర్యం ఉంటుంది. ఊపిరితిత్తులు వాటి పనులను సరిగ్గా నిర్వహించకపోవడం వల్ల ఈ అసౌకర్యం తలెత్తుతుంది. శ్వాస తీసుకోవడానికి ప్రయత్నించినప్పుడు ఈ అసౌకర్యం లేదా నొప్పి మరింత తీవ్రతరం అవుతుంది. వైద్యులు ఛాతి ఎక్స్ రేను బట్టి కూడా న్యుమోనియాను నిర్ధారిస్తారు. మనం ఏదైనా ఇన్ఫెక్షన్ కు గురి అయినప్పుడు సహజంగానే శరీరం జ్వరాన్ని అభివృద్ధి చేస్తుంది. చలి, జ్వరం అనేది సాధారణ ఇన్ఫెక్షన్ కు గుర్తులు. పిల్లల శరీరం బ్యాక్టీరియా లేదా వైరస్ లను చంపడానికి శరీర ఉష్ణోగ్రతను పెంచడం వల్ల ఇది జరుగుతుంది. ఇన్ఫెక్షన్ ను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి శరీరం అధిక ఉష్ణోగ్రతను చేరుకునే క్రమంలో చలి అభివృద్ధి అవుతుంది. చలితో అధిక జ్వరంతో బాధపడుతుంటే వారిలో తీవ్రమైన ఇన్ఫెక్షన్ ఉందని వారికి తక్షణ వైద్యం అవసరమని అర్థం.

**ఆకలి ఉండదు..**

ముఖ్యంగా ఐదు సంవత్సరాల లోపు పిల్లలు చలితో, జ్వరంతో బాధపడ ◌ుతుంటే వారిలో బ్యాక్టీరియల్ న్యుమోనియా ఉందని అర్థం చేసుకోవాలి. అలాగే న్యుమోనియా ఉన్న పిల్లలల్లో అలసట, బలహీనత సర్వసాధారణం. ఇన్ఫెక్షన్ వల్ల పోరాడడం వల్ల శరీరం అలసిపోతుంది. వారి రోజువారీ కార్యకలాపాలు కూడా మందగిస్తాయి. చికిత్స అందిన తరువాతే వారిలో శక్తి సామర్థ్యాలు తిరిగి వస్తాయి. అదేవిధంగా న్యుమోనియా బారిన పడిన పిల్లల్లో ఆకలి తగ్గుతుంది. తినడానికి, తాగడానికి కూడా వారు నిరాకరిస్తారు. ఇన్ఫెక్షన్ వల్ల, శరీరానికి ఆక్సిజన్ సరఫరా తగ్గడం వల్ల ఆకలి తగ్గుతుంది. న్యుమోనియాతో బాధపడే 60 శాతం మంది పిల్లల్లో ఆకలిలేదని ఒక అధ్యయనంలో తేలింది. ఇక శరీరంలో ఆక్సిజన్ సరఫరా తగ్గడం వల్ల పెదవులు, గోర్లు నీలి రంగులోకి మారతాయి. న్యుమోనియాను తెలియజేసే తీవ్రమైన లక్షణాల్లో ఇది ఒకటి. ఊపిరితిత్తుల్లో ద్రవం చేరడం వల్ల ఆక్సిజన్ సరఫరా తగ్గుతుంది. దీంతో పెదవులు, గోర్లు నీలంగా మారతాయి. పిల్లల్లో ఇటువంటి లక్షణాలను గమనించిన వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లి తగిన చికిత్స అందించాలి. ఈ లక్షణాలను అస్సలు నిర్లక్ష్యం చేయకూడదు. వీటిని నిర్లక్ష్యం చేయడం వల్ల ప్రాణాలకే ప్రమాదంగా మారుతాయి. కనుక న్యుమోనియాకు సంబంధించిన ఇటువంటి లక్షణాలు కనిపించిన వెంటనే పిల్లలకు చికిత్స అందించడం చాలా అవసరం.

## మార్కెట్


### మరింత వేగంగా ఫిర్యాదుల పరిష్కారం



బ్యాంకింగ్ సేవల్లో ఎదురయ్యే సమస్యలు, ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియను మరింత సమర్థంగా, వేగంగా మార్చేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. బ్యాంకులతో పాటు, ఇతర నియం త్రిత సంస్థల ఖాతాదారుల ప్రయోజనాలు కాపాడటమే లక్ష్యంగా 'రిజర్వ్ బ్యాంక్-సమగ్ర అంబుడ్స్‌మన్ పథకం -2026'ను తీసుకురానుంది. ఇందుకోసం 'రిజర్వ్ బ్యాంక్- అంబుడ్స్‌మన్ స్కీం 2025'కు కొన్ని సవరణలతో ముసాయిదాను శుక్రవారం విడుదల చేసి, ప్రజల అభిప్రాయాలు కోరింది. ఇవి కూడా వచ్చాక, క్రోడీకరించి, నిబంధనలు ఖరారు చేస్తుంది. కొత్త పథకం 2026 జులై 1 నుంచి అమల్లోకి రానుంది. ఫిర్యాదిదారులకు తక్కువ ఖర్చుతో, వేగవంతమైన పరిష్కారాన్ని అందించడమే దీని ప్రధాన లక్ష్యమని ఆర్‌బీఐ పేర్కొంది. విచారణలు క్లుప్తంగా ఉంటాయని, ఇవి సాధారణ సాక్ష్యాధారాల నిబంధనలకు లోబడి ఉండవని స్పష్టం చేసింది. ఈ బాధ్యతలను నిర్వహించేందుకు ఆర్‌బీఐ తన అధికారుల నుంచి ఒకరు లేదా అంతకంటే ఎక్కువమందిని ఆర్‌బీఐ అంబుడ్స్‌మన్, ఆర్‌బీఐ డిప్యూటీ అంబుడ్స్‌మన్‌లుగా నియమిస్తుంది. సాధారణంగా వీరి నియామక కాలపరిమితి ఒకేసారి మూడేళ్ల వరకు ఉంటుంది. ఫిర్యాదుల స్వీకరణ, పరిశీలన కోసం ఆర్‌బీఐ ఒకటి లేదా పలు చోట్ల సీఆర్‌పీసీ (సెంట్రలైజ్డ్ రిసీప్ట్ అండ్ ప్రాసెసింగ్ సెంటర్)లు ఏర్పాటు చేయనుంది. వినియోగదారులు తమ ఫిర్యాదులను ఆన్‌లైన్ ద్వారా సులభంగా సమర్పించే వీలుంటుంది. నూతన విధానంలో వివాదానికి సంబంధించిన మొత్తంపై గరిష్ఠ పరిమితి విధించలేదు. అంబుడ్స్‌మన్ లేదా డిప్యూటీ అంబుడ్స్‌మన్ ఆ వివాదాలపై రాజీ కుదర్చడం లేదా తగిన తీర్పు (అవార్డు) ఇవ్వడం ద్వారా సమస్యను పరిష్కరిస్తారు. ఖాతాదారులకు కలిగిన నష్టానికి సంబంధించి, గరిష్ఠంగా రూ.30 లక్షల వరకు పరిహారం చెల్లించాలని ఆదేశించే అధికారం అంబుడ్స్‌మన్‌కు ఉంటుంది. దీనికి అదనంగా మరో రూ.3 లక్షల వరకు పరిహారం అందించే వీలుందని ఆర్‌బీఐ వెల్లడించింది.

# ఈవీ భవిత.. రాబోయే బడ్జెట్‌లో

- పీఎల్‌ఐలో మార్పులు అవసరం
- పెట్టుబడి పరిమితులు తగ్గిస్తేనే అంకురాలకు ఊరట
- డెలాయిట్ ఇండియా నివేదిక



దేశంలో విద్యుత్ వాహన (ఈవీ) రంగం కొన్నేళ్లుగా వృద్ధి చెందుతున్నప్పటికీ, 2030 నాటికి నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించాలంటే ప్రస్తుత విధానాల్లో సమూల మార్పులు అవసరమని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాలు (పీఎల్‌ఐ) పథకం నిబంధనలు, జీఎస్‌టీ రేట్లు, ఫేమ్ సబ్సిడీ కొనసాగింపు వంటి అంశాలపై 2026-27 కేంద్ర బడ్జెట్‌లో స్పష్టమైన నిర్ణయాలు ప్రకటించాల్సిన అవసరం ఉందని డెలాయిట్ ఇండియా విడుదల చేసిన నివేదిక పేర్కొంది. పెట్రోలు, డీజిల్ వాహనాలతో సమానంగా ఈవీలు నిలబడాలంటే, ప్రభుత్వ చేయూత అవసరమని పరిశ్రమ పేర్కొంటోంది. రాయితీలతో పాటు మరికొన్ని విధానపరమైన నిర్ణయాలూ అవసరమని పేర్కొంటోంది.

**పెద్ద కంపెనీలకే ప్రయోజనం**

కేంద్రం వాహన రంగాన్ని ప్రోత్సహించేందుకు తీసుకొచ్చిన పీఎల్‌ఐ పథకం ఉద్దేశం మంచిదే. అయితే ఈ నిబంధనలు ఈవీ రంగానికి పూర్తిగా మేలు చేయడం లేదని డెలాయిట్ నివేదిక తేల్చింది. ఈ పథకం కింద అర్హత సాధించాలంటే వాహన తయారీ కంపెనీలు (ఓఈఎం) అయిదేళ్లలో కనీసం రూ.2,000 కోట్ల పెట్టుబడి పెట్టాలి. ఇది పెద్ద కంపెనీలకు సాధ్యమే. కానీ, కొత్త ఆలోచనలతో వస్తున్న అంకురాలు, మధ్యతరహా పరిశ్రమలకు అంత తేలిక కాదని నివేదిక వివరించింది.

**ద్విచక్ర వాహన ప్రయోగాలన్నీ అంకురాల్లోనే**

దేశంలో ఈవీ విప్లవానికి నాంది పలికింది.. ప్రధానంగా ద్విచక్ర వాహన రంగంలోని అంకురాలే. కొత్తగా వస్తున్న స్టార్టప్‌లు బ్యాటరీ సాంకేతికతలో, మోటార్ల తయారీలో వినూత్న ప్రయోగాలు చేస్తున్నాయి. కానీ, రూ.2,000 కోట్ల పెట్టుబడి నిబంధన కారణంగా అవి పీఎల్‌ఐ ప్రయోజనాలకు దూరమవుతున్నాయి. అందుకే ఈ పరిమితిని తగ్గించాలని, లేకపోతే కొన్ని కంపెనీల గుత్తాధిపత్యం పెరిగే అవకాశం ఉందని నివేదిక తెలిపింది.

**50% సమీకరణ ఎలా?**

పీఎల్‌ఐ పథకంలో మరో ప్రధాన అంశం.. వాహనంలో ఉపయోగించే విడిభాగాల్లో కనీసం 50% దేశీయంగా తయారై ఉండాలి. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యానికి ఇది సరైనదే అయినా, క్షేత్ర పరిస్థితులు వేరేగా ఉన్నట్లు డెలాయిట్ పేర్కొంది. ఈవీలో అత్యంత కీలకమైన బ్యాటరీ సెల్స్, ఎలక్ట్రానిక్ చిప్స్ కోసం చైనా, తైవాన్, కొరియా వంటి దేశాలపై మనం ఆధారపడుతున్నాం. దేశీయంగా గిగా ఫ్యాక్టరీలు ఇంకా పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాలేదు. విడిభాగాలూ దొరకడం లేదు. ఫలితంగా 50% నిబంధన పాటించడం కష్టంగా మారుతోంది. అందుకే చాలా కంపెనీలు పీఎల్‌ఐకి అనర్హులవుతున్నాయి. దేశీయంగా సరఫరా వ్యవస్థ బలపడేవరకు ఈ నిబంధనను 50% నుంచి తగ్గించాలని డెలాయిట్ సూచించింది. వాహన తయారీదార్ల సంఘం సియామ్ కూడా ఇదే విషయాన్ని సూచించింది.

**ఐటీసీ రావడం లేదు..**

ప్రస్తుతం విద్యుత్ వాహనాలపై 5% వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) ఉంది. కానీ, ఈ వాహనాలకు గుండెకాయ వంటి లిథియం అయాన్ బ్యాటరీలపై 18% జీఎస్‌టీ ఉంది. విడిభాగాలపైనా 18-28% జీఎస్‌టీ వర్తిస్తోంది. దీనివల్ల తయారీదారులకు 'ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ)' సమస్య వస్తోందని నివేదిక తెలిపింది. ముడిసరకుపై ఎక్కువ పన్ను కట్టి, తుది ఉత్పత్తిని తక్కువ పన్నుకు అమ్మడం వల్ల కంపెనీల వద్ద పన్ను బకాయిలు పేరుకుపోతున్నాయి. ఇది వారి వర్కింగ్ క్యాపిటల్‌ను దెబ్బతీస్తోంది. పబ్లిక్ ఛార్జింగ్ స్టేషన్లలో వాహనాన్ని ఛార్జింగ్ చేసుకుంటే, దాన్ని సేవ కింద పరిగణించి 18% జీఎస్‌టీ విధిస్తున్నారు. ఇది వినియోగదారుడికి భారంగా మారుతోంది. బ్యాటరీలు, ఛార్జింగ్ సేవలపై జీఎస్‌టీని 5 శాతానికి పరిమితం చేయాలని పరిశ్రమ కోరుతోంది.

**మరో కొత్త పథకం రావాలి**

ఫేమ్-2 పథకం ముగియడం, మరో దీర్ఘకాలిక భరోసా లేకపోవడంతో వాహన కంపెనీలు కొత్త మోడళ్లను విడుదల చేసేందుకు వెనకాడుతున్నాయని నివేదిక పేర్కొంది. సబ్సిడీలు పూర్తిగా ఎత్తివేస్తే ఈవీల ధరలు 20-30% పెరగొచ్చు. పెట్రోలు, డీజిల్ వాహనాలతో పోలిస్తే, ఈవీల ధరలు అధికం. కాబట్టి, మరో మూడేళ్లయినా రాయితీలు కొనసాగించేందుకు కొత్త పథకం తేవాలని పరిశ్రమ వర్గాలూ ఆశిస్తున్నాయి. పీఎం ఇ-డ్రైవ్ వంటి పథకాలను భారీ నిధులతో ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



# దేవాలయాలను పరిరక్షించుకోవాలి



**అల్వాల్, జనవరి 18( నినాదం) :** లోతుకుంట లోని హనుమాన్ దేవాలయాన్ని తొలగించకుండా తగు చర్యలు చేపట్టాలని ఆలయ కమిటీ సభ్యులు మల్కాజ్గిరి నియోజకవర్గ పార్లమెంటు సభ్యుడు ఈటెల రాజేందర్ ను ఆయన స్వగృహములో కలసి వినతిపత్రం సమర్పించారు. ఎలివేటర్ కారిడార్ నిర్మాణంలో రాజీవ్ రహదారి నీ విస్తరించే ప్రయత్నంలో పలు దేవాలయం లను, గ్రేవియార్డ్స్ ను, పలు మసీదులను తొలగించే విధంగా చర్యలు చేపడతారని, ఆయా మతాల మనోభావాలను భంగపరచకుండా చూడాలని, వినతిపత్రంలో పేర్కొన్నారు. ఇదే కోవలో లోతుకుంట హనుమాన్ దేవాలయం పట్ల పరిష్కారం చూపాలని కోరారు. ఆయన సానుకూలంగా స్పందించారని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో శివారెడ్డి ,నాగేష్, ముత్యం రెడ్డి ,సాయిబాబా, నీలకంఠం, జయప్రకాష్, వినయ్ కుమార్, రమేష్, దుర్గేష్ ,భీమ్ రెడ్డి, శంకరయ్య, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి




**రాజేంద్రనగర్, జనవరి 18 (నినాదం) :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ నందమూరి తారక రామారావు 30 వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఆదివారం చిత్రపురి కాలనీలో ఎన్టీఆర్ విగ్రహం కు పూలమాలతో ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా నందమూరి కుటుంబ సభ్యులు నందమూరి మోహన్ కృష్ణ, మోహన్ రూప టి ప్రసన్నకుమార్, మాట్లాడుతూ ఎన్టీఆర్ అంటే నటనకు నిర్వచనం నవరసాలకు అలంకారమని చెప్పారు. నందమూరి తారక రామారావు అంటే ఒక వర్సిటీ అని జాతికి మార్గదర్శమని పేర్కొన్నారు. అటువంటి వారికి మరణం ఉండదని తెలుగువారి ఆత్మగౌరవం కోసం టీడీపీని స్థాపించారని నందమూరి మోహన్ కృష్ణ వివరించారు. 9 నెలల్లోనే తెలుగు ప్రజలు ఎన్టీఆర్‌ను సీఎం చేశారని గుర్తుచేశారు. ప్రాంతాలు వేరైనా తెలుగు వారంతా ఒకటేనని నందమూరి తారక రామారావు చాటారని చెప్పారు.తెలుగు జాతి ఎక్కడ ఉన్నా అగ్రస్థానంలోకి ఎదగాలని ఆకాంక్షించారు. రాజకీయాల్లో మహానాయకుడిగా రాణించారు. ఎన్టీఆర్ అనేది ఒక పేరు కాదని ప్రభంజనమని వెల్లండించారు. ఎన్టీఆర్ రెండు రూపాయలకు కిలో బియ్యం, తీసుకొచ్చిన ఘనత వారిదే అని గుర్తుచేశారు.

# నిరుపేదల వైద్యానికి భరోసా సీఎం సహాయ నిధి

### ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



**అల్వాల్, జనవరి18 (నినాదం):** నిరుపేదల మధ్యతరగతి కుటుంబాలకు వైద్యానికి భారం అవుతున్న వేళ సీఎం సహాయ నిధ ఎంతో ఆసరాగా నిలుస్తుందని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వెంకటాపురం , నేరేడ్ మెట్ డివిజన్ల కు చెందిన వారు సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వారి దరఖాస్తును పరిశీలించిన అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ నుండి మొత్తం రూ. 1,99,500/- మంజూరు కాగా, ఆ మంజూరైన చెక్కులను మల్కాజ్గిరి శాసనసభ్యులు శ్రీ మర్రి రాజశేఖర్ రెడ్డి లబ్ధిదారులకు తన చేతుల మీదుగా అందజేశారు. పలువురు రేషన్ కార్డ్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి మంజూరైన రేషన్ కార్డులను అందజేశారు. లబ్ధిదారులు వెంకటాపురం డివిజన్ వాసులు అది లక్ష్మీ రూ./- 60,000,రామ్మోహన్ రావు రూ. 15,000/- నేరెడ్ మెట్ డివిజన్ సాయినాథ్ రూ./-42,000 సాయినాథ్ రూ./-22,500. శిరీష 60,000/- రేషన్ కార్డు అర్హులు ప్రియాంక, స్వప్న, రాంబాయి,మాధవి, మంజుల ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, పేద మధ్యతరగతి కుటుంబాలకు వైద్య చికిత్సలు భారంగా మారుతున్న నేపథ్యంలో సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయుక్తంగా ఉందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సబితా అనిల్ కిషోర్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు రావుల అంజయ్య, కరంచంద్, అనిల్ కిషోర్ గౌడ్, జీకే హనుమంత్ రావు , మధుసూదన్ రెడ్డి,చిందం శ్రీనివాస్, రమేష్, రఘుపతి రెడ్డి,రవీందర్,జే కే సాయి గౌడ్, సుమన్ గౌడ్, నవీన్ రాజ్, అవినాష్, రాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# సంజీవిని హిల్స్ పార్కు స్థలంలో గోడలను కూల్చి చదును చేసిన అనావాలు



**రాజేంద్రనగర్ జనవరి 18నినాదం :** సంజీవని హిల్స్ పార్క్ స్థలములో గోడలను కూల్చి చదలు చేసిన ఆనవాళ్లు హద్దులు చేరిపి చెట్లు నరికి కబ్జా కోసమే మరే ఇతర పనుల కోసమే గాని పార్కుల ఆనావాలను ఒక్కొకటిగా చేదుర గోడుతున్నారు. పార్కు హద్దులను తోలగించి . ఇదేమని స్థానికులు అడిగితే సోసైటీ భవన నిర్మాణం కోసమని సమాదానం చేబుతున్నారని వాపోతున్నారు ఇక్కడ గజం ధర సుమారుగా లక్ష 20వేల వరకు పలుకుతుంది. కోట్లాది రూపాయల భూములు అన్యాక్రాంతం కావడం పై స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హైదర్ గూడ డివిజన్ పరిదిలోని సంజీవిని హిల్స్లో నాడు హెచ్ఎండిఏ వేంచర్లు చేసి పార్కుల కోసం స్థలాలను వదిలి వాటికి పార్కు హద్దులను ఏర్పాటు చేశారు పార్కులో ఇటీవల సోసైటి సభ్యులు హద్దు గోడలను కూల్చివేశారు. సాధరణంగా పార్కలలో ఎలాంటి పనులను చేపట్టిన జీహెచ్ఎంసీ అనుమతులను తప్పని సరిగా పాటించావలసి ఉంటుంది. కాని అక్కడ ఎలాంటి అనుమతులు లేకుండానే గోడలనే కూల్చడంపై స్థానికుల ఆందోళన పార్కు స్థలంలో పచ్చని మొక్కలతో ఆహ్లాదాన్ని పంచావలసిన పార్కు స్థలాలు నిర్మాణాల కోసం ఉపయోగించడం పట్ల స్థానిక ప్రజలు ఆవేదన చెందు తున్నారు అధికారులు సైతం వీటిని పట్టించుకుని మార్కు స్థలాలలో మొక్కలు నాటి పార్కులను సుందరీకరణ చేయాల్సిందిగా స్థానికులు కోరుతున్నారు. సంజీవిని హిల్స్ కాలనీ లేవుట్లో అనేక పార్కు స్థలాలు నిరుపేగంగా పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్నాయి అధికారులు స్పందించి పార్కులో ఉన్న పిచ్చి మొక్కలను చదును చేసి ప్రజలకు ఉపయోగపడేటట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

# ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన కొలన్ హన్మంత్ రెడ్డి



**కుత్బుల్లాపూర్, జనవరి 18 (నినాదం) :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, పద్మశ్రీ, డాక్టర్ నందమూరి తారక రామారావు 30వ వర్ధంతి సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ప్రగతి నగర్ ఖమాన్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ ఎన్టీఆర్ రాజకీయాల్లోకి వచ్చి తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిన మహానాయకుడని కొనియాడారు. పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చి, తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని తెలిపారు. సినిమా రంగంలోనే కాకుండా రాజకీయ రంగంలో కూడా తనదైన ముద్ర వేసిన గొప్ప వ్యక్తి ఎన్టీఆర్ అని పేర్కొన్నారు.ఆయన ఆశయాలు, సిద్ధాంతాలు నేటి తరానికి మార్గదర్శకంగా నిలుస్తాయని ఆయన చూపిన బాటలో నడవడమే నిజమైన నివాళి అవుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నేషనల్ బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌షిప్‌లో సత్తా చాటిన కుత్బుల్లాపూర్ యువకుడు

### బాడీ బిల్డింగ్ విజేత అబ్బాస్‌ను అభినందించిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద

**కుత్బుల్లాపూర్, జనవరి18 (నినాదం) :** కుత్బుల్లా పూర్ కు చెందిన బాడీ బిల్డింగ్ విజేత అబ్బాస్ ఆదివారం ఎమ్మెల్యే నివాస కార్యాలయంలో సుభాష్ నగర్ డివిజన్ సాయిబాబా నగర్ కు చెందిన మహమ్మద్ అబ్బాస్ బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జనవరి 6వ తేదీన నాగ్ పూర్ లో నిర్వహించిన నేషనల్ జూనియర్ బాడీ బిల్డింగ్ పోటీలలో పాల్గొని 4వ స్థానంలో నిలిచిన కుత్బుల్లాపూర్ వాసి, యువకుడు అబ్బాస్ ను బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ శాలువా కప్పి భినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువకులు కాలాన్ని వృధా చేసుకోకుండా వారి అభిరుచికి తగ్గట్టు దేహ దారుఢ్యం, యోగ



వంటి వాటి పట్ల శ్రద్ధను కలిగి ఉండి జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని పుట్టిన ఊరికి మంచి పేరుతేవాలన్నారు. ఈ కార్యక్రమంలో




మహమ్మద్ యూసుఫ్, మహమ్మద్ వలీ, ప్రభాకర్, రవి, మహమ్మద్ జహంగీర్, మహమ్మద్ సమీర్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ జగదాంబ దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవ వేడుకలకు ఉప్పల భాస్కర్‌కు ఆహ్వానం



కుత్బుల్లాపూర్, జనవరి18 (నినాదం) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గ సూరారం డివిజన్ శివాలయ నగర్ శ్రీ జగదంబ దుర్గాదేవి ఆలయ 19వ వార్షికోత్సవ సందర్భంగా ఈనెల 30, 31వ తేదీన జరగబోయే జాతరకు ముఖ్యఅతిథిగా పాల్గొనాలని డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పుప్పాల భాస్కర్ ను కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులు గోపాల్ నాయక్, ట్రెజరర్ ప్రసాద్ నాయక్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# నాగారంలో ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి

**కీసర సర్కిల్, నాగారం డివిజన్, జనవరి 18, (నినాదం) :** కీసర సర్కిల్, నాగారం డివిజన్, జిహెచ్ఎంసి పరిధిలోని 5వ డివిజన్ నాగారంసత్యనారాయణ కాలనీ రోడ్డు 1లోని నందామూరి తారక రామారావు 30వ వర్ధంతి వేడుకలు పెద్దా సంఖ్యలో నాగారం టిడిపి మాజీ అధ్యక్షుడు కొండా జంగా రెడ్డి అధ్వర్యంలో మేడ్చల్ మల్కాజిగిరి పార్లమెంట్ హడక్ కమిటీ కన్వీనర్ కందికంటి అశోక్ కుమార్ గౌడ్, మేడ్చల్ కాన్సెన్సీ ఇంచార్జ్ వెంకటేష్ సూచనతో పార్టీలకు అతీతంగా నాగారం మాజీ చైర్మన్ చంద్రారెడ్డి, రాజకీయ ప్రముఖుల, అభిమానుల సమక్షం లో జరిగాయి. టిడిపి జెండా ఆవిష్కరణ చేసి, నందమూరి తారక రామారావు విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఉమ్మడి రాష్ట్ర బడుగు బలహీన వర్గాలకు రాజకీయంగా చైతన్య పరిచి, కష్టజీవుల ఆరాధ్య దైవంగా, పేద ప్రజలకు అభివృద్ధి సాధకుడిగా తెలుగు రాష్ట్రాల ఖ్యాతినీ నలుమూల విస్తరింపచేసినా నాయకుడు నందమూరి తారక రామారావు, సూర్య చంద్రులు ఉన్నంత కాలం నందమూరి తారక రామారావును తెలుగు ప్రజల గుండెల్లో స్థిర స్థాయిగా నిలిచి ఉంటారని రాజకీయ ప్రముఖులు కొనియాడారు. ఈ కార్యక్రమం నాగారం 5వర్డ్ కాంటెస్టెంట్ కౌన్సిలర్ కొండా సుజాతా, విజయవాడ ఇంద్రకీలాద్రి అమ్మవారి ఆలయ బోర్డు సభ్యులు తాలీకోట హరిక్రిష్ణ,



నాగారం 1వ వార్డ్ కంటెస్టెంట్ కౌన్సిలర్ ఆశబిందు, ఐ టిడిపి మాజీ అధ్యక్షులు బాలసుబ్రామణ్యం, సీనియర్ నాయకులు రం గా రావు, ఉమాశంకర్ గౌడ్ , కోటేశ్వరరావు, బ్రహ్మయ్య, చౌదరి, మాజీ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్, కొట్టే దయాకర్, రవీంద్ రెడ్డి, వెంకట్ రెడ్డి, యువ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# నల్ల పోచమ్మ ఆలయంలో అమావాస్య అన్నదానం

**రాజేంద్రనగర్ జనవరి 18 (నినాదం) :** పూప్పలగూడ నల్ల పోచమ్మ ఆలయంలో ఆదివారం అమావాస్య అన్నదానం దండ్ల హరిప్రియ, రాజేష్ కుమార్ దంపతులు నిర్వహించారు. ఈ సందర్భంగా దండ్ల హరిప్రియ రాజేష్ కుమార్ దంపతు లు మాట్లాడుతూ పుష్య మాసం చివరి అమావాస్యతో కూడు కున్న ఆదివారం అత్యంత ప్రాముఖ్యత గా గుర్తింపు ఉన్నందువలన సంప్రదాయ బద్ధంగా వ్యవహరిస్తూ మానవత్వం, దయ, సేవ, దానధర్మాల పరాకాష్ఠను ప్రతిబింబించే పవిత్ర అమావాస్య గా వ్యవహరిస్తారు . ఆనవా యితీగా ప్రతి నెల పుప్పాలగూడ నల్లపోచమ్మ ఆలయంలో కమిటీ తరపున జరుపుతున్న అన్నప్రసాద కార్యక్రమం తో పాటు శివాజీనగర్ లో గల నల్లపోచమ్మ ఆలయంలో కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమం కి సీతారాం ధూళిపాళ, గుట్టమిది నరేందర్, రాజుకుమార్, కుమార్ గౌడ్, కుంభగల్ల ధనరాజ్, గుట్టమీది రమేష్, మోహన్ సింగ్, రాజేష్, సుమన్, బహదూర్ సింగ్, శ్రీశైలం, వెంకటేష్, నవీన్, అందే లక్ష్మణ్ రావు, యాలాల కిరణ్, మహమ్మద్ ఆరిఫ్, సుమనలిని, జైరామ్, బొడ్డు శ్రీధర్, బిందు తది తరులు పాల్గొన్నారు.



# చూపు లేని జీవితాల్లో అక్షరాల వెలుగు నింపిన మహనీయుడు లూయి బ్రేల్

### బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్




**కుత్బుల్లాపూర్, జనవరి 18 (నినాదం) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 130 – సుభాష్ నగర్ డివిజన్ సూరారం కాలనీ లూయి బ్రేల్ భవనంలో ఏర్పాటు చేసిన లూయి బ్రేల్ 217వ జయంతి వేడుకల్లో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారం భించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారితో కలిసి నూతన సంవ త్సర లూయి బ్రేల్ క్యాలెండర్ ను ఆవిష్కరించి, కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ చూపు లేని జీవితాలకు అక్షరాల వెలుగు నింపిన మహానుభావుడు లూయి బ్రేల్ అని అన్నారు. దివ్యాంగుల సంక్షేమంలో భాగంగా వారికి ప్రత్యేక



భవనం ఏర్పాటుచేసి వారి సంక్షేమం చేపట్టవలసిన ప్రతీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి వారి అభ్యున్నతికి, సంక్షేమానికి తోడ్పాటునందించడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో దివ్యాంగుల సంక్షేమం ప్రభుత్వం నుంచి రావాల్సిన ప్రతీ సంక్షేమ పథకాన్ని, రాయితీలను, బ్యాక్లాగ్ పోస్టుల భర్తీలో వారికి అండగా ఉండి వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ హేమలతా సురేష్ రెడ్డి, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ద బ్లైండ్ తెలంగాణ స్టేట్ బ్రాంచ్ ప్రెసిడెంట్ విసి.వీర రాఘవన్, వెల్ఫేర్ అసోసియేషన్ డిసేబుల్డ్ ప్రెసిడెంట్ జి.అంజయ్య, సారా ప్రవీణ్ కుమార్ గౌడ్, లూయిస్ బ్రెయిలీ సూరారం అసోసియేషన్ సభ్యులు సత్యం, ఎస్.రాజ్ కుమార్, నరేందర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, డివిజన్ ప్రధాన కార్యదర్శి శివాజీ తదితరులు పాల్గొన్నారు.ం

# కేంద్రమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన దుండిగల్ సర్కిల్ బిజెపి నాయకులు

### కన్జర్వేషన్ ఎత్తివేసేలా చర్యలు తీసుకోవాలని కేంద్రమంత్రికి వినతి

**కుత్బుల్లాపూర్,, జనవరి 18 (నినాదం) :** దుండిగల్ సర్కిల్ బీజేపీ ఆధ్వర్యంలో కేంద్రమంత్రి జీ కిషన్ రెడ్డి రాంకీ ప్లాంట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా దుండిగల్ సర్కిల్ కి చెందిన బిజెపి నేతలు కేంద్రమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి స్థానిక సమస్యలను వివరించారు. అందులో భాగంగా దుండిగల్ సర్కిల్ పరిది గ్రామాలు బౌరంపేట్, దుండిగల్, నాగులూరు, డి పోచంపల్లి, బహదూర్ పల్లి, మల్లంపేట్ గ్రామాలలోని కంజర్వేషన్ జోన్ ఎత్తి వేయుటకు ప్రత్యేక చొరవ తీసుకొని రైతులను ఆదుకోవాలని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమం లో జిల్లా ఇంచార్జి అధ్యక్షులు డా ఎస్ మల్లారెడ్డి, మున్సిపల్ బీజేపీ అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి డి విగ్నేశ్వర్, నాయకులు గోనె మల్లారెడ్డి,ఎంబరి ఆంజనేయులు ముదిరాజ్,దమ్మగారి ప్రభాకర్ రెడ్డి, డి సీతారాం రెడ్డి,తురాయి భాను గౌడ్,నర్సింగ్ రావ్,ఆర్ నర్సింహా చారి,ఏ శ్రీనివాస్ యాదవ్,ఎం అతీష్ బాబు,ఎం వెంకటేష్ నాయక్, శివనాయక్, విజయ్ నాయక్, రోహిత్ నాయక్, శ్రీను నాయక్, శంకర్ నాయక్, క్యాసారం రాజు, పాల్గొన్నారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం వ్యవ హారం బడా బాబులకు ఒక న్యాయం? రైతులకు ఒక న్యాయమా? అని ప్రశ్నించారు. హెచ్ ఎండిఏ మాస్టర్ ప్లాన్ లో అమాయక, పేద రైతులకు నష్టం కలిగించే విధంగా జోన్ల నిర్ణయం జరిగిందన్నారు. గత 11 సంవత్సరాలుగా మార్పులకు నోచుకోని జోన్లు రైతులకు అనుకూలంగా జోన్ల మార్పిడి కోసం చర్చ కొనసాగుతుందన్నారు. హైదరాబాద్ తో పాటు పరిసర ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసం 7257 చ. కిమీ. విస్తీర్ణంతో 2013 లో మాస్టర్ ప్లాన్ రూపొం దించడం జరిగిందని



కేంద్ర మంత్రి పేర్కొన్నారు . ప్రస్తుతం హెచ్ఎండిఏ పరిధిలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, భువనగిరి జిల్లాలలోని 70 మండలాలు, 24 మునిసిపాలిటీలు, 8 మునిసిపల్ కార్పొరేషన్లు, సుమారు 750 గ్రామాలు ఉన్నాయి. ఇటీవల 20 మునిసిపాలిటీలు, 7 మునిసిపల్ కార్పొరేషన్లను జిహెచ్ ఎంసి లో విలీనం చేశారని తెలిపారు. మస్టర్ ప్లాన్ వల్ల ప్రణాళికా బద్ధమైన అభివృద్ధి ఏమోగానీ రైతుల పాలిట శాపంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. మాస్టర్ ప్లాన్ లో భూములను కన్సర్వేషన్ (వ్యవసాయం) పబ్లిక్-సెమి పబ్లిక్, రిక్రియేషన్, ఓపెన్ స్పేస్, ట్రాఫిక్, రవాణా, పెరి-అర్బన్, రెసిడెన్సియల్ (నివాస), కమర్షియల్ (వాణిజ్య), ఇండస్ట్రియల్ (పారిశ్రామిక), మల్టిపుల్ (బహుళ ప్రయోజన) తదితర జోన్లుగా విభజించడం జరిగిందన్నారు. ఈ కారణంగా సుమారు 50 వేల మంది రైతులు తమ భూములలో సొంత ఇల్లు కూడా నిర్మించుకునే పరిస్థితి లేదన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపా రులు, బడా బాబులు, పలుకుబడి గల వారి భూములు ఎన్ని అంతస్తులైనా ఇల్లు నిర్మించుకునే అవకాశం ఉండే రెసిడెన్సియల్, మల్టీపుల్ జోన్లలో ఉన్నాయి. పేదలు - ధనవంతుల మధ్య ఉండే అంతరం ఇక్కడే తెలుస్తుందని కేంద్రమంత్రి ప్రభుత్వ విధానాలను తప్పు పట్టారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బడాబాబులు వందల కోట్లకు పడగలెత్తుతుండగా పేదలు పేదవారుగానే మిగిలిపోతున్నారు. ఎకరా, రెండెకరాల భూమి ఉన్న రైతులు కూడా సొంత ఇండ్లకు దూరమవుతున్నారు. భూమి ఉన్నా కుటుంబం గడవని దయనీయ పరిస్థితి నెలకొన్నదన్నారు. ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న గ్రామాల న్నింటిని మునిసిపాలిటీలుగా మార్చి జిహెచ్ఎంసి లో విలీనం చేయ డం జరిగింది. ఈ పరిస్థితిలో రింగ్ రోడ్ లోపల ఉన్న భూములను కన్సర్వేషన్ / ఓపెన్ /పబ్లిక్/రిక్రియేషన్/పేరి-అర్బన్ తదితర జోన్ల లో ఉంచడంలో అర్థమే లేదన్నారు. ప్రభుత్వం హెచ్ ఐ ఎల్ టి పాలసీ ద్వారా ఒక్క కలం పోటుతో 9200 ఎక రాల పారిశ్రామిక జోన్ లో ఉన్న భూములను మల్టిపుల్ జోన్ లోకి మార్చడం జరిగిం ది. హెచ్ఎండిఏ పరిధిలో ఓ ఆర్ ఆర్ లోపల, బయట వివిధ జోన్ల లో ఉన్న రైతుల భూములను నివాస/బహుళ ప్రయోజన (=వంఅసవత్ఋఖ్రీ/వీబశ్రీఅజూశ్రీవ) జోన్ల లోకి ఎందుకు మార్చడం లేదు భూ వినియోగ మార్పిడి దరఖాస్తులు సంవత్సరాల తరబడి ఎందుకు పెండింగ్ లో పెడుతున్నారు? దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేట్, దుండిగల్, డి పోచంపల్లి, మల్లంపేట్, బహదూర్ పల్లి, గాగిల్లాపూర్, నాగులూరు, శంబిపూర్ రెవిన్యూ గ్రామాలను 3 డివిజన్ లు గా విభజించి జి హెచ్ ఎం సి లో విలీనం చేసి రైతులమీద మరింత భారం మోపడం ఎంతవరకు సమంజసం అన్నారు. అటు రైతు బందుకు గాని రైతు రుణమాఫీకి గాని నోచుకోని పరిస్థితి నెలకొన్నదని ఇటు భూమి కంజర్వేషన్ జోన్ నుండి మల్టిపర్పస్ జోన్ మార్చకుండా కుటుంబం పెరిగి చిన్న ఇల్లు గాని నిర్మించుకొందాం అంటే జోన్ వల్ల తీవ్ర రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొన్నదని తెలిపారు. రైతులు తరపున దుండిగల్ మున్సిపల్ బీజేపీ ఆధ్వర్యంలో కంజర్వేషన్ జోన్ నుండి మల్టిపర్పస్ జోన్ మార్పిడికి కృషి చేసి రైతులను ఆదుకోగలరని కేంద్ర మంత్రి వివరించారు.

# జవహర్ నగర్ డివిజన్ సీట్లను బీసీలకే కేటాయించండి

### జ్యోతిరావు పూలే విగ్రహాన్ని జవహర్ నగర్లో నెలకొల్పండి
### రాష్ట్ర బీసీ జేఏసీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ డిమాండ్

**జవహర్ నగర్, జనవరి 18 (నినాదం):** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా పరిధిలోని ఉన్న పూర్వ అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్ అయిన జవహర్ నగర్ లో ఉన్న రెండు డివిజన్లను బీసీలకే కేటాయించాలని, 120 కాలనీలకు నెలవైన అతిపెద్ద జవహర్ నగర్ లో మహనీయుల విగ్రహాలతో పాటు మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహాన్ని నెలకొల్పాలని రాష్ట్ర బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. జిహెచ్ఎంసి జవహర్ నగర్ పరిధిలో అంబేద్కర్ విగ్రహం దగ్గర జవహర్ నగర్ బీసీల ఐక్యవేదిక అధ్వర్యంలో మారోజు సోమాచారి అధ్యక్షతన ఆదివారం బీసీల ఐక్యవేదిక నూతన క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర బీసీ జేఏసీ చైర్మన్ గాజుల శ్రీనివాస్ గౌడ్ బీసీ కుల సంఘాల చైర్మన్ కుందారం గణేష్ చారి హాజరై మాట్లాడుతూ జవహర్ నగర్ లో ఉన్న రెండు డివిజన్లను బీసీలకే కేటాయించాలని, జిల్లాలోని అతిపెద్ద ప్రదేశమైన జవహర్ నగర్ లో మహనీయుల విగ్రహాలతో పాటు మహాత్మ జ్యోతిరావు



పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం జవహర్ నగర్ మాజీ మేయర్ మేకల కావ్య మాట్లాడుతూ కులాలు ఏవైనా కానీ బీసీ బిడ్డలుగా అందరం కలిసి ఉండాలనే ఆశయంతో కలిసి మెలసి ఉండి రాజ్యాధికారాన్ని సాధించుకోవాలని పిలుపునిచ్చారు. బీసీ ఐక్య వేదిక గౌరవ సలహాదారులు మాజీ సర్పంచ్ కారంగుల శంకర్ గౌడ్ మాట్లాడుతూ బీసీ జేఏసీ బీసీల హక్కుల కొరకు రిజర్వేషన్ల కొరకు పెద్ద ఎత్తున కొట్లాడుదామని జవహర్ నగర్ నుంచి మద్దతుగా పాల్గొంటామని అంతేకాకుండా జవహర్ నగర్ లో జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఏర్పాటుకు నడుము బిగించాలని పిలుపునిచ్చారు, ఈ విగ్రహ ఏర్పాటుకు తన వంతుగా 50వేల




రూపాయల విరాళాన్ని అందజేస్తానని తెలిపారు. భాషపల్లి రమేష్ చారి మాట్లాడుతూ జ్యోతిరావు పూలే విగ్రహానికి రూ .50 వేల రూపాయలను విరాళంగా ఇస్తున్నట్టు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో గౌరవ సలహాదారులు తాటికొండ శ్రీరాములు, రంగుల శంకర్, రాజు గౌడ్, కొండల ముదిరాజ్, పిన్నోజు సుధాకర్ చారి, సోమ నరసింహ, గొడుగు వేణు, శనిగార నరసింహ, రేగోటి సురేష్, రాజు యాదవ్, రమేష్ బాబు, నర్రా మహేష్, సురేందర్, పల్లె కృష్ణగౌడ్, కాసోజు యాకచారి, అశోక్ యాదవ్, పల్లపు మల్లేష్, తదితర బీసీ నేతలు పెద్ద మొత్తంలో బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## అబద్దాల హామీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం

- అమలుకు నోచుకోని ఆరు గ్యారెంటీలు

- కల్యాణలక్ష్మి తులం బంగారం ఏది..?? ఆడబిడ్డలకు రూ.2500 ఎవరికైనా ఇచ్చారా అంటూ మహిళకు ప్రశ్న..?? - మాజీ మంత్రి డీఎస్ రెడ్యా నాయక్



**డోర్నకల్/మరిపెడ జనవరి 18(నినాదం):** కాంగ్రెస్ రెండేళ్ల పాలన తేలిపోయిందని ఆరు గ్యారెంటీలను ప్రజలకు 100 రోజుల్లో నెరవేరుస్తామని చెప్పినా వాగ్దానం నెరవేరాలేదని మాజీ మంత్రి డీఎస్ రెడ్యా నాయక్ ఆరోపించారు.మహబూబాద్ జిల్లా మరిపెడ మున్సిపల్ కేంద్రంలోని వివిధ వార్డుల్లో ఆయన పార్టీ పట్టణ అధ్యక్షులు ఉప్పల నాగేశ్వర రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు తో కలిసి ఆయా వార్డుల ప్రజలు,పార్టీ శ్రేణులతో మాట్లాడారు. రెండేళ్ల పాలన ఎలా ఉందో ప్రజల్ని అడిగి తెలుసుకున్నారు. కళ్యాణ లక్ష్మి తో పాటుగా తులం బంగారం ఎంత మందికి అందిందని...? ప్రతి ఇంటి ఆడబిడ్డకు రూ.2500లు ఆసరా పింఛన్లు రూ4వేలు, అంగవైకల్యం కలిగిన వారికి రూ.6000/- వేలు ఎక్కడైనా ఇచ్చారా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. దీంతో మహిళలు లేదంటూ సమాధానం ఇచ్చారు.రైతు బంధు పథకం రూ.15000వేలు ఇవ్వటం లేదని పూర్తి స్థాయిలో రుణమాఫీ జరగలేదని రెడ్యా నాయక్ విచారం వ్యక్తం చేశారు.రెండు సంవత్సరాల పాలన లో కాంగ్రెస్ తన అసమర్థత ను నిరూపించుకున్నారు.అధికారం కోసం అమలుకాని 420 హామీలు ఇచ్చి అమలు చేయలేక అపసోపాలు పడుతుందన్నారు.డోర్నకల్ నియోజకవర్గం స్థానికేతురుల పాలన లో వెనుకబాటుకు గురైందని విచారం వ్యక్తం చేశారు.మరిపెడ పట్టణాన్ని అభివృద్ధి చేయాలన్న దృడ సంకల్పంతో పురపాలక కేంద్రం గా ఏర్పాటు చేసి కోట్లాది నిధులు మంజూరి చేసి సుస్థిరమైన ప్రగతి సాధించేలా కృషి చేసినట్లు తెలిపారు.పట్టణ కేంద్రలో వంద పడకల ఆసుపత్రి మంజూరి చేయించి అప్పటి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు తో శంకు స్థాపన చేయించినట్లు పేర్కొన్నారు. మరిపెడ సబ్ కోర్టు మంజూరి చేసి స్థల పరిశీలన చేశామని పేర్కొన్నారు. అనునిత్యం ప్రజలకు అందుబాటు లో ఉండి అభివృదే లక్ష్యంగా పని చేశానని స్పష్టం చేశారు.డోర్నకల్ పరాయి పాలన లో అన్ని వర్గాల్లో వెనుకబాటుకు గురవుతుందని ఇది తనకెంతో ఆవేదన కలిగిస్తుందన్నారు. రానున్న పురపాలిక ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి మన పాలన మనం చేసుకుందామని ఓటర్లను అభ్యర్థించారు.అందుబాటులో ఉండేది అభివృద్ధి చేసేది ఎవరో ప్రజలు ఆలోచన చేయాలని కోరారు.3 వ వార్డ్ లో కాంగ్రెస్ పార్టీ నుండి బీఆర్ఎస్ పార్టీలోకి నాయకులు,కార్యకర్తలు బీఆర్ఎస్ నాయకులు మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి రెడ్యానాయక్ కండువా కప్పి ఆహ్వానించారు.9 వార్డ్ గేమ్య తండా లో ఆరోగ్యంతో గురైన వారిని పరామర్శించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మహేందర్ రెడ్డి,మాజీ ఎంపీపీ గుగులోతు వెంకన్న,జిల్లా నాయకులు గుగులోతు రాంబాబు,తేజవత్ రవీందర్ నాయక్,ఉగ్గంపల్లి సర్పంచ్ ఆయుబ్ పాషా,మాజీ ఎంపీటీసీ రాంపురం నరేష్,పానుగోతు వెంకన్న,జాటోత్ బాలాజీ,మాచర్ల భద్రయ్య,ఎల్వి వెంకన్న,సయ్యద్ లతీఫ్,మక్స్ ద్,దిగజర్ల శ్రీనివాస్,పానుగోత్ వేంకన్న,తిరుపతి నాయక్,ఊరుకొండ శ్రీను,భాస్కర్,మాలి బాలాజీ,మాలి ప్రతాప్ సింగ్,రాంసింగ్,నాగేశ్వరావు,జి ఎన్ రెడ్డి,శ్రీను,కార్యకర్తలు ఇంకా తదితరులు పాల్గొన్నారు.

## ఆశవహులు దరఖాస్తులు ఇవ్వాలి

**కోదాడ,జనవరి18(నినాదం):**
కోదాడ మున్సిపాలిటీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ తరపున వార్డు కౌన్సిలర్లుగా పోటీ చేయాలనుకున్నవారు ఈ రోజు సాయంత్రం 5 గంటలలోపు వ్యక్తిగతంగా దరఖాస్తు పత్రాలను అందజేయాలని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ సిబ్బంది కరుణాకర్ రెడ్డి కోరారు. ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి ఆదేశాలకు మేరకు ఈ దరఖాస్తు పత్రాలు స్వీకరిస్తున్నట్లుగా తెలిపారు.

## పంచాయతీల్లో, మున్సిపాలిటీల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లు ఇవ్వకుండా మోసగించిన రాష్ట్ర ప్రభుత్వం

- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లింగంగౌడ్



**మిర్యాలగూడ, జనవరి 18(నినాదం):**
గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు అన్యాయం చేసిన రాష్ట్ర ప్రభుత్వం, ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లోను బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా మోసం చేసిందని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ రాష్ట్ర ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 121 మున్సిపల్ చైర్మన్ స్థానాలకు గాను బీసీలకు కేవలం 38 స్థానాలే కేటాయించారనీ, 42 శాతం కేటాయిస్తామని మాట ఇచ్చి తప్పిన ప్రభుత్వం ఇప్పుడు 31శాతం కేటాయించిందన్నారు, ఒకవేళ 42 శాతం రిజర్వేషన్లు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తే బీసీలకు 52 మున్సిపల్ చైర్మన్ స్థానాలు దక్కేవన్నారు. ఎన్నికలు జరిగే మున్సిపాలిటీలలో 2704 కౌన్సిలర్లు, కార్పొరేటర్ల ఎన్నికలు జరుగుతుంటే ఇందులో బీసీలకు కేవలం 763 మాత్రమే రిజర్వు చేశారని 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసి ఉంటే 1150 మందికి అవకాశం ఉండేదన్నారు. మున్సిపల్ ఎన్నికలలో బీసీ రిజర్వేషన్లు తగ్గించినందుకు ఈనెల 19న నిరసన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సమావేశంలో బంటు వెంకటేశ్వర్లు బంటు సైదులు దోనేటి శేఖర్ సలార్ పాల్గొన్నారు.

## అధికార పార్టీ నాయకులకు కొమ్ముకాస్తున్న పోలీసులు

ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

**మిర్యాలగూడ జనవరి 18( నినాదం):**
కాంగ్రెస్ నాయకుల ఆగడాలు మితిమీరిపోతున్నాయని త్వరలోనే తగిన మూల్యం చెల్లిస్తారు. ఎమ్మెల్సీ ఎం సి కోటిరెడ్డి అన్నారు ఆదివారం నిడమానూర్ మండల ఎస్సై వేధింపులు తాళలేక పాయిజన్ తీసుకున్న ఉన్నం విజయ్ భాస్కర్ ను , మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ , టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నల్లమోతు సిద్ధార్థ పరామర్శించారు. విజయ భాస్కర్ పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ నిమ్స్ కు తరలించినట్లు వారు తెలిపారు అనంతరం వారు మాట్లాడుతూ రోజు, రోజుకి పోలిసుల అరాచకాలు ఎక్కువవుతున్నాయని కాంగ్రెస్ పార్టీ గ్రామా స్థాయి లీడర్లు ఫోన్ లో మాట్లాడిన మా పార్టీ వాళ్ళను స్టేషన్ కూ పిలిపించి బయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు..ఇప్పుడు విజయ భాస్కర్ పరిస్థితి కుడా అంతే ఉంది, అయన మీద ఎటువంటి కేసులు లేకున్నా, రోజు స్టేషన్ కూ రమ్మని ఉదయం నుంచి సాయంత్రం దాక స్టేషన్ లో కూర్చో పెట్టి బూతులుతిడుతూ హింసిస్తున్నారని ఆరోపించారు. తక్షణమే ఇటువంటి చర్యలు మానుకోవాలని హెచ్చరించారు కార్యక్రమములో డిసిసిబి మాజీ డైరెక్టర్ విరిగినేని అంజయ్య, సత్యపాల్, ఎండి.షోయబ్, వింజం శ్రీధర్,బొల్లేపల్లి శ్రీనివాస్, ఎల్మశెట్టి రాము, దైద సత్యం, ఉన్నం ఈశ్వర్, తుమ్మల ఫణి కుమార్ తదితరులు ఉన్నారు..



## మీ వ్యాపారం కోసం ప్రజల ఆరోగ్యాలు పాడు చేయవద్దు

- మద్యం షాపుల సమయపాలన విషయంలో నియంత్రణ విషయంలో వెనక్కి తగ్గేదే లేదు : నియోజకవర్గంలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు పెంచుతాం
- ఉదయం నుండి తాగే విధానానికి స్వస్తి పలికేలా మద్యం వ్యాపారులు తమ మైండ్ సెట్ ను మార్చుకోవాలి : ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి



**మునుగోడు, జనవరి 18 (నినాదం):**
మునుగోడు నియోజకవర్గంలో కొనసాగుతున్న మద్యం షాపుల సమయపాలన లో మార్పు ఉండదని మరోమారు స్పష్టం చేశారు మునుగోడు శాసనసభ్యులు, కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి. మునుగోడు లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ని కలవడానికి వచ్చిన కొంతమంది మద్యం వ్యాపారులతో మద్యం షాపుల సమయపాలన పై మద్య నియంత్రణపై వెనకడుగు వేయబోమని స్పష్టం చేశారు.. మీ వ్యాపారాల కోసం ప్రజల ఆరోగ్యాలు పాడుచేయొద్దని, ఉదయం నుండి మద్యం తాగే విధానానికి స్వస్తి పలికేలా మద్యం వ్యాపారులు తమ మైండ్ సెట్ మార్చుకోవాలని హితవు పలికారు.. మునుగోడు నియోజకవర్గంలో మద్యం షాపుల విషయంలో తాను తీసుకున్న నిర్ణయంలో ఎలాంటి మార్పు ఉండదన్నారు.. మధ్యాహ్నం ఒంటిగంట తర్వాతే వైన్ షాపులు తెరుచుకోవాలని 6 గంటల తర్వాతే పర్మిట్ రూముల్లో అనుమతి ఉండాలని అన్నారు.. అవసరమైతే నియోజకవర్గంలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను ఇంకా పెంచుతామని, ఉదయమంతా పనిచేసుకొని సాయంత్రం పూట మాత్రమే తాగేలా మార్పు తీసుకొస్తున్నామన్నారు... మద్యం విషయంలో తాము తీసుకొస్తున్న ఈ మార్పుకు ఇతర నియోజకవర్గాల నుండి మంచి నిర్ణయం అవలంబిస్తున్నారని ఫోన్లు వస్తున్నాయని తెలిపారు.. మద్యం విచ్చలవిడిగా లభ్యం అవ్వడం వల్ల పనులు మానేసుకొని అదేపనిగా తాగుతూ చనిపోతున్న వాళ్ళ సంఖ్య పెరుగుతుందని, యువత మద్యానికి బానిసై పెడదొవ పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.. యువత ఆలోచనలు మద్యం వైపు నుండి తమ వ్యక్తిగత అభివృద్ధి వైపు మల్లిస్తూ గ్రామాలలో ఆరోగ్యకరమైన వాతావరణ నెలకొల్పడానికే ఈ ప్రయత్నం అన్నారు.. ఎట్టి పరిస్థితులలో మునుగోడు నియోజకవర్గంలో మద్యం షాపుల సమయపాలనలోనూ మద్యం నియంత్రణ విషయంలోనూ రాజీ పడే ప్రసక్తే లేదని మద్యం వ్యాపారులకు తెగేసి చెప్పారు.

## ప్రజలే కుటుంబమన్న కాంగ్రెస్ నేతలు... గద్దెనెక్కాక గాలికొదిలేశారు!

టూరిస్టుల్లా ఎమ్మెల్యేలు – షాడో పాలనలో కోదాడ! - టిఆర్ఎస్ చేసిన అభివృద్ధి పనులకు వీరు ప్రారంభోత్సవాలు

- ఎస్ఐ సురేష్ రెడ్డిని సస్పెండ్ చేసేదాకా టిఆర్ఎస్ పోరాటం - మీడియా సమావేశంలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బొల్లం ఫైర్

**కోదాడ,జనవరి18(నినాదం):**
కాంగ్రెస్ ప్రభుత్వంపై, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిలపై మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ తీవ్ర స్థాయిలో విరుచుకు పడ్డారు. ఆదివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.కోదాడ పట్టణంతోపాటు మండలానికి ఒక షాడో ఎమ్మెల్యే తయారై ఇస్తారాజ్యంగా వ్యవహరిస్తున్నారని.. అధికారులతో కుమ్మక్కై అవినీతికి పాల్పడుతున్నారని విమర్శించారు.. పోలీసుల చిత్రహింసలతోనే దళిత బిడ్డ రాజేష్ దుర్మరణం పాలయ్యారని. ఇప్పటివరకు అసలు దోషి సురేష్ రెడ్డిని సస్పెండ్ చేయలేదని ఆయనను కాపాడుతుంది ఎమ్మెల్యే పద్మావతి మంత్రి ఉత్తం అని స్పష్టం చేశారు. పోలీస్ స్టేషన్లో సీసీ ఫుటేజీలను బహిరంగపరచాలని.. రాజేష్ మృతికి చిత్రహింసలే కారణమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆధారాలు బహిర్గతం చేసినప్పటికీ ఎస్సై ని సస్పెండ్ చేయకపోవడం శోచనీయమన్నారు... నియోజకవర్గంలోని బేతవోలు నారాయణ గూడెం. తదితర గ్రామాల్లో పోలీసుల అక్రమంగా తమ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించడంతోపాటు దాడులు నిర్వహించారని.. దాడులు ఉద్యమాలు తమకు కొత్తవి కావని విద్యార్థి దశ నుంచే ఉద్యమాల నుంచి ఎదిగానని, ఎన్నో అవమానాలు ఎదుర్కొని ఈ స్థాయికి వచ్చానని. తమ పార్టీ కార్యకర్తలను ఎలా కాపాడుకోవాలో తనకు తెలుసునని ఇక సహించేది లేదని తీవ్రస్థాయిలో హెచ్చరించారు.. చట్టాన్ని గౌరవించే వ్యక్తిగా చెబుతున్నానని పోలీసులు అతిక్రమించి అధికార పార్టీకి తాబేదారులుగా మారితే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.... కోదాడ పట్టణ స్టేషన్ అధికార పార్టీకి కార్యాలయంగా మారిందని.. అకారణంగా ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు.. ఇసుక మట్టి మాఫియాలకు అండగా ఉంటూ దండుకుంటున్న ముడుపులు ఎవరికోసమని అని అస హనం వ్యక్తం



చేశారు.... పద్ధతి మార్చుకోకపోతే ప్రత్యక్ష ఉద్యమ నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.... కోదాడ మున్సిపాలిటీ అవినీతి కంపులో కొట్టుమిట్టాడుతుందని, పాలన గాడిని.. తప్పిందన్నారు.. తీర్మానాలు లేకుం డా కోటి రూపాయల అవినీతి జరిగినప్పటికీ ఇప్పటివరకు ప్రభుత్వం చర్యలు తీసుకోలేదన్నారు,,, మున్సిపాలిటీ కొత్త భవనానికి మార్చేందుకు రవాణాకు 25 లక్షలు బిల్లు వేసి అవినీతి చేసినప్పటికీ పట్టించుకున్న దిక్కు లేదన్నారు.. ఇక టెండర్లు లేకుండా అవినీతికి పాల్పడిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి అన్నారు... ఆర్డీఓ చొరవ తీసుకొని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను తక్షణమే లబ్ధిదారులకు అందజేయాలన్నారు.. గ్రీన్ ట్రిబ్యునల్ నోటీసులతో కోదాడ పట్టణంలో నిరుపేదలు భయభ్రాంతులకు గురవుతుంటే తాము ఓదార్చి భరోసా ఇచ్చామని.. తాము వెళ్లేదాకా ఎమ్మెల్యేకి ఈ విషయం తెలియకపోవడం దురదృష్టకరమన్నారు.. పైగా టిఆర్ఎస్ పై విమర్శలు చేయటం ఆమె అవగాహన రాహిత్యానికి నిదర్శనం అన్నారు.... కోదాడ పట్టణంతోపాటు నియోజకవర్గంలో జరిగిన అవినీతి అభివృద్ధిపై తాము బహిరంగ చర్చకు సిద్ధమని అనామకులతో మాత్రం కాదన్నారు... ఈ విలేకరుల సమావేశంలో టిఆర్ఎస్ నాయకులు ఎస్కే నయీమ్. జానకి రామాచారి. దేవ బత్తిని సురేష్ తొ గరు రమేష్ నర్సిరెడ్డి ఉపేందర్ శివాజీ భాగ్యమ్మ ముఖ్య నాయకులు పాల్గొన్నారు

## ప్రజల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం

ప్రజా వ్యతిరేక విధానాలను తిపి కొట్టాలి -వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అలవాల వీరయ్య

**డోర్నకల్/మరిపెడ జనవరి 18(నినాదం):**
గత 11 సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రచార వ్యతిరేక విధానాల మూలంగా ప్రజల హక్కులు కాలరాయపడుతున్నాయని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మహబూబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి అలవాల వీరయ్య అన్నారు.సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో లేబర్ కోడ్స్,విబి రాంజీ చట్టం, జాతీయ విత్తన, నూతన విద్యుత్తు బిల్లు సవరణ రద్దుకై జిల్లా జీబు జాత మరిపెడ మండలంలోని గుండెపూడి , మరిపెడ(బంగ్లా), అబ్బాయి పాలెం గ్రామాలలో పర్యటించింది,ఈ సందర్భంగా జరిగిన సభలో వీరయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఒక వైపు ప్రజా సంక్షేమం వల్లిస్తూనే 11 సంవత్సరాల పాలనలో బడా కార్పొరేట్ సంస్థలకు రూ: 16 లక్షల కోట్ల రూపాయలు రాయితీ ఇచ్చిందని చివరికి ప్రభుత్వ రంగ సంస్థలను కూడా ఆదాని అంబానీ వంటి బడా పెట్టుబడిదారులకు కట్టబెట్టడం సిగ్గుచేటు అన్నారు. అత్యంత ప్రమాదకరమైన 4 లేబర్ కోడ్ లను అమలు చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేగాక విద్యుత్ సవరణ చట్టం, విత్తన బిల్లు, వి బి జి రాంజీ చట్టం నల్ల చట్టాలను తీసుకొచ్చిందన్నారు. గత 40 సంవత్సరాలుగా పోరాడు సాధించుకున్న చట్టాలను, మూడు గంటల్లోనే కేంద్ర ప్రభుత్వం తునాతునకలు చేసి విజయం సాధించినట్టు గొప్పలు చెప్పుకోవటం అత్యంత దుర్మార్గమైన చర్య అన్నారు. భారత



ప్రజాస్వామ్యానికే మచ్చ తెచ్చేలాంటి చట్టాలు అమలు చేస్తుంటే ప్రజలు చూస్తూ ఊరుకోరని వారికి అండగా వామపక్ష పార్టీలు ప్రజా సంఘాలు ఉన్నాయన్నారు .పెట్టుబడుదారుల మోచేయి నీళ్లు తాగుతున్న నరేంద్ర మోడీ ప్రభుత్వాలపై ప్రజలు తిరగబడాలని పిలుపునిచ్చారు. భీమా రంగంలోకి 100% విదేశీ పెట్టుబడులకు అనుమతి అనురంగంలోకి ప్రవేట్ కంపెనీలకు విచ్చలవిడిగా అనుమతినిస్తూ అనుచట్టం చేసిందని ఆరోపించారు. వీటికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ప్రజా ఉద్యమాన్ని నిర్వహించాలని సంకల్పంతో కార్మిక ట్రేడ్ యూనియన్, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘంల ఆధ్వర్యంలో జనవరి 7 నుండి దేశవ్యాప్తంగా అన్ని గ్రామాలలో నిరసన ఆందోళన నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. 8 నుండి 18వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలు గ్రామాలను కలుస్తూ జీబు జాతాను నిర్వహిస్తు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఈనెల 19న జిల్లా కేంద్రంలో జరిగే భారీ ప్రదర్శనను బహిరంగ సభను విజయవంతం చేయాలని వీరయ్య కోరారు. ఈ సభలలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గునిగంటి రాజన్న,నల్లపు సుధాకర్, సిఐటియు జిల్లా కార్యదర్శి సమ్మెట రాజమౌళి, అబ్బాయిపాలెం సిపిఎం వార్డు సభ్యురాలు నందిపాటి ఉప్పలమ్మ,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు బాణాల రాజన్న, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కందాల రమేష్, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) జిల్లా ఉపాధ్యక్షులు జిన్న లచ్చయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) జిల్లా నాయకులు కొండ ఉప్పలయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గుండగాని మధుసూదన్, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా నాయకులు బోడపట్ల రాజశేఖర్, ప్రజా సంఘాల నాయకులు నందిపాటి వెంకన్న, తాటికొండ అనంతచారి, జినక సైదులు, జామ్మూర్తి, ఆల్లి శ్రీనివాస్ రెడ్డి, బయ్య సురేష్, నరేష్, ఎర్ర ఎంకన్న, జినక రామ్మూర్తి, తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అండదండలతోనే మైనింగ్ దందా

హైకోర్టులో పిల్ దాఖలు చేయనున్న బిఆర్ ఎస్ - నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి

**నర్సంపేట జనవరి18 (నినాదం):**
నర్సంపేట నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అండతో, పోలీస్ అధికారులు, మైనింగ్ అధికారుల సహకారంతో మైనింగ్ మొరం దందా యదేచ్ఛగా కొనసాగుతున్నదని బిఆర్ ఎస్ రాష్ట్ర నాయకుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. ఈసందర్భంగా నర్సంపేటలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు, అధికారం అడ్డు పెట్టుకుని నర్సంపేట మండలం రాజుపేట ఏజెన్సీ శివారు ముత్యాలమ్మ తండా గ్రామపంచాయతీ పరిధిలో మట్టిని తోడి సొమ్ము చేసుకుంటున్నారని విమర్శించారు. నర్సంపేట ప్రాంత కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ ఇండ్ల పేరు మీద కోట్లాది రూపాయల మట్టి దందాకు పాల్పడ్డారని విమర్శించారు. మున్సిపాలిటీ అధికారులు, మైనింగ్ అధికారులు, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులకు కూడా ఇందులో వాటాలు ఉన్నాయన్నారు. రాత్రంతా ఇతర ప్రాంతాలకు కూడా వందల టిప్పర్ల మొరం తరలిస్తూ దందా సాగిస్తున్నారన్నారు. పిశా చట్టం వన్ ఆఫ్ సెవెన్ టీ చట్టాలకు తూట్లు పొడుస్తూ అధికార పార్టీ నాయకులు దందా కొనసాగిస్తున్నారు. ఒకే సిండికేట్ ద్వారానే జరగాలని చెప్పి మిగతా వాళ్లను మట్టి తరలించకుండా బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. దాడులు చేయడం, మహిళలను కొట్టడం, దూషించడం, పోలీసులు బెదిరించడం చేస్తున్నారని విమర్శించారు. దామెర



చెరువులో లోతుగా మట్టి తవ్వడం వల్ల ఊటలు వచ్చి భవిష్యత్తులో మెడికల్ కళాశాలకు సమస్య ఉంది అని ఎన్ఐఏ అధికారులు చెప్పినప్పటికీ పట్టించుకునే నాధుడే లేడన్నారు. నిబంధనల ప్రకారం ఎంత లోతు, ఎంత వెడల్పు తీసినటువంటి వివరాల సేకరణ కూడా చేయడం జరిగింది. నిబంధనలకు విరుద్ధంగా మట్టిని తవ్వుతున్నారు. దీనిపై ప్రత్యేక విచారణ జరగాలని, ఈ విచారణ ప్రభుత్వానికి ఎన్ని చెప్పినా వాళ్ళు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నర్సంపేటలో దొంగలు, చీకటి కలిసి దోపిడీ అరాచకాలకు తెలియజేయడంతో వీరి ఆగడాలను అడ్డుకునే నాధుడే కరువయ్యాడన్నారు. హైకోర్టులో వీళ్ళందరి పైన బీఆర్ఎస్ పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కమిటీ ద్వారా ఆధారాలతో పిల్ దాఖలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్ల మనోహర్ రెడ్డి,మునిగాల వెంకటరెడ్డి ,తక్కళ్ళపెల్లి రవీందర్ రావు ,రాయిడి రవీందర్ రెడ్డి ,నాగెల్లి వెంకటనారయణ ,డా.లెక్కల విద్యాసాగర్ రెడ్డి ,ప్రసాద్ , గోనె యువరాజ్ , ఖానాపురం మాజీ ఎంపీపీ తక్కళ్ళపెల్లి రవీందర్ రావు,వేములపల్లి ప్రకాష్ రావు , జిల్లా నాయకులు,పట్టణ పార్టీ అధ్యక్షులు, మండల పార్టీ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్లు, బిఆర్ టీయు జిల్లా అధ్యక్షులు, క్లస్టర్ బాధ్యులు పట్టణ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నేతల మాటలు దయ్యాలు వేదాలు వల్లించినట్టున్నాయి

నల్లబెల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు చిట్యాల తిరుపతి రెడ్డి తీవ్ర విమర్శ



**నల్లబెల్లి, జనవరి 18 (నినాదం):**
వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం శనివారం రోజు బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో చేసిన వ్యాఖ్యలు దయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉన్నాయని నల్లబెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిట్యాల తిరుపతి రెడ్డి తీవ్రంగా విమర్శించారు. నల్లబెల్లిలో నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నల్గొండ– రంగారెడ్డి జిల్లాలకు మాత్రమే పరిమితమైన నయీం నేర సామ్రాజ్య సంస్కృతిని నల్లబెల్లి మండలానికి పరిచయం చేసిన నీచ చరిత్ర బీఆర్ఎస్ పార్టీదేనని ఆరోపించారు.మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకే పరిమితమైన భూకబ్జాలను నల్లబెల్లి గ్రామం వరకు విస్తరించిన ఘనత కూడా బీఆర్ఎస్నాయకులదేనన్నారు. అధికారులను,భయభ్రాంతులకు గురిచేసి సర్వే నంబర్లు మార్చి ప్రభుత్వ భూములను అక్రమంగా ఆక్రమించుకున్న చరిత్ర బీఆర్ఎస్ పార్టీదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ ఆస్తులను కాపాడుతూ నల్లబెల్లి గ్రామ ప్రజలకు ఉపయోగపడే విధంగా వాటిని వినియోగించాలనే లక్ష్యంతో పోరాటం చేస్తోందన్నారు. భూకబ్జాదారుల చేతిలో మోసపోయిన సామాన్య ప్రజలకు అండగా కాంగ్రెస్ పార్టీ నిలుస్తుంటే, సామాన్యులను ముంచిన దొంగలను కాపాడే ప్రయత్నం పెద్ది సుదర్శన్ రెడ్డి నాయకత్వంలోని బీఆర్ఎస్ పార్టీ చేయడం సిగ్గుచేటని అన్నారు. ఇప్పటికైనా పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రభుత్వ ఆస్తులను కాపాడటానికి మద్దతు ఇస్తారా? లేక భూకబ్జాదారులకు వత్తాసు పలుకుతారా? అనే విషయాన్ని నల్లబెల్లి గ్రామ ప్రజలకు స్పష్టంగా తెలియజేయాల్సిన బాధ్యత బీఆర్ఎస్ నాయకులపై ఉందన్నారు. భూకబ్జాదారుల చెర నుంచి ప్రభుత్వ ఆస్తులను విముక్తి చేసే పోరాటానికి మద్దతు ఇచ్చి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు.అమాయక ప్రజలకు ఎస్సారెస్పీ భూములను విక్రయించిన దొంగలకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. పోరాట నాయకుడినని చెప్పుకునే పెద్ది సుదర్శన్ రెడ్డి నల్లబెల్లిలోని ప్రభుత్వ భూములను భూకబ్జాదారుల నుంచి విముక్తి చేయు పోరాటానికి ముందుకు వచ్చి తన పోరాట పటిమను మరోసారి నిరూపించుకోవాలని కోరారు.ఈ పత్రికా సమావేశంలో మాలోతు ప్రతాప్ సింగ్, మాలోతు చరణ్ సింగ్, దుంపల ఇంద్రారెడ్డి, పెంతల కొమురారెడ్డి, నల్లబెల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బత్తిని మహేష్, వార్డు సభ్యులు మాసంపెల్లి అఖిల్, మామిడి వేణు, అలాగే గ్రామ నాయకులు బత్తిని మల్లయ్య, త్యాగరాజు, కోల లింగయ్య, వైనాల సారయ్య, కొండి అశోక్, కన్నెబోయిన సురేష్, కోడూరి సిద్ధు, పొడిటి పవన్, బ్రహ్మ తేజ, బాబు రావు, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనుల ప్రారంభం



**మహాదేవపూర్ జనవరి 18,(నినాదం):**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపురం మండలం ఎడపల్లి గ్రామ పంచాయితీ పరిధిలో ఆదివారం ఉపాధిహామీ పనులను గ్రామ సర్పంచ్ మోతే నీలారాణి సాంబయ్య ప్రారంభించారు. గ్రామంలో ఉపాధి హామీ పనులు ప్రతి కుటుంబానికి కల్పిస్తామని ఆమె అన్నారు. ఉపాధి హామీ పనులల్లో భాగంగా ఊర చెరువులో చేపల పెంపకానికి శ్రీకారం చుట్టారు. మన చెరువులో చేపల పెంపకం ద్వారా వచ్చే ఆదాయం గ్రామ అభివృద్ధి కి ఉపయోగపడుతాయని సర్పంచ్ నీలారాణి సాంబయ్య అన్నారు.గ్రామంలో ఉపాధికల్పించడమే లక్ష్యంగా పనిచేస్తామని ఆమె అన్నారు. ఈ కార్యక్రమం లోఉప సర్పంచ్ రాజ మద్దుల కృష్ణ,వార్డు సభ్యులు, జేఈ శ్రీనివాస్, టెక్నీకల్ ఆసిస్టెంట్ కిరణ్, ఫీల్డ్ ఆసిస్టెంట్ రాజశేఖర్, ప్రజలు పాల్గొన్నారు.


## తెలుగువారి ఆత్మగౌరవ ప్రతిరూపం ఎన్టీఆర్

బిఆర్ఎస్ నాయకులు సిద్ధార్థ



**మిర్యాలగూడ జనవరి 18 (నినాదం):**
కథానాయకుడిగా, ప్రజానాయకుడిగా తెలుగు ప్రజల గుండెల్లో చెరగని స్థానం సొంతం చేసుకున్న మహనీయుడు నందమూరి తారక రామారావు అని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నల్లమోతు సిద్ధార్థ అన్నారు. ఆదివారం మిర్యాలగూడ బస్టాండ్ వద్ద గల ఎన్టీఆర్ 30వ వర్ధంతి సందర్భంగా జిల్లా మాజీ జెడ్పి చైర్మన్ సిడి.రవికుమార్ కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు కార్యక్రమములో జేర్రిపోతుల రాములు గౌడ్, పరిమి రామావతారం,వింజం శ్రీధర్, కునాల గోపాల కృష్ణ, తిరందాస్ విష్ణు, తుమ్మల ఫణి కుమార్, అన్నపర్తి గంగాధర్, పెలపోలు హరిబాబు,చిన్నం రమేష్ బాబు, తిరుమల పాలు సురేష్, పాతూరి ప్రసాద్ తదితరులు ఉన్నారు..

## యూటర్న్ ఏర్పాటు చేయాలని వాయిల సింగారం గ్రామస్తుల వినతి



**కోదాడ,జనవరి18(నినాదం):**
కోదాడ పట్టణంలోని లారీ ఆఫీస్ వద్ద యూటర్న్ ఏర్పాటు చేయాలని అనంతగిరి మండలం వాయిల సింగారం సర్పంచ్ నందిగామ శ్రీనివాసు , గ్రామస్తులు ఆర్ అండ్ బి డి .ఈ పవన్ కుమార్ కు ఆదివారం వినతి పత్రం ఇచ్చారు. కోదాడ నుండి కొమరబండ బైపాస్ వరకు నూతన రహదారిని నిర్మిస్తున్నారని, రహదారితో పాటు డివైడర్ సైతం ఏర్పాటు చేస్తున్నారని, లారీ ఆఫీస్ వద్ద డివైడర్ ను కట్ చేసి యూటర్న్ ఏర్పాటు చేయాలని అన్నారు. యూటర్న్ ఏర్పాటు చేస్తేనే రామిరెడ్డి పాలెం మీదుగా అనంతగిరి మండలానికి వెళ్లే 15 గ్రామాల ప్రజలకు ఇబ్బందులు ఉండవని స్పష్టం చేశారు. ప్రజల ఇబ్బందుల దృష్ట్యా పరిశీలిస్తామని డి ఈ తెలిపారు.

## గౌడలకి ప్రాధాన్యత ఇచ్చిన పార్టీకే మా మద్దతు

**ముస్సిపల్ ఎన్నికల్లో గౌడలకు 4 సీట్లు కేటాయించాలి - పెద్దపల్లి గౌడ జేఏసీ డిమాండ్**




**పెద్దపల్లి ప్రతినిధి, జనవరి18 (నినాదం)**
గౌడ సామాజిక వర్గానికి మున్సిపల్ ఎన్నికల్లో రాజకీయంగా ప్రాధాన్యత కల్పించే పార్టీకే మా మద్దతు ఇచ్చి గెలిపించుకుంటామని,పెద్దపల్లి నియోజకవర్గ గౌడ సంఘాల జే.ఏ.సీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పెద్దపల్లి ప్రెస్ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గౌడ సంఘాల జే.ఏ.సీ నాయకులు బొబ్బిలి రాజమౌళి గౌడ్,పడాల కొమరయ్య గౌడ్, బాలసాని వెంకటేష్ గౌడ్,పడాల సతీష్ గౌడ్ మాట్లాడుతూ,పెద్దపల్లి మున్సిపాలిటీలో తమ సామాజిక వర్గానికి సుమారు 10 వేలకు పైగా ఓటర్లు ఉన్నారని,రాజకీయ పార్టీలు తమను కేవలం ఓటు బ్యాంకుగా చూస్తున్నాయని మండిపడ్డారు. జెండాలు మోసే కార్యకర్తలుగా మాత్రమే వాడుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.గత మున్సిపల్ ఎన్నికల్లో ఒక్క గౌడ అభ్యర్థికి కూడా కౌన్సిలర్‌గా పోటీ చేసే అవకాశం ఇవ్వకపోవడం శోచనీయమని,ఈ వివక్షను ఇకపై భరించే ప్రసక్తే లేదని వారు స్పష్టం చేశారు.పెద్దపల్లి మున్సిపాలిటీలోని 36 వార్డులలో కనీసం 4 వార్డులను గౌడ సామాజిక వర్గానికి కేటాయించాలని కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ సహా అన్ని రాజకీయ పార్టీలను వారు డిమాండ్ చేశారు.ఏ పార్టీ అయితే తమ సామాజిక వర్గానికి ప్రాధాన్యతనిచ్చి టికెట్లు కేటాయిస్తుందో,ఆ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం తమ సంఘం శ్రేణులన్నీ ఏకతాటిపై నిలిచి సంపూర్ణంగా మద్దతు తెలుపుతాయని ప్రకటించారు.గతంలో బాలసాని సురేష్ గౌడ్ వంటి నాయకులను భారీ మెజారిటీతో గెలిపించుకున్న చరిత్ర తమకు ఉందని గుర్తు చేస్తూ,రాజకీయ పార్టీలు తమ సామాజిక వర్గం పై చిన్నచూపును వీడాలని కోరారు. ఒకవేళ తమ డిమాండ్లను నిర్లక్ష్యం చేస్తే,రాబోయే ఎన్నికల్లో గౌడల ఐక్యతను మరియు తమ సత్తా ఏంటో రాజకీయ పార్టీలకు రుచి చూపిస్తామని ఈ సందర్భంగా జే.ఏ.సీ నాయకులు హెచ్చరించారు.ఈ సమావేశంలో గుర్రం సదానందం గౌడ్, బండారి సునీల్ గౌడ్,బండారి సుమన్ గౌడ్,బండి నరేందర్ గౌడ్,అడ్డిగుంట శ్రీనివాస్ గౌడ్,సతీష్ గౌడ్,వెంకటేష్ గౌడ్,శ్రీనివాస్ గౌడ్ తదితులు పాల్గొన్నారు.

## శివపల్లిలో జాతీయ పక్షిని కాపాడిన గ్రామస్తులు



**సుల్తానాబాద్, జనవరి 18 (నినాదం):**
జాతీయ పక్షి నెమలి గుర్తు తెలియని వ్యక్తులు ఏ ర్పాటు చేసిన వలలో చిక్కుకుని ఉండగా అటుగా వెళుతున్న గ్రామస్తులు కంటపడగా వెంటనే వన్య పాణి ప్రాణాలు కాపాడారు. పెద్దపల్లి జిల్లా ఎలిగే డు మండలం శివపల్లి గ్రామ శివారులో ఉన్న గుట్ట సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు గుట్ట చుట్టూ వలలు ఏర్పాటు చేయడంతో వలలో చిక్కున జా తీయ పక్షి నెమలిని పాలెపు పూర్ణ సుధాకర్ రా వు, తాండ్ర అంజయ్య, శ్రీనివాసరెడ్డి, తాడిచర్ల ఎల్ల య్య, పొన్నాల రాజు, కొల్లూరి రాజు కాపాడారు.

## చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

**సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి తాండ్ర అంజయ్య**




**సుల్తానాబాద్, జనవరి 18 (నినాదం):**
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు నష్టం చేసే కార్యక్రమాలను రద్దు చేయాలని సిఐటియు ఆధ్వ ర్యంలో చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలనిజిల్లా సహాయ కార్యదర్శి తాండ్ర అంజ య్య కార్మికులకు పిలుపునిచ్చారు. అనంతరం ఆ యన మాట్లాడుతూ,కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికులకు నష్టం చేసే 4 లేబర్ కోడ్స్ ను రద్దు చే యాలని, గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసా గించాలని, 2025 విద్యుత్తు బిల్లును రద్దు చేయాలని,ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాల ని, రాష్ట్ర ప్రభుత్వం కార్మి కులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని తదితర డిమాండ్లతో సోమ వారం పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ వద్ద భారీ ధర్నా చే పట్ట డానికి కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని వి జయవంతం చేయాలని కోరారు.

## కాకతీయ బుక్ ఆఫ్ నేషనల్ రికార్డ్ సాధించిన సాయికుమార్



**గోదావరిఖని, జనవరి 18 (నినాదం) :**
గోదావరిఖని చెందిన సాయికుమార్ కాకతీయ బుక్ ఆఫ్ నేషనల్ రికార్డ్స్‌కు ఎంపికైనట్లు వెల్లడించారు. ఆర్ఎఫ్‌సిఎల్ పరిధిలోని శ్రీ చైతన్య ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సాయికుమార్ ఈ ఘనత సాధించడం గర్వ కారణమని పలువురు అభినందించారు. ఇటీవల వరంగల్ జిల్లా పబ్లిక్ గార్డెన్స్‌లో అంజలి మీడియా ఆధ్వర్యంలో నిర్వహించిన "సంక్రాంతి సంబరాలు" కార్యక్రమంలో సాయికుమార్ జానపద నృత్య ప్రదర్శనలో పాల్గొని ప్రేక్షకుల మన్ననలు పొందారు. ఈ ప్రదర్శనను గుర్తించిన నిర్వాహకులు ఆయనను కాకతీయ బుక్ ఆఫ్ నేషనల్ రికార్డ్స్‌కు ఎంపిక చేశారు.ఈ సందర్భంగా సాయికుమార్‌కు నిర్వాహకులు బంగారు పతకం, ప్రశంసా పత్రం అందజేశారు. బుక్ ఆఫ్ నేషనల్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్న సాయికుమార్‌ను పాఠశాల ప్రిన్సిపల్ రవి, డీన్ రమేష్, ఉపాధ్యాయులు సంతోష్ తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

## సామాన్యుడి సభ మార్పు కోసం ఒక అడుగు ఆమ్ ఆద్మీ పార్టీ భారీ బహిరంగ సభకు సాదర ఆహ్వానం

**నిర్మల్ ప్రతినిధి,జనవరి18.(నినాదం):**
నిర్మల్ జిల్లా సమస్యల పరిష్కారం కోసం, అవినీతి రహిత పాలనే లక్ష్యంగా ఆమ్ ఆద్మీ పార్టీ (ఎ ఎ పి) భారీ బహిరంగ సభను నిర్వహిస్తోంది. ఢిల్లీ మరియు పంజాబ్ రాష్ట్రాలలో సాధ్యమైన ఉచిత విద్య, మెరుగైన వైద్యం, మరియు నాణ్యమైన విద్యుత్ మన తెలంగాణలో, మన నిర్మల్‌లో ఎందుకు సాధ్యం కావు? మార్పు కోసం గొంతెత్తుదాం.. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేద్దాం! ఈ సభకు ముఖ్య అతిథిగా ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ నాయకురాలు మన మధ్యకు వస్తున్నారు. ముఖ్యఅతిథి గా ప్రియాంక కక్కర్ (ఎ ఎ పి జాతీయ అధికార ప్రతినిధి & తెలంగాణ రాష్ట్ర ఇన్-ఛార్జ్) సభ వివరాలు: తేదీ: జనవరి 19, 2026 (సోమవారం) సమయం: మధ్యాహ్నం 2.00 గంటలకు సభా వేదిక సమస్తలంవేదిక: టి ఎన్ జి ఓ భవన్, నిర్మల్ పట్టణం.నిర్మల్ జిల్లాలోని ప్రజలు, మేధావులు, విద్యావంతులు, యువకులు మరియు పార్టీ కార్యకర్తలు అందరూ భారీ సంఖ్యలో తరలివచ్చి, ఈ సభను విజయవంతం చేయవలసిందిగా మనస్ఫూర్తిగా కోరుతున్నాను. జిల్లా అధ్యక్షులు, ఆమ్ ఆద్మీ పార్టీ – నిర్మల్.




## రాష్ట్రవ్యాప్తంగా 5 లక్షల ఇండ్లు ఇచ్చిన

# ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్

**- ఇల్లు నిర్మించుకునే ప్రతి ఒక్క నిరుపేదకు అందిస్తాం - గెలిపించే బాధ్యత మీది.. అభివృద్ధి చేసే బాధ్యత నాది**

**5 సార్లు ఓటు వేసి గెలిపిస్తే అభివృద్ధి శూన్యం - 20 కోట్ల రూపాయలతో సుల్తానాబాద్ అభివృద్ధి**

**పెద్దపల్లి ఎమ్మెల్యే చింత కుంట విజయ రమణా రావు**



**సుల్తానాబాద్, జనవరి 18 (నినాదం):**
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఐదు లక్షల ఇందిర మ్మ ఇండ్లు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కే దక్కిందని పెద్ద పల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు సం తోషం వ్యక్తం చేశారు. ఆదివారం సుల్తానాబాద్ మున్సిపల్ కేంద్రంలోని 10, 12 వార్డుల్లో23 ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గులు పోసి భూమి పూజ నిర్వ హించి,లబ్ధిదారులకు ప్రొ సీడింగ్స్ పత్రాలు పంపిణీ చేశారు.ముందుగా 10, 12 వ వార్డు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అంతటి పుష్ప లత అన్నయ్య గౌడ్, దున్నపోతుల లలిత రాజ య్య మధు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే విజయ రమ ణారావు కు గజమాలతో ఘన స్వాగతం పలుకగా అమిరీ శెట్టి తిరుపతి ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సత్కరించారు.అనంతరం ఆయన మా ట్లాడుతూ,9 సంవత్సరాల బి.ఆర్.ఎస్ పార్టీ పా లనలో సుల్తానాబాద్ పట్టణాన్ని భ్రష్టు పట్టించి, ఇక్కడి పాత తాలూకా కార్యాలయాలను సైతం తరలించకపోయినా ప్రభుత్వం బిఆర్ఎస్ ప్రభు త్వం అన్నారు. రెండు సంవత్సరాల కాంగ్రెస్ పాల నలో నియోజక వర్గం కోట్లాది రూపాయలతో అభి వృద్ధి పథంలో దూసుకు పోతుందని నియోజక వర్గంలో బస్సు డిపోను ఏర్పాటు చేయడంతో పా టు సీసీ రోడ్లు డ్రైనేజీలు నిర్మాణం చేపట్టడం జరి గిందన్నారు. దేశంలోనే ఐదు లక్షల ఇండ్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దే అన్నారు. పదవ వార్డుగాంధీనగర్ లో క్రయ విక్ర యాలు సాగించకుండా అసంపూర్తిగా ఉన్న భూ మిని 909 /1 909/2 రిజిస్ట్రేషన్ కు అనుకూలం గా మార్చామని పేర్కొన్నారు. గతంలో ఐదుసార్లు టిఆర్ఎస్ పార్టీకి ఓట్లు వేసిన పాపానికి సుల్తానా బాద్ ను భ్రష్టు పట్టించారని పేర్కొన్నారు. మరో మూడు సంవత్సరాలు కాలం ఉందని అప్పటి వ రకు ఇందిరమ్మ ఇల్లు ప్రతి ఒక్క నిరుపేదకు అం దించి తీరుతామని తధానంతరం ఇల్లు కట్టుకునే లబ్ధిదారుల కోసం వెతకాల్సిన పరిస్థితిలు నెలకొం టాయని అన్నారు. మరో ఐదు సంవత్సరాలు క చ్చితంగా కాంగ్రెస్‌ప్రభుత్వంఅధికారంలో ఉంటుం దని ప్రజలందరూఆశీర్వదించి రానున్న ఎన్ని కల లో కాంగ్రెస్ ప్రభుత్వానికి అనుకూలంగా అండగా వ్యవహరించాలన్నారు. రాష్ట్రంలో ఉన్న మున్సిప ల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు 80% విజయం సాధించి తీరుతారని పేర్కొన్నారు. టిఆర్ఎ స్ పార్టీ కల్లబొల్లి మాటలు నమ్మి మోసపోవద్దని రానున్న మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థులను ఆశీర్వదించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్, మార్కెట్ చైర్మన్ ప్రకాష్ రావు, మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేష్, దేవాలయం చైర్మన్ పల్ల మురళీధర్, ఓదెల దేవాలయండైరెక్టర్ సామల యమున హరికృష్ణ, డి.దామోదర్ రావు, చిలుక సతీష్, అమీర్ శెట్టి రాజలింగం, తిరుపతి, మాజీ సింగిల్ విండో చైర్మన్ శ్రీ గిరి శ్రీనివాస్, పల్లా సురేష్ , బిరుదు కృష్ణ, తోర్రి కొండ ప్రభాకర్, అంతటి సాగర్ గౌడ్, లక్ష్మణ్ గౌడ్, అభినవ్ గౌడ్, నోముల శ్రీనివాసరెడ్డి గరిగే శ్రీనివాస్, దున్నపోతుల మధు, అమిర్ శెట్టి రాకేష్ లతోపాటు పార్టీ శ్రేణులు పలు వురు పాల్గొన్నారు.



## ఎన్టీఆర్ అమలు చేసిన పథకాలు దేశానికి ఆదర్శం : టీ డీ పీ పట్టణ అధ్యక్షులు తోట వెంకటేష్



**సుల్తానాబాద్, జనవరి 18 (నినాదం):**
స్వర్గీయ నందమూరి తారక రామారావు ముఖ్య మంత్రిగా రాష్ట్రంలో పేద ప్రజల కోసం అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శం గా నిలిచాయని సుల్తానాబాద్ పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తోట వెంకటేష్ అన్నారు. స్వ ర్గీయ ఎన్టీఆర్ 31 వ వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం ఏర్పా టు చేసిన కార్యక్రమంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించా రు. ప్రజలకు కార్యకర్తలకు స్వీట్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తోట వెంకటేష్ మాట్లాడుతూ ఎన్టీ రామారావు కేవలం 9 నెలల సమయంలోనే పార్టీ ని ఏర్పాటు చేసి ప్రభుత్వాన్ని స్థాపించాడని, బీసీ లకు అవకాశాలు ఇచ్చి రాజకీయ భిక్ష పెట్టిన మ హానేత అంటూ కొనియాడారు. పేదల ఆకలి తీర్చ డానికి బియ్యం పథకాన్ని ప్రవేశపెట్టారని గుర్తు చే శారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు అభి మానులు పాల్గొన్నారు.


## వాటర్ ట్యాంక్ ఎందుకు పూర్తి చేస్తలేరో

# జవాబు చెప్పాలే

**ఆరుమాసాల్లో పూర్తి చేస్తామని ఏడాదిన్నరైనా పూర్తి చేయలే**

**- శంఖుస్థాపనలు చేసి మర్చిపోవడం ఎమ్మెల్యేకు పరిపాటే**
**- సమాజం కళ్లలో కన్నీళ్లు..కడుపులో ఆకలి చూసిన**


**మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**



**మంథని జనవరి 18 (నినాదం)**
కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన అమృత్ 2.0పథకంలో బాగంగా మంథని మున్సిపల్ పరిధిలోని పోచమ్మవాడలో చేపట్టిన వాటర్ ట్యాంక్‌ను ఆరుమాసాల్లో పూర్తి చేస్తామని చెప్పిన మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ ఏడాదిన్నరైనా పూర్తి చేయని ఘనత దక్కించుకున్నాడని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఎద్దేవా చేశారు. మంథని మున్సిపల్ పరిధిలోని పోచమ్మవాడలో 2024జూలై 15న వాటర్ ట్యాంక్ నిర్మాణానికి మంథని ఎమ్మెల్యే శంఖుస్థాపన చేశారని ఆయన విమర్శించారు. ఆదివారం అసంపూర్తిగా ఉన్న వాటర్ ట్యాంక్‌ను స్థానిక నాయకులు, కాలనీవాసులతో కలిసి ఆయన సందర్శించి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని విశ్వబ్రాహ్మణవాడ, పోచమ్మవాడతో పాటు తదితర వీధులకు నీళ్లు అందించేందుకు కేంద్రం 50శాతం, రాష్ట్ర ప్రభుత్వం 50శాతం నిధులతో వాటర్ ట్యాంకు నిర్మాణానికి శంఖుస్థాపన చేసిన మంథని ఎమ్మెల్యే ఆరుమాసాల్లో ట్యాంకును పూర్తి చేసి నీళ్లు అందిస్తామని ఉపన్యాసం ఇచ్చాడని ఆయన గుర్తు చేశారు. అయితే మంథని ఎమ్మెల్యే శంఖుస్థాపనలు చేయడం మర్చిపోవడం పరిపాటేనని అన్నారు. ఎమ్మెల్యేకు ఓట్లు వస్తే కొన్ని గుర్తుకు వచ్చి ఈ వాటర్ ట్యాంకును మర్చిపోవచ్చని విమర్శించారు.కులసంఘాల అన్నతమ్ముళ్లు ఆలోచన చేయాలని ఆనాడు పాలాభిషేకాలు చేసి సంబురాలు జరుపుకున్నారని, కానీ కేంద్రం ద్వారా 50శాతం నిధులున్నా కాంట్రాక్టర్ బిల్లులు సక్రమంగా రాక కట్టే పరిస్థితి కనబడుతలేదన్నారు. ఏడాదిన్నర అయినా ట్యాంక్ నిర్మాణానికి అతీగతీ లేదని, మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న సొంత నియోజకవర్గంలో ఇలాంటి ఘనత ఉందని ఆయన అన్నారు. నియోజకవర్గంలో 80శాతం ఉన్న ఎస్సీ ఎస్టీబీసీ మైనార్టీ అగ్రవర్ణాల్లోని పేదల ఆకలి తీరాలంటే తాము నోరు తెరువాల్సిందేనని, ప్రతి విషయంలోనూ ప్రభుత్వాన్ని మంథని ఎమ్మెల్యేను ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. ఈ సమాజం కళ్లలో కన్నీళ్లు, కడుపులో ఆకలి చూసిన బిడ్డగా మంథని ఎమ్మెల్యే మెడలు వంచుతామన్నారు. మనం ఓట్లు వేసి అధికారం ఇస్తే దుద్దిళ్ల కుటుంబం అభివృద్ధి చెందుతోందని, ఇక్కడ బీసీవాదం ఎత్తుకుంటే ఆ బీసీ వాదాన్ని తుంగల్లో తొక్కడానికి పైకి రాకుండా చేయడానికి చేస్తున్న కుట్రలను బయటపెడుతామన్నారు. కుల సంఘాలకు వాగులో శిలాఫలకాలు వేయడంపై మంథని ఎమ్మెల్యే క్లారిటీ ఇవ్వాలని, అలాగే ఈ ప్రాంత ప్రజలపై చిత్తశుద్ధి ఉంటే వాటర్ ట్యాంక్‌ను పూర్తి చేసి తాగునీటిని అందించాలని ఆయన ఈసందర్భంగా డిమాండ్ చేశారు. ఆయన వెంట బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో బీఎస్పీ పోటీ

**జిల్లా అధ్యక్షుడు రాజనర్సయ్య**




**పెద్దపల్లి ప్రతినిధి,జనవరి 18:(నినాదం):**
తెలంగాణ రాష్ట్రంలో రాబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో బహుజన్ సమాజ్ పార్టీ అభ్యర్థులు అన్ని స్థానాల్లో పోటీ చేయనున్నట్లు పెద్దపల్లి జిల్లా బీఎస్పీ పార్టీ అధ్యక్షుడు ఇరుకుల్ల రాజనర్సయ్య వెల్లడించారు.ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రాజనర్సయ్య మాట్లాడుతూ, పెద్దపల్లి జిల్లాలోని రామగుండం కార్పొరేషన్ సహా మంథని, పెద్దపల్లి, సుల్తానాబాద్ మున్సిపాలిటీల్లోని అన్ని కార్పొరేటర్, కౌన్సిలర్ స్థానాలకు బీఎస్పీ అభ్యర్థులను రంగంలోకి దించుతున్నట్లు ప్రకటించారు. ఎన్నికల ముందు ప్రజలకు ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి,అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్,బీజేపీ,బి. ఆర్.ఎస్ పార్టీలు ప్రజలను వంచించాయని ఆయన విమర్శించారు.కాంగ్రెస్ పార్టీ బీసీలను దారుణంగా మోసం చేసిందని దుయ్యబట్టారు.ఈ అగ్రకుల పార్టీలకు రానున్న ఎన్నికల్లో ప్రజలు ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపు నిచ్చారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే నాయకులకు,కార్యకర్తలకు ఎన్నికల్లో సముచిత స్థానం కల్పిస్తామని రాజనర్సయ్య పేర్కొన్నారు.సామాజిక న్యాయం బీఎస్పీతోనే సాధ్యమని, ప్రజలు ఏనుగు గుర్తుపై ఓటు వేసి తమ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్ పేగ నరేష్,జిల్లా ఉపాధ్యక్షుడు నర్ల గోపాల్ యాదవ్,రామగుండం నియోజకవర్గ ఇంచార్జ్ జింక ఉదయ్,పెద్దపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు బోంకురి దుర్గయ్య, ప్రధాన కార్యదర్శి సాతురి అనిల్, పట్టణ అధ్యక్షురాలు రామిళ్ల శారద, సీనియర్ నాయకురాలు కడావేర్ల వరలక్ష్మి పాల్గొన్నారు.

## తెలుగుజాతి గౌరవాన్ని చాటిన మహానేత ఎన్‌టీఆర్

**మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**



**మంథని జనవరి 18( నినాదం)**
తెలుగుజాతి గౌరవాన్ని చాటిన మహానేత స్వర్గీయ ఎన్‌టీ రామారావు అని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్‌టీఆర్ వర్థంతిని పురస్కరించుకుని మంథని బొక్కలవాగుపై ఏర్పాటు చేసిన ఎన్‌టీఆర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులుఅర్పించారు. సినీ రంగంలో నటనకు కొత్త నిర్వచనం ఇచ్చిన ఎన్టీఆర్, రాజకీయాల్లో సామాన్యుడి స్వాభిమానానికి ప్రతీకగా నిలిచారని ఆయన పేర్కొన్నారు.ఇప్పటికి తెలుగుప్రజల గుండెల్లో నిలిచిన గొప్ప నాయకులు ఎన్‌టీఆర్ అని, ఆయన సేవలను మరిచిపోరని ఆయన ఈసందర్భంగా పేర్కొన్నారు.ఆయన వెంట బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## నిర్మల్ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలి

**ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నిర్మల్ ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**



**నిర్మల్ ప్రతినిధి, జనవరి18 (నినాదం):**
నిర్మల్ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. రేపటి నుంచి 23వ తేదీ వరకు ఐదు రోజులపాటు ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నిర్మల్ ఉత్సవాలను నిర్వహిస్తున్నందున, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదివారం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఏర్పాట్ల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రధాన వేదిక, సంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనల వేదిక, స్టాల్స్, మరుగుదొడ్లు, సెల్ఫీ పాయింట్స్, పార్కింగ్, చిన్నపిల్లల ఆట విడుపు ప్రదేశం, ఎల్ఈడి తెరలు ఏర్పాటు చేసే ప్రదేశాలను పరిశీలించారు. అధికారులకు ముఖ్యమైన సూచనలు చేశారు. నిర్మల్ ఉత్సవాల కార్యక్రమానికి హాజరయ్యే సందర్శకులకు, విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. సరిపడినన్ని కుర్చీలు, సరైన మరుగుదొడ్లు, పారిశుద్ధ్యం, త్రాగునీరు, లైటింగ్ వంటి వసతులు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని అన్నారు. పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వివరించారు. నిర్మల్ జిల్లా చరిత్ర, సంస్కృతిక వారసత్వం ఉట్టిపడేలా విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. ఈ ఏర్పాట్ల పరిశీలనలో ఆర్డీఓ రత్నకళ్యాణి, డీఈవో భోజన్న, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, డిఆర్డిఓ విజయలక్ష్మి , జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, హార్టికల్చర్ అధికారి రమణ, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, తహసిల్దార్ రాజు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ జనతా పార్టీ బూత్ నిర్మాణ అభియాన్ కార్యక్రమం



**నిర్మల్ ప్రతినిధి, (కుంటాల)జనవరి 18.(నినాదం):**
ఆదివారం కుంటాల మండల కల్లూరు గ్రామంలో జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ గౌరవ శాసన సభ్యులు శ్రీ రామ రావు పటేల్ ఆదేశానుసారం పార్టీ పటిష్టతే ధ్యేయంగా "బూత్ నిర్మాణ అభియాన్ కార్యక్రమం" నిర్వహణ చేయడం జరిగింది. కార్యక్రమ జిల్లా కన్వీనర్ నల్ల రమేష్, ముఖ్య అతిథి తాడేవార్ సాయినాథ్ మాట్లాడుతూ ప్రతి బూత్ పూర్తిస్థాయి కమిటీ నిర్మాణం జరగాలని, కార్యకర్తలందరి సమన్వయం తో రాబోయే ఎన్నికల్లో విజయం సాధించాలని అన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన సర్పంచుల ను, వార్డ్ సభ్యులను సత్కరించారు. నూతనంగా ఎన్నికైన గౌరవ సర్పంచ్లు, కట్ట రవి, జక్కుల గజేంధర,బాజీ రావు, హిమ్మత్ రావు, రాజన్న జాదవ్ శివాజీ,వార్డ్ సభ్యులు నవీన్ రెడ్డి, నారాయణ, మనోహర్ , మాధవ్ రావు,మండల అధ్యక్షులు పసులు నవీన్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కేశెట్టి అశోక్ మండల కార్యక్రమ కన్వీనర్ సూర్యవంశీ సాయినాథ్, ప్రభాకర్, చిన్న రెడ్డి, సుదర్శన్ పటేల్, తాటి శివ, కళ్యాణి గజేంద్ర బూత్ అధ్యక్షులు, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతే లక్ష్యంగా కొనసాగుతున్న అరైవ్ అలైవ్ కార్యక్రమం

**- రోడ్డు భద్రత ప్రజలందరి బాధ్యత**
**- నాల్గవ రోజు ప్రమాదకర ప్రాంతాల అవగాహన దినం**
**- రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తే ప్రాణాలు సురక్షి**
**- జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్**

**నిర్మల్ ప్రతినిధి, జనవరి18.(నినాదం):**
రాష్ట్ర వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "అరైవ్ అలైవ్" రోడ్ సేఫ్టీ కార్యక్రమంలో భాగంగా, నేడు జిల్లా వ్యాప్తంగా కార్యక్రమం నాల్గవ రోజు సందర్భంగా ప్రమాదకర ప్రాంతాల అవగాహన దినం (బ్లాక్ స్పాట్స్) గా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బంది జిల్లాలోని గుర్తించబడిన ప్రమాదకర రహదారి ప్రాంతాల్లో బాధిత కుటుంబాలు, ప్రయాణికులు, స్థానిక ప్రజలతో సమావేశాలు నిర్వహించి, ప్రమాదాలకు కారణాలు, జాగ్రత్తలు, తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై అవగాహన కల్పించారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించడం, సీట్‌బెల్ట్ వాడకం, మద్యం సేవించి వాహనం నడపకూడదని, అధిక వేగం ప్రమాదాలకు ప్రధాన కారణమని ప్రజలకు వివరించారు. ముఖ్యంగా యువత ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా అనేక ప్రాణాలను కాపాడవచ్చని తెలియజేశారు. బ్లాక్ స్పాట్స్ వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం, రోడ్డు మలుపులు, గుంతలు, సిగ్నల్ లేని ప్రాంతాలపై సంబంధిత శాఖలకు సూచనలు పంపడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. ప్రజల సహకారంతోనే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# అతివలే అధికం..

## పురపోరులో కీలకంగా మహిళా ఓటర్లు

**మున్సిపల్ ఎన్నికల నిర్వాహణకు ప్రభుత్వం సిద్ధమైన విషయం తెలిసిందే. ఇప్పటికే పోలింగ్ కేంద్రాల వారిగా ఫోటోలతో కూడిన ఓటర్ల తుది జాబితాను విడుదల చేశారు. ఇక ఏ క్షణంలోనైనా ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశాలు ఉండడంతో సంబంధిత అధికారులు ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో గెలుపోటములను నిర్ణయించే నిర్ణయాత్మక శక్తిగా మహిళా ఓటర్లు ఉండడంతో వారే ఈ ఎన్నికల్లో 'కీ'లకం కానున్నారు. మెట్ పల్లి మున్సిపాలిటీలో 26 వార్డులు ఉండగా మొత్తం ఓటర్లు46,201ఓట్లకు 22,283 పురుషులవి పోతే 23,917 వారివే ఉండడంతో ఎన్నికల్లో వారు నిర్ణయాత్మక శక్తిగా మారనున్నారు.**

*– మెట్‌పల్లి, జనవరి 18 (నినాదం)*




### మునిసిపల్ ఎన్నికల్లో నిర్ణయాత్మక శక్తిగా మహిళా ఓటర్లు..

ఇటీవల విడుదల చేసిన ఓటర్ల తుది జాబితా ప్రకారం మెట్ పల్లి మున్సిపల్ పరిధిలోని 26 వార్డులలో మొత్తం ఓటర్లు 46,201 లో పురుషుల 22,283 పోతే 23,917 వారివే. కాగా మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి కీలకమైన ఓటర్ల తుది జాబితాను అధికారులు విడుదల చేయగా ఇందులో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో గెలుపోటములను నిర్ణయించే నిర్ణయాత్మాక శక్తిగా మహిళ ఓటర్లు ఉండడం గమనార్హం.

### మహిళా ఓటర్లే డెసీషన్ మేకర్లు....

పట్టణంలోని ఒకటో వార్డులో మొత్తం ఓటర్లు 1389 కాగా ఇందులో 644 పురుషులు, 745 మహిళలు ఉన్నారు. అదేవిధంగా రెండో వార్డులో మొత్తం 1681 ఓటర్లు ఉండగా ఇందులో 809 పురుషులు, 872 మహిళలు, మూడో వార్డులో మొత్తం 1674 ఓటర్లు ఉండగా ఇందులో 788 పురుషులు, 876 మహిళలు, నాల్గో వార్డులో మొత్తం 1933 ఓటర్లు ఉండగా ఇందులో 930 పురుషులు, 1003 మహిళలు, ఐదో వార్డులో మొత్తం 1774 ఓటర్లు ఉండగా ఇందులో 849 పురుషులు, 925 మహిళలు ఉన్నారు. ఆరో వార్డులో మొత్తం 2197 ఓటర్లు ఉండగా ఇందులో 1029 పురుషులు, 1168 మహిళలు, ఏడో వార్డులో మొత్తం 1897 ఓటర్లు ఉండగా ఇందులో 953 పురుషులు, 944 మహిళలు, ఎనిమిదో వార్డులో మొత్తం 1753 ఓటర్లు ఉండగా ఇందులో 883 పురుషులు, 870 మహిళలు, తొమ్మిదో వార్డులో మొత్తం 2006 ఓటర్లు ఉండగా ఇందులో 982 పురుషులు, 1024 మహిళ ఓటర్లు ఉన్నారు. అదేవిధంగా 10వ వార్డులో మొత్తం 2001 ఓటర్లు ఉండగా ఇందులో 957 పురుషులు, 1044 మహిళలు, 11వ వార్డులో మొత్తం 1692 ఓటర్లు ఉండగా ఇందులో 859 పురుషులు, 833 మహిళలు ఉన్నారు. 12వ వార్డులో మొత్తం 1935 ఓటర్లు ఉండగా ఇందులో 895 పురుషులు, 1040 మహిళలు, 13 వార్డులో మొత్తం 1728 ఓటర్లు ఉండగా ఇందులో 824 పురుషులు, 904 మహిళలు, 14వ వార్డులో మొత్తం 2155 ఓటర్లు ఉండగా ఇందులో 1027 పురుషులు, 1128 మహిళలు, 15వ వార్డులో మొత్తం 1655 ఓటర్లు ఉండగా ఇందులో 755 పురుషులు, 900 మహిళలు, 16వ వార్డులో మొత్తం 1664 ఓటర్లు ఉండగా ఇందులో 810 పురుషులు, 654 మహిళలు, 17వ వార్డులో మొత్తం 1548 ఓటర్లు ఉండగా ఇందులో 749 పురుషులు, 799 మహిళలు, 18వ వార్డులో మొత్తం 1972 ఓటర్లు ఉండగా ఇందులో 983 పురుషులు, 989 మహిళలు, 19వ వార్డులో మొత్తం 1566 ఓటర్లు ఉండగా ఇందులో 779 పురుషులు, 786 మహిళలు, 20వ వార్డులో మొత్తం 1832 ఓటర్లు ఉండగా ఇందులో 888 పురుషులు, 944 మహిళలు, 21వ వార్డులో మొత్తం 2147 ఓటర్లు ఉండగా ఇందులో 1054 పురుషులు, 1093 మహిళలు, 22వ వార్డులో మొత్తం 1978 ఓటర్లు ఉండగా ఇందులో 936 పురుషులు, 1043 మహిళలు, 23వ వార్డులో మొత్తం 1503 ఓటర్లు ఉండగా ఇందులో 685 పురుషులు, 818 మహిళ ఓటర్లు ఉన్నారు. 24వ వార్డులో మొత్తం 1550 ఓటర్లు ఉండగా ఇందులో 736 పురుషులు, 814 మహిళలు, 25వ వార్డులో మొత్తం 1645 ఓటర్లు ఉండగా ఇందులో 814 పురుషులు, 831 మహిళలు, 26వ వార్డులో మొత్తం 1335 ఓటర్లు ఉండగా ఇందులో 665 పురుషులు 670 చొప్పున మహిళలు ఉన్నారు.

**46,201కు 22,283 పురుషులవి పోతే 23,917 ఓట్లు వారివే**

**వార్డుల్లోనూ వారిదే పైచేయి**

**రిజర్వేషన్లలోనూ సగభాగం**

**ఏ క్షణంలోనైనా షెడ్యూల్‌కు ఛాన్స్**

**ఏర్పాట్లలో నిమగ్నమైన బల్దియా అధికారులు**



### రిజర్వేషన్లలోనూ సగం..

మునిసిపల్ ఎన్నికల ఓటర్ల తుది జాబితా విడుదల కావడంతో ప్రభుత్వ ఇటీవల వార్డులకు సంబంధించి రిజర్వేషన్లను ప్రకటించింది. ఇప్పటికే మున్సిపల్ పరిధిలోని 26 వార్డులకు వార్డుల్లో పోలింగ్ స్టేషన్ల వారిగా ఫోటోలతో కూడిన ఓటర్ జాబితాను అధికారులు ప్రకటించారు. ఇప్పటికే రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల సిబ్బందికి సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. బ్యాలెట్ పద్ధతిలో జరగనున్న ఎన్నిక కోసం బ్యాలెట్ బాక్సులతో పాటు ఎన్నికల సామగ్రిని సిద్ధం సిద్ధం చేసే పనిలో అధికారులు ఉన్నారు.

---

సంకల్ప సాధకుడు అయోధ్యా..

# అభివృద్ధిలో విద్య

## పుత్రుని జ్ఞాపకార్థం పేద విద్యార్థులకు చేయూత





**చింతపల్లి, జనవరి 18 (నినాదం):** మండల కేంద్రానికి చెందిన ఆదిత్యుని అయోధ్య శర్మ విద్యాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయడం పట్ల పలువురు అభినందిస్తున్నారు. మండల కేంద్రానికి చెందిన అయోధ్య శర్మ హైదరాబాదులో సిటీవోగా పనిచేస్తూ రిటైర్డ్ అయ్యారు. తన కుమారుడు నవీన్ శర్మ అకారణంగా మృతి చెందడంతో ఆయన ఎంతో మనస్తాపంతో కొంతకాలం కృంగిపోయారు. అనంతరం తన కుమారుడు లేని లోటును తీర్చుకోవడానికి తనకు తానుగా విద్యాభివృద్ధి కోసం కృషి చేయడం ప్రారంభించాడు. అందులో భాగంగా తన స్వగ్రామమైన చింతపల్లిలో పేద విద్యార్థులకు ఆసరాగా నిలుస్తూ వస్తున్నాడు. విద్యార్థులను ప్రోత్సహించడం కోసం పదవ తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థానాలలో ఉత్తీర్ణులైన వారికి 15000, 10,000 చొప్పున నగదు బహుమతిని అందిస్తూ విద్యాభ్యాస ప్రాముఖ్యతను తన ప్రసంగంలో వివరిస్తున్నాడు. దాంతోపాటు ఎలాంటి ఆధారాలు లేని మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తూ వారి జీవనోపాధికి తోడ్పడుతున్నాడు. విద్యాభివృద్ధి తో పాటు తన సొంత గ్రామాభివృద్ధి కోసం తోడ్పాటు అందిస్తానని ఆయన తెలిపారు. సామాజిక సేవ పట్ల చిత్తశుద్ధితో కృషి చేస్తున్న అయోధ్య శర్మను పలువురు అభినందించారు.

---

NINADAM CINEMA

# నా మాటలను తప్పుగా అర్థం చేసుకున్నారు

## వివాదంపై స్పందించిన ఏఆర్ రెహమాన్




హిందీ సినిమా పరిశ్రమలో మతపరమైన పక్షపాతం ఉందని మ్యూజిక్ డైరెక్టర్ ఏఆర్ రెహమాన్ ఇటీవల చేసిన కామెంట్స్ తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. దీంతో బాలీవుడ్ సినీప్రముఖులు ఆయన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో తన మాటలను తప్పుగా అర్థం చేసుకున్నారని.. తన ఉద్దేశం అది కాదంటూ వివరణ ఇస్తూ వీడియో షేర్ చేశారు ఏఆర్ రెహమాన్. తన జీవితంలో, సంగీత ప్రయాణంలో భారతదేశం ఎల్లప్పుడూ కేంద్రంగా ఉందని చెబుతూ, రెహమాన్ తన మాటాలను ఇన్‌స్టాగ్రామ్‌లో స్పష్టం చేశారు. ఎవరి మనోభావాలను దెబ్బతీయాలని తాను ఎప్పుడూ అనుకోలేదని అన్నారు. ఈక్రమంలో ఇప్పుడు మరోసారి ఏఆర్ రెహమాన్ షేర్ చేసిన వీడియో వైరల్ అయ్యింది. "కొన్ని సందర్భాల్లో ఒకరి ఉద్దేశాలను ఇతరులు తప్పుగా అర్థం చేసుకునే అవకాశం ఉంటుంది. నా వ్యాఖ్యలతో ఎవరికైనా బాధ కలిగించాలనే ఉద్దేశం నాకు లేదు. నా నిజాయితీని అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాను. నా వ్యాఖ్యలను మతంతో ముడిపెట్టి చూడడం సరైనది కాదు. నేను చెప్పాలనుకున్నది ఒకటే. ఒకప్పుడు సంగీతానికి కళాకారులకు ఉన్న ప్రాధాన్యం ఇప్పుడు తగ్గుతుంది. కమర్షియల్ అంశాలే ఎక్కువ అవుతున్నాయి. కళ, సంగీతానికి ఇవ్వాల్సిన గౌరవం తగ్గిపోతుందన్న బాధతోనే మాట్లాడాను. నేను ఎప్పుడు ఎవరినీ బాధపెట్టాలని అనుకోలేదని అన్నారు. భారతదేశం నా గురువు, నా ఇల్లు." అంటూ చెప్పుకొచ్చారు. భారతీయుడిగా ఉండడం అదృష్టంగా భావిస్తున్నాని.. తన భావాలను స్వేచ్ఛగా వ్యక్తపరచడానికి.. విభిన్న నేపథ్యాల నుంచి వచ్చిన కళాకారులతో కలిసి పనిచేయడానికి ఈ దేశమే తనకు అవకాశం ఇచ్చిందని అన్నారు. సంగీతం నా కోసం ఎప్పుడూ దేశ సంస్కృతిని అనుసంధానించే, గౌరవించే, వేడుకగా చేసుకునే ఒక మార్గం అని అన్నారు.

---

# రవితేజ, కృష్ణవంశీ ఎందుకు మాట్లాడుకోరు.!

## ఓపెన్‌గా చెప్పేసిన టాలీవుడ్ నటుడు



నటుడు శివాజీ రాజా ఖడ్గం సినిమా అనుభవాలను, రవితేజ-కృష్ణవంశీ ఎందుకు మాట్లాడుకోరు.! అనే విషయాలను ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. అమృతం సీరియల్ నుంచి తాను వైదొలగడానికి వెనుక కారణాలను తెలిపారు. నటుడు శివాజీ రాజా ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో కీలక విషయాలను పంచుకున్నారు. ముఖ్యంగా ఖడ్గం సినిమా షూటింగ్ అనుభవాలు, రవితేజ-కృష్ణవంశీ మధ్య విభేదాలు, అమృతం సీరియల్ నుంచి వైదొలగడం లాంటి అంశాలపై ఆసక్తికర కామెంట్స్ చేశారు. ఖడ్గం సినిమాలోని ఒక ముఖ్యమైన సన్నివేశాన్ని గుర్తుచేసుకుంటూ.. తాను ఆ పాత్ర చేయడానికి మొదట నిరాకరించానని తెలిపారు. అయితే, దర్శకుడు కృష్ణవంశీ పట్టుబట్టడంతో ఆ పాత్రను అంగీకరించానని చెప్పారు. ఆ సన్నివేశం షూటింగ్ సమయంలో, ప్రకాష్ రాజ్, రవితేజ, శ్రీకాంత్‌లతో కలిసి తాను నవ్వుతూ ఉండగా, కృష్ణవంశీ కోప్పడ్డారని వివరించారు. ఒకే షాట్లో షూటింగ్ పూర్తి చేశారని ఆయన తెలిపారు. ఈ సినిమా ద్వారా తనకు లభించిన గుర్తింపు కృష్ణవంశీకే దక్కుతుందని శివాజీ రాజా పేర్కొన్నారు. ఖడ్గం సినిమాలోని 'శాంతి శాంతి అని చెప్పి మమ్మల్ని ఆపుతున్నారు కానీ, రెండే రెండు నిమిషాలు ఆపి వదిలి చూడండి' అనే డైలాగ్ ఇప్పటికీ దేశవ్యాప్తంగా సర్జికల్ స్ట్రైక్స్ లాంటి సందర్భాల్లో చర్చనీయాంశమవుతుందని ఆయన గుర్తుచేశారు. రవితేజ, కృష్ణవంశీ ఎందుకు మాట్లాడుకోవడం లేదనే ప్రశ్నకు శివాజీ రాజా స్పందిస్తూ.. వారిద్దరూ తనకు మంచి స్నేహితులని, వారి మధ్య ఏం జరిగిందో తనకు తెలియదని చెప్పారు. అది తన వ్యక్తిగత విషయం కాదని, ఉన్నది ఉన్నట్లు మాట్లాడే తాను ఊహాగానాలతో సమాధానం చెప్పలేనని అన్నారు. అమృతం సీరియల్ నుంచి వైదొలగడానికి కారణాలు ఉన్నాయన్నారు. సీరియల్ హిట్ అయిన తర్వాత ఈగో సమస్యలు తలెత్తాయని పేర్కొన్నారు. ఒక హిట్ వచ్చినప్పుడు ఇది నా వల్ల అని అనుకోవడం వల్ల ఇలాంటి సమస్యలు వస్తాయని అభిప్రాయపడ్డారు. తాను డబ్బింగ్ చెప్పడం ఆలస్యమైందని, తనపై టీమ్ నుంచి ఒక ప్రమోషన్ విడుదలైందని తెలిపారు. అప్పటి వయస్సులో ఉన్న ఒత్తిడులు, సినిమా షూటింగ్ బిజీ షెడ్యూల్స్ వల్ల కొన్ని పొరపాట్లు జరిగి ఉండవచ్చని, అయితే తన తప్పు 1 శాతం కూడా లేదని ఆయన నొక్కి చెప్పారు. దర్శకుడు గంగరాజు, కెమెరామెన్ సెంథిల్, చంద్రశేఖర్ ఏలేటి లాంటి టీమ్ సభ్యుల పట్ల తనకు అపారమైన గౌరవం ఉందని తెలిపారు. తన ఇంప్రొవైజేషన్ వల్ల గంగరాజు నొచ్చుకున్న సందర్భాలు కూడా ఉన్నాయని, ఆయన రచనలో ఆయన గొప్ప అయితే, తన ప్రొఫెషన్‌లో తాను గొప్ప అని భావించానని చెప్పారు.



---

# నేను చేసిన పెద్ద తప్పు అదే..




ఇటీవలే 'తమ్ముడు' సినిమాతో రీఎంట్రీ ఇచ్చింది సీనియర్ హీరోయిన్ లయ. ఇందులో నితిన్ కు అక్కగా నటించి ఆడియెన్స్ ను మెప్పించింది. అయితే ఈ సినిమా కమర్షియల్ గా విజయం సాధించలేకపోయింది. అయినా లయ చేతిలో ప్రస్తుతం పలు సినిమాలున్నాయి. అలాగే పలు టీవీ షోల్లోనూ సందడి చేస్తూ బుల్లితెర ఆడియెన్స్ కు దగ్గరవుతోంది అందాల తార. ఒకానొక టైంలో తెలుగు ప్రేక్షకులకు ఇష్టమైన హీరోయిన్లలో లిస్ట్ లో ఫస్ట్ ప్లేస్ లో ఉంటారు లయ. టాలీవుడ్ లో చేసింది తక్కువ సినిమాలే అయిన తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఫ్యామిలీ హీరోయిన్ గా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు లయ. గ్లామర్ షోకు దూరంగా ఉంటూ ట్రెడిషనల్ గా కనిపిస్తూ అందం, అభినయంతో ప్రేక్షకులను కట్టిపడేసారు లయ. వేణు తొట్టెంపూడి హీరోగా నటించిన స్వయంవరం సినిమాతో తెలుగు తెరకు హీరోయిన్ గా పరిచయమైంది. మొదటి సినిమాతోనే నటిగా మంచి మార్కులు కొట్టేశారు లయ.. ఆ తర్వాత తెలుగులో అనేక చిత్రాల్లో నటించి మెప్పించారు. ముఖ్యంగా ఆమె ఫ్యామిలీ ఎంటర్టైనర్ చిత్రాలకు కేరాఫ్ అడ్రస్ గా మారిపోయిందీ ముద్దుగుమ్మ

హనుమాన్ జంక్షన్, ప్రేమించు, మిస్సమ్మ వంటి సూపర్ హిట్ చిత్రాల్లో నటించింది. మొన్నటివరకు సినిమాలకు గ్యాప్ ఇచ్చిన లయ ఇప్పుడు సెకండ్ ఇన్నింగ్స్ మొదలు పెట్టి సినిమాలు చేస్తున్నారు. మొన్ననే నితిన్ తో తమ్ముడు అనే సినిమా చేశారు లయ. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో చేసిన కామెంట్స్ ఇప్పుడు వైరల్ గా మారాయి. తన మొదటి సినిమా స్వయంవరం డైలాగ్ రైటర్‌గా ఉన్న త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో తన అనుబంధాన్ని ఆమె ప్రస్తావించారు. జగపతి బాబు మాట్లాడుతూ ఇప్పుడు జగపతి బాబు లుక్కే నచ్చింది. నేను కూడా ఆయనతో చాలా సార్లు చెప్పా.., ఇప్పుడు లుక్ లో చాలా స్మార్ట్‌గా ఉన్నారండి అని చెప్పాను. అని లయ పేర్కొన్నారు. ఆయన సాల్ట్ అండ్ పెప్పర్ లుక్ చాలా బాగుందని, అది ఆయన వయస్సును తెలియనివ్వడం లేదని అన్నారు లయ. అరవింద సమేత చిత్రంలో జగపతి బాబు భార్య పాత్ర గురించి మాట్లాడుతూ, ఆ పాత్రను తాను తిరస్కరించినట్లు తెలిపారు లయ. అది మరీ చిన్న రోల్ ఏమో అని అనిపించింది. నాకు నిజంగా తెలియదు. అది నేను కరెక్ట్‌గా చేశానా, తప్పు చేశానా అని అంటే నాకు తెలియదు కానీ చాలా పవర్‌ఫుల్ రోల్ మిస్ అయ్యాను." అని లయ అన్నారు. ఆ సమయంలో పూర్తి కథ వినకుండానే ఆ పాత్రను వదులుకున్నానని, అది ఒక తప్పుడు నిర్ణయం అని ఇప్పుడు పశ్చాత్తాపపడుతున్నట్లు తెలిపారు. ఈశ్వరీ రావు ఆ పాత్రను అద్భుతంగా పోషించిన విషయాన్ని కూడా ఆమె గుర్తు చేసుకున్నారు. ఇవే కాదు, ఇలాంటి తప్పు డెసిషన్స్ వల్ల తాను గతంలో అనేక సూపర్ హిట్ సినిమాలను కోల్పోయానని లయ తెలిపారు.

---

# ధనుష్‌తో ప్రేమ, పెళ్లి..

## స్పందించిన మృణాల్ ఠాకూర్ టీమ్..



ఇటీవల నటి మృణాల్ ఠాకూర్ తమిళ సూపర్ స్టార్ ధనుష్‌ను వివాహం చేసుకోబోతున్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ రూమర్స్ పై ఇప్పటివరకు అటు ధనుష్.. ఇటు మృణాల్ స్పందించకపోవడంతో ఈ వార్తలకు మరింత బలం చేకూరింది. ఈ సంచలనం తర్వాత మృణాల్ ఠాకూర్ తన మొదటి పోస్ట్‌ను విడుదల చేసింది. కొన్ని శబ్దాల తర్వాత ప్రశాంతత , విశ్వాసం, బలమైన నమ్మకం వస్తాయని తెలిపింది. మృణాల్, ధనుష్ కొంతకాలంగా డేటింగ్‌లో ఉన్నారని .. త్వరలోనే పెళ్లి చేసుకోబోతున్నారని టాక్ నడిచింది. మృణాల్ తన చిత్రం సన్ ఆఫ్ సర్దార్ 2 ప్రీమియర్‌లో ధనుష్‌ను పలకరించడానికి పరుగెత్తుకుంటూ వచ్చినప్పటి నుండి వారి ప్రేమ వార్త మొదటగా మొదలైంది. అభిమానులు ఇందుకు సంబంధించిన వీడియో షేర్ చేస్తూ ప్రేమలో ఉన్నారంటూ ప్రచారం స్టార్ట్ చేశారు. ఫిబ్రవరి 14, 2026న ప్రేమికుల దినోత్సవం నాడు ఈ జంట వివాహం చేసుకోవాలని ప్లాన్ చేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. దీంతో ఇప్పుడు మరోసారి వీరిద్దరి ప్రేమకథ తెరపైకి వచ్చింది. మృణాల్ లేదా ధనుష్ ఈ వాదనలను అధికారికంగా ప్రస్తావించలేదు. తాజాగా ఈ రూమర్స్ పై క్లారిటీ వచ్చినట్లు తెలుస్తోంది. నివేదికల ప్రకారం మృణాల్ సన్నిహితులు ఈ రూమర్స్ పై రియాక్ట్ అయ్యారట. మృణాల్ వచ్చే నెలలో వివాహం చేసుకోవడం లేదు. ఇది గాలివానగా మారిన ప్రచారం మాత్రమే అని మృణాల్ టీమ్ తెలియజేసింది. ఫిబ్రవరిలో మృణాల్ నటించిన సినిమా రిలీజ్ ఉందని, మార్చిలో మరో ప్రాజెక్ట్ ప్రేక్షకుల ముందుకు రాబోతుందని గుర్తు చేసింది. బిజీగా ఉన్న మృణాల్ ఇప్పుడు పెళ్లి చేసుకునే ఆలోచనలో లేదని స్పష్టం చేసింది.

Printed, Published & Owned by B.Srinivas, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar Medchel, Malkajgiri Dist. Hyderabad 500037 (T.S).
Published at Plot S11, 3rd Floor, Ballard Estate Margadarshi Building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B.Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, CELL : +91 8333068787